ద్రోణచరిత్ర

గ్రంథకర్త
చావలి శ్రీరామశాస్త్రి
గుంటూరు బాలికోన్నతపాఠశాలా
ప్రధానాంధ్రోపాధ్యాయుఁడు

వెల రు. ౧-౧౨-౦

[illegible]
[illegible]

First Edition	1921
Reprint	1923

Printed at the A. E. L. M. Press, Guntur.

విషయసూచిక

ఆ ఱ వ ప్ర క ర ణ ము.

ఏ డ వ ప్ర క ర ణ ము.

ఎ ని మి ద వ ప్ర క ర ణ ము.

తొ మ్మి ద వ ప్ర క ర ణ ము.

ప ది య వ ప్ర క ర ణ ము.

విజ్ఞాపన

—:o:—

ఆంధ్రభాషయందు మనకుఁ దొలుదొలుత లభించిన గ్రంథములలో నాంధ్రభారతము నిఖిల పండిత జనాంగీకృతమై యొప్పుచున్నది. ఇందలి కథలెన్నిసారులు చదివినను విన్నను, తిరిగి చదువవలె వినవలె ననెడు నాశ ప్రతిమానవునకును గలిగియుండును. అందుచేతనే "వినిన భారతమునే వినవలెను; తినిన గారెలనే తినవలెను" అను లోకోక్తి యాంధ్రదేశమందంతటను వాడఁబడుచున్నది. వినువారలకును జదువువారలకును, ఉత్సాహజనకంబగు గ్రంథమింతకంటె వేఱొకటి లేదనిన నిర్వివాదము.

తెనుఁగునఁ బ్రస్తుతము గద్య కావ్యములందు నవల లధికంబుగఁ బ్రచురింపఁబడుచున్నను మహాపురుషుల జీవితంబులును, చరిత్రంబులును, అధికంబుగఁ గాన్పింపవు. ఒకానొకప్పు డితర దేశములకన్న మన దేశ మెంతయో నుచ్ఛదశయందున్నదను విషయ మందఱకును విదితంబె. మన దేశపు దొల్లింటి యౌన్నత్యంబు గొంత తెలిసికొనవలెననిన మహాభారత రామాయణాది గ్రంథములఁ బేర్కొనఁబడిన మహాపురుషుల చరిత్రంబులు చదువుట యావశ్యకంబు.

కావున కురుక్షేత్రంబున మహావీరులగు కౌరవ పాండవులకు జరిగిన మహాసంగ్రామంబున, దుర్యోధను సేనాపతిత్వము వహించి తనయశంబు జగంబంతయు నిండించి వీర

స్వర్గంబు నలంకరించిన ద్రోణాచార్యుని చరిత్ర మాంధ్రవిద్యార్థులు, పద్యకావ్యముగనున్న భారతమందుఁ జదివి గ్రహించుట కష్టంబనియెంచి, విద్యార్థుల యుపయోగమునకై యేను గద్యరూపంబుగ భారతమందాచార్యునకు సంబంధించిన కథాభాగముల నన్నిటి నొక్కచోటఁ జేర్చి, యచ్చటచ్చటఁ గొంతమార్చి, దీనిని వ్రాసితిని. భారతమందలి శైలి దెలియుటకై, కొన్నిచోటుల నందలి పద్యములే వ్రాయఁబడెను. ఇందు కథానాయకుండు ద్రోణుండైనను సందర్భమునుబట్టి మఱికొన్ని కథ లచ్చటచ్చట వ్రాయవలసెను.

ఈద్రోణచరిత్రమును జదివినయెడల మన దేశమందలి పూర్వపుయుద్ధక్రమములును రాజనీతులును దెలియుటయే గాక భూసురులందును బూర్వము మహాశూరులుండిరని, యందఱకును దెలియును.

ఇందుఁ దప్పులున్నయెడల వానినిఁ బండితులగువారు వాత్సల్యంబునఁ దెలిపినఁ బునర్ముద్రణంబున సవరించుకొనియెద.

24—1—1921,
గుంటూరు. } చా. శ్రీ. శా.

నేనీ పొత్తమును దిరిగి ముద్రించుట కత్యంత ప్రోత్సాహ మొసంగిన పాఠశాలాధికారులకును, ఆంధ్రమహాజనులకును కృతజ్ఞుడను.

5—11—1925
గుంటూరు. } గ్రంథకర్త.

తొలిపలుకు

కథాచమత్కృతియందును, పాత్రపోషణమునందును, ప్రాచీన గ్రంథములందు భారతమును మించినది గానరాదు. కావుననె, "వినిన భారతము వినవలయు" ననులోకోక్తి గలిగెను. ఈగ్రంథ రాజముయొక్క సారమంతయును, భారత వీరుల చరిత్రములందును, అద్భుతజనకములగు వారిచర్య లందును నిమిడియున్నది. అట్టి మహాపురుషులలో ద్రోణా చార్యుఁడొకఁడు. ఈతనిచరిత్రము నీతికి నిధానము, ధైర్య స్థైర్యాది గుణముల కాకరము.

శ్రీ చావలి శ్రీరామశాస్త్రులుగారు మహాభారతకథ ననుసరించి యీద్రోణచరిత్రమును విద్యార్థుల యుపయోగా ర్థమై వచనమున రచించిరి. నాతికఠినమును, అనతిసులభము నగు శైలిలో నిది వ్రాయఁబడియుండుటచేత, ఉన్నతపాఠ శాలలలోని 4, 5, 6 తరగతుల విద్యార్థుల కిది పఠనీయగ్రం థముగ నుండుటకుఁ దగియున్నది. మూలగ్రంథములోనున్న కథ నేమాత్రము నతిక్రమింపకయె కథాసందర్భము లెంతో హృద్యముగ వర్ణింపఁబడియున్నవి. చదువరు లలవఱచుకొన వలసిన నీతులు మొదలగు నుదాత్తవిషయములు సారహీన ములగు మాటలతోఁ బ్రత్యేకముగఁ గొన్నిచోట్ల నేకరువు

పెట్టక, భారతగ్రంథము నందువలెనే సందర్భానుసారముగ ముఖ్యముగఁ గథయందే గ్రంథకర్త వానినిఁ జేర్చియున్నారు. అందువలన వేఱు ప్రయాసలేకయు, తమకుఁ దెలియకయు, కథ యందలి కుతూహలములతోఁ జదువరు లీవిషయములను గ్రహింపఁగలరు.

ఇంక నిటువంటి యుపయోగకరములగు పుస్తకములు వ్రాయు విషయమున గ్రంథకర్తకుఁ దగు ప్రోత్సాహము గలుగవలయునని కోరుచున్నాను.

Nellore, 25-1-1921.

(Sd). R. Venkata Sivudu M. A., L. T.,
Principal,
Venkatagiri Raja's College.

శ్రీరస్తు

ద్రోణచరిత్ర

వినఁ జింతించుచుఁ బాడుచుం బొగడుచుం, విదితచ్చారిత్రముల్
వినుచుం జాతురుగాక లోకు లితరాన్వేషంబులం గాంచరే
ఘన దుర్జన్మపరంపరాహరణదక్షంబై మహాయోగివా
గ్వినుతంబైన భవత్పదాబ్జయుగముల్ విశ్వేశవిశ్వంభరా!

—భాగవతము.

మొదటి ప్రకరణము

* ద్రోణునిజననము, విద్యాభ్యాసము *

శ్రీనారాయణ పాదపద్మ సేవానిరతుండును, జగద్వంద్యుఁడును, దపస్విజనాగ్రగణ్యుఁడు నగు భరద్వాజుండు కొండొకతఱి, గంగాప్రాంతతీరంబులఁ దపోనియతి నుండి, యొక్కనాఁడు పతితపావనీనామంబున విరాజిల్లు భాగీరథియం దవగాహనం బొనరింపఁ జనుదెంచి, యచ్చోట జలక్రీడాలాలసయగు ఘృతాచిఁగని మోహపరవశుండై యాదేవాంగనయం దొక్కపుత్త్రుం బడసి యాబాలునకు ద్రోణుఁడను నామంబిడి కడుగారాబంబునఁ బెంచుచుండ నాబాలుం డఖండ తేజశ్శాలియై పెంపుగాంచె.

ఆకాలంబున భరద్వాజసఖుండగు పాంచాలపతి పృషతుండనువాఁడు తపంబుసేయుచు నొక్కదినంబునఁ

దనయంతికంబునఁ బుష్పాపచయవినోదంబునఁ గ్రీడించుచున్న మేనకయను నప్సరోవనితయుం దొక్క పుత్త్రిం గనియె. పృషతుండును, బాలార్క తేజుండగు నబ్బాలునకు ద్రుపదుం డను నభిధానంబుగావించి, యాబాలు భరద్వాజాశ్రమంబున నిడి పాంచాలదేశంబుఁ బాలించుచుండె. అక్కారణంబునఁ గొంతకాలం బితండును భరద్వాజుచేఁ బెంపఁబడియె. ద్రుపదుండును ద్రోణునితోఁ గలసి యగ్నివేశుం డను మహామునియొద్ద వేదాభ్యాసంబుసేసి ధనుర్విద్యయు నభ్యసించి కొంతకాలంబునకుఁ దండ్రియనుమతిని పాంచాలదేశమ్మున కభిషిక్తుఁడయ్యె. ద్రోణుండును ధనుర్విద్యాపారంగతుఁడై యగ్నివేశు ననుగ్రహంబున నాగ్నేయాస్త్రాదిమహాస్త్రంబులఁ బడసి జనకు నాజ్ఞఁగైకొని సంతానార్థియై కృపుని సహోదరి కృపియనుదాని వివాహంబై యాపెయం దశ్వత్థామ యను పుత్త్రింబడసె. భారద్వాజుండును దారిద్ర్యంబుచేఁ బీడింపఁబడుచు, నెడతెగక భూసురుల కమితధనంబు నొసంగుచున్న పరశురామునిప్రసిద్ధివిని యాతనియొద్దకుంజనినఁ దన పేదతికంబు దొలంగుననియెంచి మహేంద్రపర్వతంబున నివాసంబుగానున్న పరశురాముని దర్శింపఁ బోయెను.

* పరశురాముని వృత్తాంతము *

పరశురాముఁడు జమదగ్నియను మహామునిసూనుండు. ఇతనికాలంబున హైహయవంశమ్మునందు సహస్రబాహువులతో జన్మించి నృపులందఱుఁ దనయాజ్ఞ శిరసావహించుచుండ

న్యాయంబుగఁ గార్తవీర్యార్జునుండను రాజు సప్తద్వీపంబుల నేలుచుండె. మఱియు నితఁడు వీతిహోత్రుండు తన్నాశ్రయింపఁ బర్వత నగరారణ్య గ్రామంబుల నతని కాహారముగా నిచ్చె. అక్కారణంబున నగస్త్యు నాశ్రమకాననంబు నతండు లేని సమయంబున దహించిన, నమ్మహానుభావుం డెఱింగి వచ్చి యాయగ్ని దేవునకు రక్షణం బాచరించుచున్న కార్తవీర్యుఁ జూచి కనలి "నీవు మదీయతపోవనంబు పరిహరింపక సామాన్యారణ్యమనెడు బుద్ధిని దహించితివి గావున, నీబాహువులు రాముఁడు నఱుకువాఁ"డని శాపంబిచ్చె. కార్తవీర్యార్జునుఁ డందులకు దుఃఖంబునొంది యధికభక్తితో ధర్మకార్యంబులు సలుపుచుండె. శాపకారణంబున నారాజునకు మహాబలవంతులు నవినీతులు నగు పుత్త్రులనేకులు జన్మించి, భూమండలంబున సంచరించుచుండిరి. ఒక్కనాఁడు రామునిజనకుండగు జమదగ్నియొక్క యాశ్రమంబునకుం బోయి, రాముఁడు లేనికాలమున, నాతని హోమధేనువును సవత్సంబుగా వారు మందిరంబునకుఁ గొనివచ్చిరి.

ఇట్లు తెచ్చుట కృతవీర్యసూనుం డెఱుంగఁడు. రాముఁడీ విషయమును గుర్తెఱిఁగి యత్యాగ్రహమునఁ జాపపరశుముఖ మహోత్కట శస్త్రాస్త్రంబులధరించి, యతిరయంబున సహస్రబాహునిమీఁది కుఱికె. సహస్రబాహుండును యుద్ధసన్నద్ధుండై నిలిచె. అంత నాయిరువురకును ఘోరసంగ్రామంబు జరిగెను. జమదగ్నిసూనుండును వానిహీనసత్త్వునిఁగా నెఱిఁగి వానిబాహుసహస్రంబుఁ దనపరశువున కాహారంబుగ నొసంగె.

కొన్ని దినములు గడచిన పిమ్మట కార్తవీర్యుని పుత్త్రు లత్యంత క్రౌర్యంబున జమదగ్ని శిరంబు దునిమి, మహా సంతోషంబునఁ జనుదెంచిరి. రాముఁడీవిషయంబు నంతయుఁ దన తల్లియగు రేణుక చెప్ప, రోషావేశ పరవశుఁడై తన కుఠారధారచే హైహయులం బరిమార్చి, భూమినంతను రక్తసిక్తగా నొనరించి, తపోవనంబునకుఁ జనియె.

పదంపడి బహువత్సరంబులు చనిన విశ్వామిత్రపుత్త్రుం డగు పరావసువను రాజవినీతుండై పరశురామునధిక్షేపించి, "రాజులకు వెఱచి డాగియున్నవాఁడ"వని విశిష్టజనసన్నిధిం బలికి బాలవృద్ధభావంబున నుపేక్షితులై యతనిచే మున్ను చావకయున్న రాజుల కొండఱ నుగ్గడించి, "వారు రాజులు కారా? నీవు వృథా ప్రతిజ్ఞాభిమాని"వనుఁడు నతండు మగుడ రోషముతోఁ గ్రౌర్యమును బూని, యా బాలవృద్ధముగ భూవరులనందఱ ఖండించె. మఱియు గర్భంబులనున్న యర్భకులను, బోరం దప్పిపోయి పుడమియేలు రాజులను గాలాంతరంబుల వెదకి వెదకి వధియించె.

ఇట్లిరువదియొక్కమాఱులు పుడమి క్షత్త్రియ రహితంబుగావించి యశ్వమేధంబు నేసి యాధరణియంతయు దక్షిణగాఁ గశ్యపునకొసంగిన నమ్ముని జామదగ్న్యుఁ జూచి "అయ్యా! అశ్వమేధంబున నీవు పుడమినంతయు నాకు దక్షిణగా నొసంగితివి గదా! అక్కారణంబున నీవిచ్చట నుండఁదగదు. దక్షిణసముద్రతీరంబునకుం జనుము." అని యిట్లందేని యేదో యొక విధంబున బ్రతికిన రాజులను బ్రతికించు తలంపునఁ బలికిన నమ్మునిశ్రేష్ఠుం

డల్లకాశయని పోవ దక్షిణసముద్రుండాతని వలని వెఱపున, శూర్పాకార ప్రదేశంబు కొంత యతనికి విహారస్థానంబుగా నిచ్చె. ఇవ్విధంబునఁ గశ్యపమునీంద్రుఁడు భూమియంతయుఁ బరిగ్రహించి భూసుర ప్రకరంబులకిచ్చి తపోవనంబునకుఁ జనియె. పరశురాముండును మహేంద్రపర్వతంబు తనకునివాసంబుగ నొనరించుకొని తపంబు సేయుచుండె.

* ద్రోణుఁడు హస్తిపురంబుఁ జేరుట *

అత్తఱి ద్రోణుండు పరశురామునొద్దకుం జనియాతనిఁ జూచి "నేనుభారద్వాజుండ, ద్రోణుండనువాఁడను. ధనార్థినై నీకడకేతెంచితి" ననిన పరశురాముఁడిట్లనియె: "నాధనంబంతయును భూసురోత్తముల కొసంగి చతుస్సముద్ర ముద్రిత భూమండలంబంతయుఁ గశ్యపునకిచ్చితిని. శరములును, శరీరంబునుమాత్రమే మిగిలియున్నవి. వీనిలోన నీవేదికోరిన దాని నిత్తు"ననియె. నావుడు భారద్వాజుండు శస్త్రాస్త్రములే యత్యుత్తమధనంబులనియు, వానినొసంగితివేని కృతకృత్యుండనగుదుననియుఁ బలికెను. వల్లెయని పరశురాముఁడొసగిన దివ్యాస్త్రములగ్రహించి ధనార్థియై తనబాల్యసఖుండైన ద్రుపదుపాలికిఁజని "నృప ద్రోణుండను, నీబాల్యసఖుఁడను, సహాధ్యాయుఁడను నన్నెఱుంగుదువా?" యని వినయపూర్వకముగాఁ బలికినవిని యుప్పలుకులు సహింపక ద్రుపదుండిట్లనియె:

ధనపతితో దరిద్రునకుఁ దత్త్వవిదుండగు వానితోడ మూ
ర్ఖునకుఁ బ్రశాంతుతోడఁ గడుఁ గ్రూరునకున్ రణశూరు తోడ భీ

ధనికు, దరూఢితోడ వరరూఢికి, సజ్జనుతోడఁ గష్టదు
ర్జనునకు నెవ్విధంబునను సఖ్యము దానొడఁగూడ నేర్చునే!

సమశీలశ్రితయుతులకు,
సమధనవంతులకు సమసుచారిత్రులకుం
దమలో సఖ్యమువివా,
హమునగుఁగా కగునె రెండునసమానులకున్?

మఱియు రాజులకుఁ గార్యవశంబుచే మిత్రామిత్రసంబంధమ్ములు కలుగుచుండును. కావున మావంటిరాజులకు మీయట్టి పేదవారితోఁ గార్యకారణంబైన సఖ్యంబెన్నఁడును గానేర"దని ద్రుపదుండైశ్వర్య గర్వంబునఁ బలుక ద్రోణుఁడు తదవమానజనిత కోపోద్దీపితుండై యేమియుఁ జేయునదిలేక పుత్రకళత్రాగ్నిహోత్ర శిష్యగణంబులతో హస్తిపురంబునకు వచ్చెను. అప్పుడప్పుర బాహ్య ప్రదేశంబునఁ గురుపాండవులందఱు కందుక క్రీడా పరులై వేడుకతో నాడుచుండిరి. తత్సమయంబున నాకాంచన కందుకంబొక నూతిలోఁబడి జలమందుఁ బ్రతిబింబించు తారకయో యన వెలుంగుచుండెను. రాజపుత్త్రులందఱును దానిఁదీసికొను నుపాయంబు గానక నివ్వెఱపడి చూచుచుండిరి. ధనుర్విద్యా విశారదుఁడగు ద్రోణుండప్పుడు శరపూరిత తూణీరంబుఁదాల్చి వారింజూచి,

« భరతకులప్రసూతులరు భాసురశస్త్ర మహాస్త్ర విద్యలం
గరముపరిసిద్ధులై పరఁగుగాతిమా శిష్యుల రిట్టిమీకు
దుష్కరమగు నూతిలోఁబడిన కాంచనపిండిగొనంగలేక
యొండొరుల మొగంబుసూచినగుచుండఁగఁ జన్నె యుపాయహీనతన్!

దీనినాయమ్ములచేనిప్పుడతీసియిచ్చెదఁజూడుఁడు. ఈవిద్యయెఱు
లెవ్వరు నెఱుఁగరు" అనియొకబాణంబభిమంత్రించి దృష్టి
ముష్టిలాఘవంబులొప్పనక్కందుకంబునాఁటనేసిదానిపుంఖంబు
మఱియొక బాణంబుననేసి తత్పుంఖం బొండొక యమ్మున
నాఁటి వరుసన బాణరజ్జువుగావించి దానిఁదీసియిచ్చినఁ జూచి
భూపనందనులందఱు నత్యాశ్చర్యమొందిభారద్వాజుఁడొడ్డా
నిచనిశాంతనవున కంతయు నెఱింగించిరి. గాంగేయుండును
కృశించిన నల్లనిశరీరముగలవాడును, మహాబల సంపన్నుఁడును,
గుణరత్నాకరుండును నగుద్రోణునిఁదాననివరకువినినట్లుచూచి
సంతుష్టస్వాంతుఁడై" అయ్యా! మీరెందుండియిచ్చటకేతెంచి
తిరి? మీయిష్టం బెయ్యది? మాకెఱిఁగింపుఁ"డనుడు నాభూసురు
డు శాంతనవునకిట్లనియె: "అయ్యా! యేనగ్నివేశుండను మహాము
నియొక్క బ్రహ్మచర్యాశ్రమంబున వేదాధ్యయన మొనరించి,
ధనుర్వేదం బభ్యసించుతఱిఁ బాంచాలదేశాధిపతియగు పృష
తుని పుత్త్రుండు ద్రుపదుండను వాఁడు నాకిష్టసఖుఁడై, యెల్లవి
ద్యలు నాతోనభ్యసించి, 'ఏను పాంచాలదేశంబునకు రాజైన
నాఁడు నాయొద్దకువచ్చునది. నారాజ్యభోగంబు లనుభ
వింప నీవును నర్హుండ'వని నన్ననేక విధంబులఁబ్రార్థించిచని,
తద్దేశంబునకుఁ దండ్రియనుమతిని రాజై యుండెను. నేనును
గురుని యనుజ్ఞానుసారినై పితృదేవతల ఋణంబుదీర్చుకొనుట
కై కృపియనుదానిఁబాణిగ్రహణంబు సేసి యధిక తేజస్సంపన్నుఁ
డైన యశ్వత్థామయను పుత్త్రుఁబడసి ధనహీనుండనగుటచేఁ
గుటుంబపోషణమం దసమర్థుండనై యుండియు దుష్టులవలని

ప్రతిగ్రహంబునకు సమ్మతింపక న్యాయమార్గావలంబినై యుంటిని.

"ఇట్లు దివసంబులు గడుపుచుండ ధనసంపన్నుల బాలురందఱు నుత్తమపదార్థంబుల భక్షించుచుండ నీతండు బాలుండగుటచే నాకు మధురపదార్థంబులు దెచ్చి పెట్టుఁడని యతిదీనత్వముతో వేఁడుచుండెను. దానిం జూచి దారిద్ర్యంబు కన్న నధికంబగు కష్టమెద్దియును లేదని నిశ్చయించి యొకరిన డుగఁబోవుట నీచంబని తెలిసియుండియుఁ దన ప్రాణమిత్రుని యాచించుట యుచితంబని నిశ్చయించి, ధనమీకున్నను దుదకు నాలుగు పాఁడిమొదవులనైన నీయఁడా యని యెట్టకేలకు హృదయంబు గట్టిపఱచుకొని, నా బాల్యసఖుండయిన ద్రుపదుండు తన దేశంబున కభిషిక్తుండుగాఁ బోవుచు నన్ను దన దేశంబునకు రమ్మని ప్రార్థించెఁగాన, నాతని యొద్దకుఁ బోయి నన్నెఱింగించితి.

"ఆతండును రాజ్యమదంబున నన్ను నన్నును గుర్తెఱుఁగక 'ఏను రాజను, నీవు పేదపాఱుండవు, నీ వెక్కడి స్నేహితుఁడ'వని నన్నవమానించెను. ఏనును దానిని సహించి యిట కరుదెంచితి" యని ద్రోణుఁడు తనవృత్తాంతమునంతను భీష్మున కెఱిఁగించె. భీష్ముండును వెమకఁబోయిన తీగ విస్మయంబుగఁ బదంబులకుఁ జుట్టుకొనియెఁగదా! యని సంతసించి, మహాభుజుండగు ద్రోణుని నభీష్టార్థసిద్ధునిఁగ నొనరించె. అంతఁ బితామహుండా భారద్వాజుం జూచి, "అయ్యా! ధనుర్వేదమునందును బ్రాహ్మసంపదయందును వింటినేర్పునను నయనైపుణ్యము

నందును నీవు జామదగ్న్యుతో సముండవని వినియుంటిని. వీరు నామనుమలు. వీరిని ధనుర్విద్యా పారంగతులుగా నొనరింపుఁడని ప్రార్థించి వారల శిష్యులనుగా సమర్పించెను.

* కౌరవపాండవులు ద్రోణునొద్ద విలువిద్య నభ్యసించుట *

ద్రోణుండును వారి శిష్యులనుగా గ్రహించి "మీలో నాయిష్టమును దీర్చువారెవ?" రని యడుగఁ గౌరవులందఱును మూఁగమొగమిడిరి. అర్జునుండొక్కండె "మీకోర్కె యే నెఱవేర్చెద" నని సమయంబు సేసెను. ఇట్లు తన యభీష్టంబు దీర్పంబూనిన నయ్యింద్రసుతుని నాచార్యుండు కౌఁగిలించికొని, యధికసంతోషంబునఁ గురుపాండవులకు విలువిద్య గఱపుచుండె. తత్సమయంబున నానా దేశంబులనుండి రాజపుత్రులనేకులు వచ్చి వీరలతోఁ గలసి విలువిద్య నభ్యసించుచుండిరి. రాజపుత్రులందఱిలో నరుండొక్కండుమాత్రమే విలువిద్యయం దధికుండై యత్యంత వినయంబున గురునిఁ బూజించుచు సంప్రీతునిగా నొనరించుచుండె. ఇట్లుండ నాచార్య పుత్రుండగు నశ్వత్థామ యర్జునునితోడి మాత్సర్యంబున, నన్నసాధకుఁ బిలిచి "యెన్నండును నరునకు నంధకారంబునఁ గుడువం బెట్టకు" మని నియమింప వాఁడును దద్వచనానుసారంబుగనే చేయుచుండెను. ఇట్లుండ నొక్కదినంబున వాసవి భుజించుచుండ మారుతాహతిచే దీపంబాఱిపోవ, నభ్యాసవశంబున నాతఁడెప్పటియట్లయన్నంబు భక్షించి, విద్యలన్నియు నిట్లే నభ్యసింప వచ్చునని నిశ్చయించి, యంధకారంబునందు నహితము విలువిద్యన

భ్యసించుచుండెను. ద్రోణుండు వానివిద్యావివేకంబునకు సంతసించి "నీకంటె ధానుష్కులధికులు లేకుండునట్లుచేసెద" నని వరంబొసంగి, ద్వంద్వయుద్ధములు సేయువిధంబును, సంకీర్ణయుద్ధముల తెఱంగును వాజివారణ రథంబులపైనుండి యేయు మార్గంబులును, ననేకవిధంబులగు వ్యూహమ్ముల భేదించు నుపాయంబులును బ్రయోగోప సంహారంబులును, నతిశయంబుగఁదొల్లి భార్గవుండు వింటనిట్టివాడే యని యెల్లజనులు స్తుతించున ట్లర్జునకు నేర్పెను.

* ఏకలవ్యుని వృత్తాంతము *

మఱియు గదాకార్ముకప్రాసాసితోమరకుంత శక్త్యాది వివిధాయుధంబులందును రాజనందనులజితశ్రములఁ జేయుచున్న భారద్వాజుని మహాప్రసిద్ధివిని హిరణ్యధన్వుండను నెఱుకరాజు పుత్త్రుండొకఁ డేకలవ్యుండను వాఁడు విలువిద్యనభ్యసించుటకై యాచార్యునొద్దకువచ్చిన నాయాచార్యుండు రాజనందనులకె విలువిద్యగఱపుటకు నియమింపఁబడినందున వానిశిష్యుగా గైకొనఁడయ్యె అంతవాఁడునుద్రోణునాజ్ఞ ననుసరించిమృత్తికతో ద్రోణురూపునమర్చి దానికి భక్తితోఁ బ్రదక్షిణనమస్కారములొనరించుచు సంతతాభ్యాసవశంబున నస్త్రవిద్యారహస్యంబులన్నియుఁ దెలిసికొని యుండెను. ఇట్లుండఁ బాండవకౌరవులొక్కతఱి గురుననుజ్ఞఁబడసి, మృగయాసక్త చిత్తులై జవసత్త్వసంపన్నులైన భటులతోడను, సారమేయంబులతోడను, వనంబునకరిగి పెక్కుమృగసంతానంబులఁ బొలియించిరి. అం

దొక్క భటునికుక్క తప్పించుకొని, యొంటరిగ విలునభ్యసించుచున్న యేకలవ్యుని సమీపంబున శ్రుతికఠోరంబుగ మొఱిఁగిన, నయ్యేలుంగువిని దానిముఖంబున నతండయిదు బాణంబులమోఘలాఘవంబునఁ బ్రయోగించె. అదియును శరపూరితముఖంబై కురుకుమారుల యొద్దకుంబోయిన, దానింజూచి వారు విస్మయంబంది “యిట్లేసినవాఁ డెవ్వఁడో?” యని రోయుచు ముందటదృఢగాత్రుఁడును, కృష్ణాజినవస్త్రుండును, బాణహస్తుండునై యొప్పుచున్న యొక్క యెఱుకువానిఁజూచి, రాజకుమారులందఱు మాత్సర్యగ్రస్తులై యన్యోన్యముఖావలోకనవ్యాజంబునవానిఁ జూడనైరి.

పిమ్మట రాజకుమారులు వాని శరలాఘవంబునకు మెచ్చి “నీవెవ్వండవు? ఎవ్వరిచే విలువిద్యగఱచితి”వని యడిగిన, వారికి నయ్యెఱుకిట్లనయె. “ఏను హిరణ్యధన్వుండను వనచరరాజ పుత్రుండ, ద్రోణాచార్య శిష్యుండ, నన్నేకలవ్యుఁడందురు.” అనినవిని రాజకుమారులందఱు నత్యాశ్చర్యముతో మగిడివచ్చి ద్రోణునకంతయు నెఱిఁగించిరి. అంత నర్జునుండు మహావిచారంబుతో ద్రోణునొద్దకుంజని “సత్యవ్రతా! విలువిద్యయందు ‘నీకంటె నొరులెవ్వరును నధికులులేకుంటునట్లు చేసెద’నని మున్ను నాతోఁ బలికితిరి. నాకంటెను, మీకంటెను నధికుండగు నొకయెఱుకువానిం జూచితిమి. ధనుర్విద్యాకౌశలంబున నట్టివానిఁ ద్రిలోకంబులందును గానము. అతఁడు మీప్రియశిష్యుఁడఁట. కడుఁజిత్రముగనున్న”దని ఇట్లు రాజకుమారులందఱు నేకవాక్యంబుగఁ బలుక. నాచార్యుండదరిపడి ‘వానిం

జూతమురా'మ్మని యర్జును వెంటనిడుకొని, తదేకనిష్ఠతో ధనుర్విద్య నభ్యసించుచున్న యేకలవ్యుకడ కేఁగిన వాఁడు నెదురుగాఁ జనుదెంచి ద్రోణునకు మ్రొక్కి తనశరీరంబునంతయు వానికి సమర్పించి "అయ్యా! ఏనుమీ శిష్యుఁడ. మిమ్మారాధించి యీవిద్యనభ్యసించుచున్నాఁడ" నని మహావినయంబునఁ గరంబులు జోడించుకొనియున్న వానిఁ జూచి, 'యట్లయిన మాకు గురుదక్షిణని'మ్మని ద్రోణుఁ డడుగ సంతసించి వాఁడిట్లనియె. "ఇదియె నాశరీరంబు. ఇదె నాధనంబు. వీరె నాసేవకులు. వీనిలో నీకెయ్యది యిష్టమొ, దాని గ్రహింపు" మనియె. ద్రోణుండును సంతసంబున వానింజూచి, "ఓయీ! నీదక్షిణకరంబునఁ బెనువ్రేలు దునిమి నాకు దక్షిణగానిమ్ము. ఇదియె నాకోర్కి" యనఁ దత్క్షణమే యతఁ డట్లుగావించె.

క. దక్షిణాంగుష్ఠ మిచ్చినదానఁ జేసి,
బాణసంధాన లాఘవభంగమయిన
నెఱుకు విలువిద్యకలిమికి హీనుఁ డయ్యెఁ
బార్థునకు మనోరుజయును బాసెనంత!

రెండవ ప్రకరణము

* ద్రోణుఁడు తన శిష్యులఁ బరీక్షించుట *

ఇట్లు గురుండు విలువిద్యయందుఁ బార్థునికంటె నధికుండగు వాఁడు లేకుండునట్లు చేసి శిష్యవాత్సల్యముఁ జూపె. మఱియు భూపనందనులందఱును విద్యాదానంబునకు నాచా

ర్యవకు సములయ్యెను విద్యాపరిశ్రమ కౌశలంబున నరుం డుత్తమోత్తముం డయ్యెను. అంత ధార్తరాష్ట్రులు నరుని కార్ముక కౌశలంబును, పవననందను బలసంపదయును, సహింప నోపక మిగుల వగచుచుండిరి. ఒక్కనాఁడు ద్రోణుండు రాజపుత్త్రుల విద్యాపరిశ్రమంబుఁ బరీక్షింపఁగోరి యొక్కవృక్షశాఖాగ్రంబునఁ బక్షినొక్కదాని వ్రేలాడఁగట్టి దానినందఱకుఁ జూపి "మీధనువులందు బాణంబుల సంధించి నేఁబంచినప్పుడి పక్షితలఁదెగనేయుఁడు. ఏ నొక్కొక్కరిని బంపెద" నని తొల్తఁ బాండవాగ్రజుఁ బిలిచి "యీవృక్షశాఖాగ్రంబుననున్న పక్షిని బాగుగ వీక్షించి మద్వచనానంతరంబున శరంబువిడువు" మనిన నతండువల్లెయని గురునాజ్ఞకై యెదురుచూచుచున్న సమయంబున యమనందనుంజూచి ద్రోణుండు "ధర్మనందనా! వృక్షశాఖాగ్రంబుననున్న పక్షిశిరంబు బాగుగఁ జూచితివా?" యనిన ధర్మజుండు "చూచితి"ననియె. మఱియు నగ్గురుండు "నన్నును, నీసోదరులను జూచితివా?" యని తిరిగి ప్రశ్నించిన నాతండు "వృక్షంబుననున్న పక్షిని మిమ్ములనుజూచితి"ననియె. అంతఁ బాండవాగ్రజుంజూచి యాచార్యుండు "నీదృష్టిచెదరె. నీవు దీని నేయనోపవు. పొమ్ము" మని యిట్లే దుర్యోధనాది ధార్తరాష్ట్రులను, భీమసేన నకులసహదేవులను నానాదేశాగతులైన రాజకుమారులను క్రమంబుగ నడిగిన వారలు యుధిష్ఠిరుండు చెప్పినట్లె చెప్పిరి. అప్పు డాచార్యుఁడింద్రనందనుఁజూచి మునుపటివలెనే యాతని నడుగ నతండు "పక్షిశిరంబుఁ జూచితినిగాని, మఱేమియుఁ జూడ" ననియె.

గురుండును వానిసూక్ష్మబుద్ధికి సంతసించి "పక్షి నేయు"మని యాజ్ఞాపించె. నరుండును వల్లెయని శరవిమోక్షణంబు సేయ, నప్పక్షితల యమ్మహీరుహశాఖాగ్రంబునుండి భూమిపై బడియె. ఇట్లనాయాసంబుగఁ గృత్రిమపక్షిశిరంబుఁ దెగ నేసిన నయ్యర్జును నచలిత దృష్టికిని లక్ష్యవేదిత్వంబు నకును మెచ్చి, యాచార్యుండు ధనుర్వేదమందలి రహస్యంబులన్నియు నాతనికిఁ గరతలామలకంబుగ నుండునట్లుపదేశించెను. ఒకానొకదినంబున భారద్వాజుండు భాగీరథీస్నానార్థ మరిగియుండు మహానియమముతో స్నానము సేయుచుండ నొక్కమకరంబు శిష్యులందఱు బెదరిపోవునట్లుగా నాచార్యు చిఱుఁదొడఁ బట్టుకొనియె. దానివిడిపించుకొనుట కాతండు సమర్థుండయ్యును శరసజ్యచాపశోభితకరులగు నృపనందనులను జూచి "యామకరంబును విడిపింపుఁ"డని యాజ్ఞాపించె. వారును గన్నులకగోచరంబగు దానినేయుట కలవిగాక, శిరంబులువంచి యూరకుండిరి. మహాతేజుండగు నింద్రసూనుం డైదుబాణంబులనాటి యమ్మహాగ్రాహంబును ఖండించి గురున కమితానందంబుఁ గల్పించె. ద్రోణుండు కొన్ని దినంబులు గడచినపిమ్మట రాజకుమారుల విద్యాకౌశలంబు కృష్ణద్వైపాయన విదుర గాంగేయ శకుని సోమదత్తాదుల సమక్షంబునఁ జూపఁదలంచి, యొక్కనాఁడు ధృతరాష్ట్రమహీవల్లభుం గనుంగొని "అధిపా! రాజనందను లందఱు శస్త్రాస్త్రవిద్యలందు నిపుణులైరి. కావున వీరలకోదండ విద్యాపాండిత్యము భవదీయ సభయందుఁ బ్రదర్శింపఁబడవలె"నని విన్నవించెను. "అట్లుచేయు

డు"నని వైచిత్రవీర్యుండు "కుమారుల విద్యాసందర్శన రంగంబు రమ్యంబుగఁ జేయింపు"మని విదురు బంచినఁ బతండు వల్లెయని, శాస్త్రవిహిత ప్రమాణవ్యాప్తాయామంబుగను, వృక్షగుల్మవల్మీక. రహితంబుగను, సమీకృత నిమ్నోన్నత ప్రదేశంబుగను, కంటకపాషాణశల్యరహితంబుగను జేయించె. మఱియు బహువిధప్రేక్షాగారమంచక ప్రపంచంబుల విరచించి నానాధ్వజ నవపల్లవతోరణ పుష్పమాలాలంకృత ద్వారదేశంబుగనొనర్చి, యన్నిదిశలందును శాంతిక బలివిధానంబులఁ గావించె. అంతనొక్క పుణ్యదివసంబున సుముహూర్తంబున ధృతరాష్ట్రుండు గాంధారీపురస్సర దేవీశతపరివృతుండై నానావిధభూషణంబుల ధరించివిరాజిల్లు ననేకవిలాసినీనివహంబుతోఁ జనుదెంచి, స్థూలముక్తాఫల దామరమణీయంబై, నవరత్న స్థగితంబై యతిమనోహరంబైన సువర్ణమయప్రేక్షాగారంబుననుండె. అత్తఱి నచ్చోటనున్న సుందరీబృందంబు నానావిధరత్నంబులచే విరాజిల్లు మేరు మహీధర కందరాంతరంబుననున్న దేవాంగనా బృందంబు ననుకరించియుండె. కుంతియును దనసుతుల విద్యాప్రవీణతఁ జూచు వేడుకతో రాజసన్నిధిని గాంధారరాజపుత్త్రికెలననుండె. వ్యాసాదిభూసుర నివహంబును, కృప, శల్య, గాంగేయ, విదుర, శకుని, సోమదత్త ప్రభృతి, గురు, బాంధవ, మిత్త్ర వర్గంబును, మంత్రిసామంత మండలేశ్వర సమూహంబును, గాయక వైతాళిక ప్రవరులును, దమతమ నియమితస్థానంబుల వరుసగ నాసీనులైరి. భేరులు భోరనిమ్రోసె. అస్త్రసం

దర్శనాగతులైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాది వివిధవర్ణంబుల కలకలధ్వనులు ప్రళయకాల సంక్షోభితాంభోనిధి స్వనంబు ననుకరించియుండె. అయ్యవసరంబున నాచార్యుండు శుక్లాంబరాభరణమాల్యానులేపన యజ్ఞోపవీత పలితకేశశ్మశ్రుశోభితదేహుండై, విముక్త మేఘజాల వియన్మధ్యంబున, నంగారకసహితుండై రాజిల్లు ప్రభాకరునివలె, నశ్వత్థామ సహితుండై రంగమధ్యంబున వెలుంగుచుండె. రాజనందనులందఱును, తనుత్రాణంబులు ధరించి మార్గణపూర్ణతూణీరులై కోదండాలంకృత హస్తంబులతో ద్రోణుని పిఱుంద జ్యేష్ఠానుపూర్వంబుగా నిలిచియుండిరి.

ఇట్లుండి యాచార్యు ననుమతిని దృఢలాఘవంబు దోఁపునట్లుగ నసిచర్మకౌశలంబులను జూపువారు కొందఱును, దమనామంబులచేఁ జిహ్నితంబులయిన శరములనులక్ష్యముగా నేయువారు మఱికొందఱును, గజాశ్వరథారోహణంబులందుఁ దమసామర్థ్యంబుఁ బ్రకటించువారు మఱికొందఱును, వివిధాయుధ కౌశలంబులఁ జూపువారు కొందఱునుగా, కౌరవ పాండవులు రాజనందనులంగలసి తమవిద్యానైపుణ్యంబు నెల్ల రాజులునుజూచి సంతసించునట్లు రంగమధ్యంబున వెలుంగుచుండిరి.

* కౌరవపాండవులు ద్రుపదుఁబట్టఁ జనుట *

మఱునాఁడు ప్రభాతసమయంబున నాచార్యుండు తన శిష్యులనందఱ రావించి "నాకుగురుదక్షిణ యిం"డనిన నం

దణును మ్రొక్కి యెదురనిలిచి "మీకేద్దియిష్టంబు సెప్పుఁ" డనిన నాతండు "రాజ్యమదాంధుఁడై కన్నుగానకయున్న, పాంచాలపతియగు ద్రుపదుఁబట్టి తెండు. ఇదియ నాకుసంతసం" బనిన వారునువల్లెయని రథంబులెక్కి కృపాణకార్ముకంబుల ధరించి దిశలుభేదిల్లునట్లు సింహనాదంబులుసేసి, యసంఖ్యబలంబులతోఁ బాంచాలుపురంబు ముట్టడించిరి. పాండవులును రథంబులెక్కిద్రోణునితోడఁగూడి వారివెంటనడిచిరి. తత్సమయంబునఁ బార్థుండాచార్యుంజూచి "కౌరవులు మహాగర్వంబున నొండొరులఁ గడచి ద్రుపదునిపైఁ బోవుచున్నారు. ఆతండు ధనుర్విద్యాపారంగతుఁడును, భవత్సఖుఁడును, శౌర్యాన్వితుండు నగుటచే, వీరలకుఁ బట్టుపడండు" అనియిట్లాచార్యుతో సంభాషించుచుఁ బాండవులును బాంచాలు పురంబు సమీపించిరి. అంతకుముందుచనిన దుర్యోధనాదులయిన ధార్తరాష్ట్రు లనేకరాజనందనులఁ గలసి పాంచాలుపురం బవరోధించిన, ద్రుపదుండును బ్రళయకాలమార్తాండునిపగిది వెలుంగుచుఁ, జతురంగబలంబులతోఁ గౌరవుల నెదుర్కొని, నవవర్షజలధరంబురుధారాజలంబుల సరసిజంబులఁ గప్పుచందంబున, శరనికరంబులఁ గప్పిన నప్పు డుభయసైన్యంబులకును ఘోరసంగ్రామం బయ్యె.

కౌరవులును బాంచాలబలంబుపై నానావిధాస్త్రంబులఁ బ్రయోగించి రవికిరణజాలంబులేర్పడకుండ నవరోధంబుగావించిరి. అంత ద్రుపదుం డతికుపితాత్ముండయి యొక్కముహూర్తంబునఁ గౌరవసైన్యంబు నురుమాడిన, నాతని

బాణవృష్టికి నిలువఁజాలక, కౌరవులు పాండవులున్న దిక్కునకుఁ బఱతెంచిరి. అయ్యవసరంబున నరుం డాచార్యధర్మజులకు నమస్కరించి, "మీరలిచ్చోటనె యుండుఁడు. నేనీక్షణంబ ద్రుపదుఁ బట్టి తెచ్చెద"నని విజృంభించి భీమసేనుండు సేనాధిపతిగను, కవలు చక్రరక్షకులుగను దనకు సహాయంబుసేయుచుండ ద్రుపదరాజవాహినీ సాగరంబు నలూపించె. అత్యతిభయంకరంబగు తనగదాదండంబు గిరగిరఁద్రిప్పుచు, వృకోదరుండు వేదండతండంబులఁ గూల్చి పేదమానిసుల నేయక, తన్నెదిర్చిన శూరాగ్రేసరుల యమాలయంబున కతిథులఁ జేయుచుండె. తత్సమయంబున నింద్రనందనుం డవార్యపరాక్రమాభిరాముండయి ద్రుపదుని గజాంధకారంబును, నశ్వతుహినంబును, భటతారాసముదయంబును, దనశరకిరణజ్వాలలచే శాంతిఁబొందించి యపరప్రభాకరుని చందంబున సంగరరంగంబున వెలుంగుచుండెను. దానిసహింపక శౌర్యధుర్యుఁడగు పాంచాలపతి తమ్ముఁడు సత్యజితుఁడనువాఁడు సజ్యచాపధరుండై నూఱు వాఁడి శరంబులఁ గవ్వడిసేయ నాతండతి కుపితుండయి వానినన్నింటి నతిలాఘవంబున నడుమన నఱికివైచె. మఱియు దివ్యాస్త్రవిదుండగు నన్నారాయణ సఖుండు క్రూరనారాచంబుల వాని యశ్వంబులను, సారథిని జంపి విరథుంజేయ, భయపడివాఁడు నయ్యుగ్రాహవమునకు విముఖుండయ్యె. పదంపడి ద్రుపదుండు రోషావేశపరవశుండగుచు, దండధరునిభంగి నయ్యింద్రనందను మార్కొనియె. శూరాగ్రేసరులగు నప్పాంచాలకౌంతేయులు పరస్పరజయకాంక్షులైపోరు ఘోరంబుగ

గావించునెడఁ, దక్కిన యోధులందఱును యుద్ధంబుసేయనేరక నివ్వెఱపడి చూచుచుండిరి. అమ్మహాసంగ్రామంబున ద్రుపదుండు విజృంభించి, యొక్కబాణంబున నప్పాండవమధ్యము చాపంబుఖండించి, యార్చిన, నవ్వాసవసుతుండు దండతాడిత భుజంగంబు చందంబున నుగ్రుఁడయి, ఖడ్గంబుధరించి గజంబుపై నుఱుకు సింగంబు వగిది పాంచాలునరదంబుపై దుమికి, వానింబట్టుకొనినఁ దత్సైన్యంబు హాహారవంబులతో మహాసాగరంబుభంగి ఘోషించుచుండె.

పార్థుండిట్లు మహాగర్వాంధుఁడగు ద్రుపదు నరదంబునకుఁ గట్టితెచ్చి, యాచార్యునకు గురుదక్షిణగా నర్పించి, యాతనికి మహానందంబు గల్పించె. ద్రోణుం డప్పుడు ద్రుపదునిఁ జూచి నవ్వుచునిట్లనియె.

"వీరవర్యరయ్యా! ద్రుపదమహారాజా! యిట్లు కృపణులయి పట్టువడితిరా,
మీరికి వలసెనె! యహహా! మహారాజ్యమదాంధకార మది వాసెనొకో!
ఇంకనైన మమ్మెఱుఁగంగనగునొకో—"
యనుచు నుల్లసంబులాడి ద్రుపదు
విడిచి పుచ్చె గురుఁడు విప్రుల యలుకయుఁ
దృణహుతాశనంబు దీర్ఘమగునె?.

ఇట్లు ద్రోణుచే నవమానింపఁబడి పాంచాలపతియుఁ గోపపాశబద్ధుండగుచు నప్పరిభవంబునకుఁ బ్రతీకారంబుసేయఁ దలఁచి భూసురుల సేవించుచుండె. భారద్వాజుండును వాసవనందను నమానుషకర్మంబునకును, దనవలని భక్తిస్నేహంబు

వకుఁడు, మెచ్చి బ్రహ్మశిరంబను దివ్యాస్త్రంబు వానికి సప్రయోగ నివర్తనంబుగా నిచ్చి "ఈ యస్త్రరాజంబ గస్త్యుఁడను దివ్యమునీంద్రుఁడు మహాప్రీతితో నగ్నివేశుం డను మునీంద్రున కొసఁగె. ఆతండు నాకిచ్చె. నేననుక్రమంబున నీకిచ్చితిని. మహాతేజస్సంపన్నుఁడ వగుటచే దీనిఁ ధరింప నీవ యోగ్యుండవు. దీని నల్పతేజులగు మానవులందు బ్రయోగింపకుండునది. ప్రయోగించితివేని నిన్నును లోకంబులను దహించును. భవత్ప్రాణాపాయంబు సంభవించెనేని యప్పుడు శత్రులపైఁ బ్రయోగింపుము" అని దాని మహిమనంతయు నర్జున కుపదేశించి "నీవు నాకు నీయుపదేశకాలంబున గురుదక్షిణ నొసఁగు"మని పలికె. కవ్వడియు "నీయభీష్టంబుఁ దెల్పుఁ"డని వేఁడిన "నేను నీతోఁ సంగ్రామంబొనరించునపుడు నాతోఁ బ్రతియుద్ధంబు సేయకుము. ఇదియ నాకుఁ బరమసమ్మతంబగు దక్షిణ" యనియె. అర్జునుండును దానికి సమ్మతించి, యాచార్యునకు నమస్కరించి యాతని భక్తితో సేవించుచుండె.

మూఁడవ ప్రకరణము

* పాండవధార్తరాష్ట్రుల భేదకారణము *

దుర్యోధనుండు తనతండ్రియగు ధృతరాష్ట్రమహీపతి యనుమతిని ధర్మజుండు యువరాజుగా నుండుటకును, నాతని తమ్ములగు భీమార్జున నకులసహదేవులు మహాపరాక్రమవంతులై యుండుటకును, సహింపక కర్ణశకుని, దుశ్శాసనులతోఁ

కలసి దుఃఖించుచుండెను. మఱియుఁ బాండుమహీపతి పరలోకగతుఁడైన పిదపఁ బాండవులు హస్తిపురంబున ధృతరాష్ట్రునొద్ద నాతనిసుతులతోఁ గలసి ధనుర్వేదాది విద్యలనభ్యసించుచు, మహాతేజోవంతులయి యుండ, వారల గుణోన్నతి సయిరింపఁజాలక నిష్కారణముగ వారలకుఁ గీడుసేయుచుండెను. అకారణవిగ్రహంబును, గరుణలేకుండుటయును, బరధన, పరదారాభిలాషయును, సుజన బంధుజనాసహిష్ణుత్వంబును, దురాత్ములకు స్వాభావికంబులుగదా! పాండవులు ధర్మాత్ములగుటచే సుయోధనుండు సేయు క్రూరకర్మంబులకు లోవడరైరి.

ఎట్లనిన నొక్కనాఁడు సుయోధనుండు జలక్రీడాపరిశ్రమంబుచేనలసి నిద్రించుచున్న భీమసేనుని లతాపాశబద్ధుం జేసి గంగాతరంగిణియందుఁ ద్రోచిన నాతండు ఘనసత్త్వుఁడగుటచేఁ దద్బంధంబులెల్లఁ దెగసీల్చి మీఁదికినెగసె. మఱియునొక దివసంబున వ్యాయామంబుచే నలసి సుఖసుప్తుండయి యున్న వాని సర్వాంగంబులందును గృష్ణసర్పంబులచేఁ గఱపించిన, నాతండు వజ్రమయదేహుండు గావునఁ దద్విషదంష్ట్రలు వానిమేన నాఁటవయ్యెను. కొండొకతఱి నాతండు భుజించుచుండ వాసియన్నంబున విషంబుఁ బెట్టింప నాతండు దివ్యపురుషుండు గావునఁ దద్విషం బన్నంబుతోడ జీర్ణంబయ్యె. ఇట్లు దుర్యోధనుండు సేయు హింసాకర్మంబులన్నియు విఫలంబులై పోవ నాతండు వారణావతంబునం దొకలాక్షాగృహంబు నిర్మించి, యాశ్చర్యంబుగఁ బాండవులనందుఁ బ్రవేశపెట్టి

యొక్కనిశాసమయంబున ననలంబు దరికొల్పినఁ బాండునందను లాక్రూరకర్మంబు విదురువలన నెఱింగి తదుపదిష్ట భూవివరంబున వెలువడి సజీవులై సుఖంబుగ నుండిరి. న్యాయమార్గావలంబులై లోకహితంబుఁ గోరుచు సత్యవ్రతులగు వారల దైవంబు రక్షించుచుండునుగదా!

ఇట్లు పాండవులు వారణావతంబునుండి వెలువడి జననీ సహితముగ నొక్కవనంబునకుం జనిరి. అవ్వనంబున వృకోదరుండు హిడింబాసురుం జంపి వాని చెల్లెలి హిడింబయనుదాని వివాహంబఁడి, యచ్చోటనుండి గదలి యేకచక్రపురంబున భూసురాగ్రహారంబునఁ గ్రూరాత్ముండగు బకాసురుం దెగటార్చి యప్పురవాసులగు భూసురులకమితానందంబు గల్పించి పిమ్మట నందఱును విప్రవేషంబులతో ద్రుపదుపురంబునకుఁ జన, నందు ద్రౌపదీస్వయంవరంబున నర్జునుండు సకల రాజసమక్షంబున మత్స్యయంత్రంబుఁ దెగనేసి ద్రౌపదిం జేకొనె. అంతగురువచనంబునఁ బాండవులేవురును నామెను వివాహంబై పాంచాలపురంబున నొక్కవత్సరంబుండిరి.

దీనినంతయు నెఱింగి ధృతరాష్ట్ర మహీపతి వారల రావించి, యర్ధరాజ్యమునొసఁగి యింద్రప్రస్థపురంబున వారల నుండఁబనిచిన, వారలు సుఖంబుగ నచ్చట రాజ్యంబుఁ జేయుచుండిరి. పార్థుండును ద్వారకానగరంబునకుఁ జని యచ్చట శ్రీకృష్ణుని చెలియలగు సుభద్రయనుదాని వివాహంబై మహావీరుండగు నభిమన్యుఁడను కుమారునిం గనియె. మఱియు ఖాండవదహనంబున నగ్నిదేవునిఁ దృప్తుం జేసి, యాతనిచే దివ్యరథం

బును, దివ్యాశ్వంబులను, గాండీవంబను కార్ముకంబును, దేవదత్తంబను శంఖంబును, నక్షయబాణతూణీరంబులను బడసి, యత్యంత విభవాభిరాముండై యుండె. ధర్మజుఁడు మయుం డను దానవ విశ్వకర్మచే సభాలాభంబు నొంది, వృకోదరునిచే మాగధుఁ జంపించి, భూమండలంబునం గల రాజులనందఱ జయించి, రాజసూయ మహాధ్వరంబు నొనరించె. ధార్తరాష్ట్రాగ్రజుండు దీనిం జూచి సహింపక మాయాద్యూతంబున ధర్మజుని జయించి పండ్రెండు వత్సరంబులు వనవాసమ్ము సేయునట్లును, నొకవత్సరంబు జనపదంబున నజ్ఞాతవాసంబు సేయునట్లును సమయంబు సేసి పురంబు వెలువరించినం జని పాండవు లరణ్యావాసంబు సేయుచుండిరి. ఇట్లు డవుల నిడుమలం గుడుచుచుం బారాశర్యుని యుపదేశంబున నర్జునుండు సదాశివు నారాధించి, యాతని యనుగ్రహంబునం బాశుపతంబను దివ్యాస్త్రలాభంబు నొందె. దేవతలధికప్రీతితోం దమతమ యస్త్రంబుల నొసంగి యాతని గౌరవించిరి. ఇటుల దివ్యాస్త్రలాభంబు నొందియు, ధర్మతత్పరులగు కౌంతేయులు తాము మున్నొనర్చిన సమయంబు ననుసరించి, యరణ్యావాసంబును నజ్ఞాతవాసంబును సలిపి, "తమయర్ధరాజ్యమ్ము తమకి"మ్మని దుర్యోధనుని వేఁడికొనిరి. "దుదకయిదూళ్ళయినను మాకొసంగినం జాలు"ననిరి. లోభియగు నాధార్తరాష్ట్రాగ్రజుండు రాజ్యము పంచియిచ్చుట కియ్యకొనఁడయ్యె.

అంత వాసుదేవుఁడాదిగాఁ గల బంధువులును, గాంగేయాది కులవృద్ధులును, ద్రోణాది గురువర్యులును, గణ్యాదు

లగు మునిశ్రేష్ఠులును, ఎన్ని విధంబుల నాదుర్యోధనునకు న్యాయంబుగ హితంబుపదేశించినను, "వాఁడిగల సూదిమోపిన మాత్రంబేని భూమిపంచియియ్య"నని తన లోభగుణంబును వెల్లడించెను. తుదకుఁజేయునదిలేక పాండవులు దండోపాయంబె శరణంబని నిశ్చయించి ధర్మక్షేత్రంబగు కురుక్షేత్రంబునఁ దమబలంబులఁగలసి యుద్ధసన్నద్ధులయి యుండిరి.

* గాంగేయు సేనాధిపత్యము *

అత్తఱి దుర్యోధనుండు తనపితామహుండును, మహాశూరుండునగు శాంతనవుని సేనాధిపతిగనుండుఁడని ప్రార్థించిన నతండును చేయునదిలేక యందుల కొడంబడియె.

ఈ శూరాగ్రేసరుండు శంతనుండను మహారాజునకు గంగవలన జన్మించి, కాశీరాజ దుహితయగు నంబ నిమిత్తమై పరశురామునితో మహా సంగ్రామంబొనరించి, యాతని జయించె. మఱియుఁ దనతండ్రియగు శంతనుండు సత్యవతి యనుకన్యను వరించి తత్పాణిగ్రహణంబునకై కృశించుచుండఁ దెలిసికొని మహారాజసమూహంబున నీతండు "వివాహంబును, రాజ్యంబును, విసర్జించితి" నని ప్రకటించి సత్యవతిని దనజనకునకుఁ బరిణయంబు నేసె. అక్కారణంబున శంతనుఁడు గాంగేయునకు స్వచ్ఛందమరణంబు నొసంగెను. ఇట్టి మహాత్ముఁడు కౌరవసేనాధిపతియై దశదివసంబులు భయంకరంబుగ సంగరంబు గావించి, యనేకయోధులఁబరిమార్చినఁ బాండవులును భయభ్రాంతులయి, యాతని జయించు నుపాయంబుగానక

చింతించుచుండిరి. దానినెఱింగి శ్రీకృష్ణుండు వారల కభయం బొసంగి యొక్కనాఁటిరాత్రియందుఁ బాండవుల వెంటనిడుకొని గాంగేయు గుడారంబునకుఁ జనిన, నాతండు మహాసంతోషంబునఁ గృష్ణసహితులయిన పాండవుల రాఁకకుఁ గారణంబడిగిన, వారును మహావినయముతోఁ దమకు సంగరంబున జయంబు గలుగు నుపాయంబు వేఁడుకొనిరి.

అంత శాంతనవుండు ముహూర్తమాత్రంబు నిమీలిత నేత్రుఁడయి సంతసంబున వారలతో నిట్లనియె: "ఏను స్త్రీ నామమును ధరించిన వారలతోడను, కొంతకాలమంగనయై యుండి పురుషుండయిన వానితోడను సమరంబు సేయను. అట్టివాఁడు మీయందు ద్రుపదు నగ్రసుతుండు శిఖండి యనువాఁడు కలఁడుగదా! వానిముందిడుకొని యింద్ర నందనుండు నాతోఁ గయ్యంబున కేతెంచిన నేనా శిఖండినిఁ జూచుచు సంగ్రామంబు సేయను. కావున, మీరు సులభం బుగ నన్ను జయింపఁగలర"ని యుపదేశించె. పాండవు లాత నికిఁ దమయందుఁ గల వాత్సల్యంబున కాశ్చర్యపడి, యాతని వీడ్కొని క్షత్రియకర్మంబునకు నిందించుకొనుచు, నాతండు చెప్పినటుల యుద్ధంబుచేసి గాంగేయు సమరంబున గెలిచి, జయంబు గైకొనిరి.

* ద్రోణాచార్యునకు సర్వసేనాధిపత్యము నిర్ణయించుట *

అప్పుడు కౌరవసేన గోపవిహీనంబయిన గోసంతా నంబు చందంబునను, బతిరహితయగు సతి కైవడిని, సస్య

విహీనయగు ధారుణిమాడ్కిని, సింగంబులేని పర్వతగుహా వలెను గన్పట్టుచుండెను. "ఓకర్ణా! ఓసుయోధనా! ఓ యాచార్యవర్యా! రక్షింపుఁడు రక్షింపుఁ"డను దీనాలాపంబు లన్నిదిశలందు వినఁబడుచుండెను. సైనికులందఱును జలధిమధ్యంబున నోడ మునుఁగ భీతిం జెందు మనుజుల చందంబున నుండిరి. పాండవసైనికుల సింహనాదంబులు నింగిముట్టుచుండె. అంత రాధేయుండు గాంధారేయుం గాంచి "సుయోధనా! నీవింక నాలస్యంబుసేయక ధైర్యం బవలంబించి. మన సైన్యంబునకు నొక్కని యధిపునిగఁ జేయుము. సేనాధిపతిలేకున్న నాసైన్యంబు కర్ణధారహీనం బగు నోడ సాగరమగ్నంబగునటులఁ జెల్లాచెదరై నాశన మొందును. కావున నొక్కరుని సేనాధిపతిగ నియమింపు" మని మఱియు నిట్లనియె: "రాజా! నీజోదులందఱును జమూపతిత్వమునకు దగుదురు లేకావున మఱియొకనిఁ బృతనాధిపుఁ జేసితివేని, యందఱును మాత్సర్యగ్రస్త చిత్తులై విపరీత భావంబుల నుందురు. దాన నీకు నష్టంబు సంభవించును. భారద్వాజు నాశ్రయించి యాతని సేనా పతిం జేసితివేని, యతఁడాచార్యుండు గావున నందఱును సమాధానంబునఁ గయ్యంబు సేయుదురు. అందువలన జయం బవశ్యంబు సంఘటిల్లును. అదియునుంగాక యాచార్యుండు భూసురోత్తముఁడు, వయోవృద్ధుఁడు, నానావిధ సంగ్రామ కోవిదుండు, వధిక బలుండు శూరుఁడు నగుటచే నన్నివిధంబుల సర్వసేనాధిపత్యంబున కాతండె యోగ్యుండు. వైళంబ

యాతనికిఁ బట్టముగట్టుము." నాఁడు సుయోధనుండు దనపక్షంబుగ సమరంబు సేయుచున్న నానాదేశాధీశులం గూర్చుకొని యాచార్య నివాసంబునకుఁజని సవినయంబుగఁ గరంబులు జోడించి "ధరాసురవర్య! యోధులందఱి లోను, వయోజ్ఞానంబులను, శస్త్రబల బాహుబలంబులను నీవె వృద్ధుండవు. నీమహిమంబునంతయు మున్ను పితామహుండు జెప్ప వినియున్నవాఁడను. సురసైన్యంబునంతయు నడిపి, దైత్యుల జయించిన కార్తికేయుండును, నీవును సములని చెప్పుదురు. కావున మదీయ సర్వసేనాధిపత్యంబు నిర్వహింపుము. నీవు సేనాధిపత్యంబు నెప్పుడు నిర్వహింతువో యప్పుడు పాండవులు నాచే నోడింపఁబడుదురు." అని యనేక విధంబుల నాతని వేడుకొనియె. అతనితోడఁ జనిన మహీపతులును నట్లె యాచార్యుఁ బ్రార్థించి "శత్రువుల గెలువు"మని యనేకవిధంబులఁ బ్రస్తుతించిరి. అయ్యెడ భారద్వాజుం డచ్చోటనున్న మహీపతులనందఱఁ గనుంగొని

"వేదములుం దదంగములు, నీతులుగా నొక కొంత నేర్తు శౌ
ర్యాదిగుణంబులెందుఁగల నైనను నింతటివాఁడఁగాఁగ న
త్యాదరవృత్తి మీరు నిజయాన నమంగొని యాటఁజేసి యా
గాదనకియ్యకొంటిఁ దగ, గౌరవనాథుని కోర్కెదీర్పఁగాన్.

కావున సర్వసేనాధిపత్యంబునకుఁ బట్టంబు గట్టుఁడు. నాశక్తి కొలఁది శత్రుసైన్యంబులఁదునుమాడి చతురంగబలంబులఁ బాలించెద"నని యత్యుత్సాహంబుతోఁ బలికిన గురురా

అత్యంత సంతుష్టస్వాంతుఁడగుచు, సువర్ణకలశంబులచే గంగానద్యాది పవిత్రజలంబులఁ దెప్పించి, పుణ్యాహనాదంబులును, భూసురాశీర్వాదంబులును, మాగధగీతంబులును జెలంగుచుండ నానాదేశాగతులైన భూపతులును దానును, సర్వసేనాధిపతిత్వంబునకు ద్రోణునభిషేకంబొనరించి, పట్టబంధంబు గావించిరి. తత్సమయంబున నచ్చటనున్న రథికులందఱు నార్చి చెలంగుచుఁ దమతమ శంఖంబులఁ బూరించిరి. అఖిల సైన్యంబులందును, భేరీ మృదంగాది తూర్యనాదంబు లతిశయించి నింగిముట్టె. ఇట్లు సర్వసేనాధిపత్యభాసితుండయి గురాచార్యుండు కౌరవసేనాముఖంబునకుఁ దిలకంబుగ నుండి మహాఘోరంబుగఁ గయ్యంబు సేయఁగడంగి నరేంద్రులందఱును వినుచుండఁ గౌరవేంద్రు మహాదరంబునం జేకొని "గాంధారీనందనా! భీష్మనంతరము నాకు వాహినీపతిత్వము నొసంగి యందఱిసమ్ముఖంబున నిట్లు గౌరవించి పూజించితివి; గావున సంతసించితిని. ఇష్టంబగు వరమెద్దియైనను గోరుము. తప్పక నొసఁగెద"నని పలికెను. సుయోధనుండత్యుత్సాహపరిపూర్ణహృదయుండై తన కాప్తులగు కర్ణ, శకుని, దుశ్శాసనులతో నాలోచించి సవినయంబుగ నాచార్యున కిట్లు విన్నవించె. "తమవంటి మహాత్ములు వరమొసఁగెదమన్నఁ గైకొనని వారెందేని యుందురా? నాయందు దయగలదేని ధర్మజుని యుద్ధంబునఁ బ్రాణంబులతోడఁ బట్టి నా సమీపమునకుఁ దెచ్చియిండు. ఇదె నాయభీష్టం"బనియె. ఇట్లతిభయంకరంబగు వరంబు గోరిన దుర్యోధను మొగం బవలోకించి యా గురుఁడు

"ధర్మజునకివ్వఁడుగదా యజాతశత్రుం డను నామంబుసార్థకమయ్యె. ఏలయన నాతనిఁ జంపుమనికోరక పట్టియిమ్మని యడిగితివి. ఇట్లడుగుటకుఁగారణమేమి? నీమనోనిశ్చయమును దెలుపు"మని యడుగ నాతఁ డుప్పొంగి తనమనోగతంబయిన విషయంబునందఱు వినుచుండ నిట్లు చెప్పె: "ఏను ధర్మజుని సంగరంబున జంపినయెడల మహావీరుండగు వాసవనందనుఁ డతి కుపితమనంబున మమ్మందఱ సమయించును. ఒకవేళమనము పాండవులనందఱఁ జంపితిమేని వారికిఁ బ్రాణసమానుండగు దామోదరుండు ఘోరంబగు చక్రధారలచేఁ గౌరవులఁ దునుమాడి, తుదకుఁ గుంతికైనను రాజ్యంబిచ్చును. కావున యుధిష్ఠిరుఁ జంపక జూదమాడునటులఁజేసి వనవాసంబున కనిపిన, నాతనిసోదరు లతనియందు భక్తిగలవారగుటచే నాతనినాశ్రయింతురు. తత్కారణంబున నేను శాశ్వతంబుగ నీధరామండలంబంతయు నేలుదును" అని కుటిలంబగు తనయభిప్రాయంబు తేటపడఁజెప్పిన విని యాచార్యుండు వాని పాపవ్యవసాయంబునకు రోసి యేదేని యొకసందు పెట్టి వరమియ్యఁదలఁచి యాంతనితో "కురురాజా!

నరుఁ డెడనొచ్చె నేని విను నాకది దుష్కర మేనొకండ నే
సురగణమైన ద్రెళ్ళఁగొనిజూపఁగఁజాలరు వాఁడు లేనిచోఁ
దిరమయి పోరనిల్చిన యుధిష్ఠిరుఁ ద్రౌపదిపుట్టినింటి వే
వురు వెంటఁగదిచూడ ననవుం బలముం జెడఁ బట్టితెచ్చెదన్."

అనివరమొసంగెను. నీచులగుధార్తరాష్ట్రులప్పుడ కౌంతేయాగ్రజుఁడు పట్టువడియెనని యానందాబ్ధినోలలాడుచు నాచార్యు

ప్రతిన యెల్లెడలఁ బ్రకటించిరి. కౌరవసైనికులు మహోత్సాహంబున సింహనాదంబులు సేయుచు శంఖభేరీరవంబులు చెలంగఁ జంద్రోదయకాలంబునఁ బొంగు సాగరంబు ననుకరించుచుండిరి. ఇదంతయును పాండవాగ్రజుఁడు చారులచే విని, యంతయుఁ దన తమ్ముల కెఱిఁగించి, యర్జును నాలోకించి యిట్లనియె: "వాసవనందనా! నీవు గురుని ప్రతిన వింటివి గదా! ఆతఁడు రారాజునకు వరమిచ్చునప్పుడు నిన్నడ్డపెట్టి నన్నుఁ బట్టియిచ్చెద నని చెప్పెనఁట. ఎవ్విధంబుననైనను నీకోదండపాండిత్యంబుఁ జూపి గురుని ప్రతిజ్ఞకు భంగంబు గావింపవలయును. అక్కౌరవనాథు మనోరథంబు విఫలంబగునట్లు సమరంబున నన్నుఁ గాపాడ జాగరూకుండవై యుండు" మనుచుఁ బార్థుండు ధర్మజు నవలోకించి "అన్నా! గురునివధయు, నివరిభవంబును నాకొక్కటియె. ఈ రెండును పాపకారణంబులె యగును. కావున నేఁ బ్రాణంబులతో నుండఁ బ్రమథగణపరివేష్టితుండగు నాముక్కంటికైనను నిన్నుఁ బట్టికొనుట కలవియగునే! ద్రోణుండు నిన్నెట్లు పట్టియీఁగలఁడో నాకెఱుంగరాదు. "వినాశకాలే విపరీతబుద్ధిః" యన్నట్లు ధార్తరాష్ట్రులు నీయంతరంబెఱుఁగక యిట్లు కోరిరి. త్రిజగంబులొక్కటియయి మొత్తివచ్చినను శత్రుగజకంఠీరవుఁడవగు నీకు భంగంబు గలుగునే! అట్టియపాయంబు గలిగెనేని నీయిలాతలంబంతయు ఖండఖండంబులై చెడును. జలధులింకును. రవిసోములగతులు దప్పును. కావున నీవు భయంబుదక్కి సంతుష్టాంతరంగుఁడవై యుండుము. నను

రంబున మనకెంత మాత్రంబును బరాభవంబు గలుగదు" అని యిట్లు నరుండు పలికిన యుధిష్ఠిరుండు మహానందరంభమున శంఖభేరీమృదంగాది మంగళతూర్యనినాదంబు లతిశయింపఁ జతురంగబలంబులతో వెడలి మందహాసమందరంబగు వదనంబుతోఁ గ్రౌంచవ్యూహంబు మహానిపుణంబుగ సమర్చి యుండెను. అందగ్రభాగంబున నరనారాయణులు ధవళాశ్వంబులఁ బూన్చినయరదంబుపై మార్తాండువిడంబించుచు తేజోవిరాజితులై శత్రువుల మనంబులు సంచలించుచుండ, వెలుంగుచుండిరి. ఆ యరదంబుకెలన మనోజవంబులగు నశ్వంబులఁ బూన్చిన, ధృష్టద్యుమ్ను నరదంబు జూచువారల కతిభీతిఁ గలిగించుచుండెను. మఱియు భీమసేనుఁడాదిగాఁగల సోదరులను, నభిమన్యుప్రభృతికుమారులను, ద్రుపదాదిబాంధుజనంబులను, దుష్టకేతుప్రముఖదండనాథులను, నయ్యైయెడల నిలిపి యావ్యూహంబునకు నడుమగా గంభీరోత్సాహంబులతో యుధిష్ఠిరుండు నిలిచి యుండెను.

నాల్గవ ప్రకరణము

* ద్రోణునిప్రథమదివసయుద్ధక్రమము *

తత్సమయంబునఁ గౌరవులు ద్రోణుననుమతిని శకటవ్యూహంబుపన్నినఁ, దగువారలందఱు నయ్యైచోటుల నిలిచిరి. సేనాముఖంబునకుఁ దిలకమై యొప్పుచున్న రాధాతనూజుఁ జూచి సైనికులందఱును దమలో తామిట్లు సంభాషించిరి: "సమరంబున నీకఁ గర్ణుండు పాండవుల జయించు. ఇంతదనుక

భీష్మునిపై యలుకచే నీతండు వత్సపాతంబున సంగర మొనర్చె. కాదేని యితని సురలయినను మార్కొనఁ జాలుదురే?" అను నెడఁ గౌరవసైనికుల ద్రోణుండు భయంకరముగ నడిపించు చుండ మేఘంబులు లేకయె యాకసంబు రక్తమాంసంబులును నెమ్ములును గురియుచుండె. గృధ్రంబు లాడుచుండెను. శివా రుతంబు లతిభీషణంబులయ్యె. పడిపడిగ నుల్కాపాతంబయ్యె. ఇట్టి మహోత్పాతంబుల లెక్కసేయక కౌరవులు తమసై న్యంబులఁ బురికొల్పుచు సమరంబున కాయత్తులయి నిలిచిరి. ఇట్లుభయ సైన్యంబులును గదిసి పరస్పర జయకాంక్షులై పోరు చుండిరి. అత్తఱిఁ గ్రూరగ్రహంబులొండొరులం దలపడి ఘోరసంగ్రా మంబొనరించుచుండ నాచార్యుఁడు బాలసూర్యుఁ గ్రేణిసేయు నరదంబెక్కి దిశలు వెలుంగ ఘోరంబుగఁ బోరుచుండెను.

అమర్త్యులందఱును వేడుకఁ జూచుచు వినువీథి నలంక రించిరి. కరితురగోత్థిత ధరణీపరాగంబు దశలనావరించిన గాఢాంధకారంబయ్యె. బాణాగ్నిజాలలు సూర్యకిరణంబుల నావలికిఁ బాఱఁదోలుచుండెను. రథావయవ, మాతంగ కపాల భూపతినరవంబులు ఘోరంబులయ్యె. సేనాంగావ యవఖండంబులచేఁ గ్రిమ్ము రక్తప్రవాహంబులు భయంబు నాపాదించుచుండె. ఖేచరసిద్ధసాధ్య నివహంబునకు నాసంగర క్రమంబు వెక్కసంబుగనుండె. ఇట్టిసంకుల సమరంబున కుంభసంభవుం డరుణతురంగంబులఁ బూన్చిన దనరథంబుపై వెలుంగుచుఁ గొఱవిఁ ద్రిప్పిన ట్లేదిక్కునఁ జూచినను దానయై పాండవపాంచాల బలంబులకుఁ బెక్కురదంబులనెను బుద్ధిజనిం

చున్నట్టుగ విహరించుచు, నానావిధశర సందోహంబుల నిగిడిం చుచు, రౌద్రరసము మూర్తీభవించెనో యన్నట్లు, మారి మసఁగిన చందంబున గజములఁ గూల్చుచుఁ, దురగంబుల నెత్తుటఁ దేల్చుచుఁ దేరుల భగ్నంబు సేయుచుఁ గాల్బలములఁ బరిమార్చుచు రణక్రీడ సలుపుచున్న యవసరంబునఁ బాండవబలంబు పాయవడి పలుదెసలకుఁ బలాయితమయి మగుడ మార్కొని, ధనుర్విద్యావిశారదుఁడగు నాచార్యునితోడ భూభాగము గ్రక్కదలునట్లుగ సమరంబు సేయుచుండఁగ.

అట్టియెడ భారద్వాజుఁడు తన బాహుబలంబును, ననన్యసామాన్య పరాక్రమంబును, దివ్యాస్త్రమహిమంబును, గాంతచూపి పాండవబలంబున రక్తపూరంబులు గల్పించిన, నందుఁ దెగిపడిన శ్వేతచ్ఛత్రచామరంబులు ఫేనంబు చందమునను, ఖడ్గంబులు మీనంబుల తీరునను, శిరంబులు శిలల మాడ్కిని, కేశంబులు శైవాలంబుల రీతిని, మాంసంబు పంకంబువలెను, భటాశ్వమాతంగ భగ్నరథాంగంబు లిసుకతిన్నెలవిధంబునను నొప్పియుండె. భూతభేతాళంబు లుబ్బి యోలలాడుచుండెను. గగనమధ్యభాగంబున వెలుంగు ప్రభాకరుంబోలి దుర్నిరీక్ష్యుండైన యాచార్యుఁ గనుఁగొని ధర్మజుఁడు భీతచేతస్కుఁడయి ధనంజయ ధృష్టద్యుమ్నులఁ జూచి "అమ్మహావీరు వారింపుఁ"డని పంచిన నప్పాంచాలపతినందనుఁడు ద్రోణుం దాఁకి వివిధవిశిఖనిచయంబుల వేసిజూపిన నరుండును గండుమిగిలి సైన్యంబులఁ బరికొల్పి నొక్కుమ్మడిగ నందఱును సద్గురురథంబుపైఁ బడి ఘోరంబుగఁ బోరునెడ నవ్వీరుఁడు వృద్ధుఁడయ్యును గుమా

రుని భంగి వెలుఁగుచు శరీరంబు పెంచి పాండవబలంబులఁ గలఁచి పెనఁగుట ఘోరంబుగనుండె. పాండవయోధాగ్రేసరు లందఱును దమతమ శక్తులకొలఁది నాచార్యుపైఁబడి యాతని రథ్యసూతశరీరంబులు రక్తసిక్తంబులుగ నొనరించిరి. గురుండు వశ్యాగ్రహంబుఁబోని మార్గణనియడరినఁ గరితురగభట సముదాయంబు లరుణాంబుదాచ్ఛాదితమగు నాకసంబువిధంబున రణభూమిని వెలింగె. ద్రుపదనందనుండును దినకరకిరణంబులభంగిఁ దనచూడ్కుల సిగిడించుచు నిశితాస్త్రంబుల గురునిఁగప్పి విజృంభించి యార్చుచు, నాచార్యుండు ప్రయోగించు బాణంబుల నడుమనె నఱికివైచి యనేక బాణంబుల సైన్యంబుపైఁ బరగించి సురలాశ్చర్యపడి చూచునట్లు సమరకేళి సలిపెను. నరుండును దివ్యాస్త్రంబులఁ బ్రయోగించి సైన్యంబులఁ దునుమాడఁదొడఁగె.

ద్రోణుండది సహింపక దశసాయకంబులు ద్రుపదాత్మజుపైఁబ్రయోగింప నాతఁడులక్ష్యంబు సేయక విశాతసాయకంబుల నాతనిమేనగ్రుచ్చె. ఆయిరువురబాణనికరంబు లంబరంబుఁగప్పిన నంధకారబంధురంబయ్యె. నాఁటిసంగ్రామంబు దేవాసురసంగర సదృశంబయ్యె. భీమ, కర్ణ, కృప, ద్రోణ, ధృష్టద్యుమ్నాశ్వత్థామ, విగాటులు ప్రతాప దీపితులయి ప్రభాకరుండు సప్తమూర్తుల ధరించి ధరణి విహరించునట్లు తేజరిల్లిరి.

కొంతతడవునకుఁ బాండవసేనాసంరంభమ్ము సహింపఁ జాలక, కౌరవసైనికులు మరలుటఁజూచి యాచార్యుండు కోపాతి

కేకంబున సైన్యంబుల "నిలునిలు" మని యదల్చి తూణీరంబు బిగించి, గుణంబు సారించి, తన సారథితో "కౌరవ సైనికులు భయపడి నలుదెసలకుఁ బోవుచున్నారు. ఇత్తఱి ధర్మజుని గర్వాతిశయంబు మాన్పమేని మన సైన్యంబు నిలువ నేరదు. ద్రుపదుండును దత్తనూజుండును, ధర్మజ భీమసాత్యకులు ను, విరాటుఁడును నేనెఱుఁగనివారు కారు. ఇంద్రసూనుండును నాయొద్దనె నేర్చినవాఁడేగదా! కావున మహాపరాక్రమంబుచూపుట కిదియె యదను. జయంబుగోరి యుత్సాహంబునఁ దేరుబోనిమ్ము. నాచేతుల తీఁటపోవునట్లు సంగరంబు సేసెద" ననుడు సారథియు నత్యుత్సాహంబున నట్లసేయ నయ్యాచార్యుండు ధర్మజునిఁ దీవ్రంబుగ మార్కొనియె.

యుధిష్ఠిరుండును వెనుదీయక నానాస్త్రంబులచే గురుని నొప్పించినఁ, గ్రోధవిస్ఫూర్జితతేజుండై గురుండు కౌంతేయాగ్రజుని ధనుర్భంగంబు గావించి, యాతనిసమీపించె. ఇట్లుద్ధతుఁడై కదిసియాచార్యుండు పర్వకాలజలధిచందంబునఁ బొంగుచుండ ధర్మనందను జక్రరక్షకుండు సుకుమారుఁడనువాఁడు చెలియలికట్టంబోలి నిలువరించి, నిశితసాయకంబుల నాతనియురంబు నాఁటనేసినఁ బాండవబలంబు లుప్పొంగి యప్పాంచాలకుమారు ననేకవిధంబులఁ బ్రశంసించిరి. తత్సమయంబున గురుండు పెనుగాలిచేఁ జెలుగుదావాగ్నింబోలి సుకుమారుని సువర్ణపుంఖశరజ్వాలలచేఁ బడనేసి యుధిష్ఠిరుఁ బట్టుకొనఁ బ్రయత్నించినఁ బాండవబలంబు లొండొరులమీఱి ధర్మజు ముందరికేతెంచి యాచార్యుంబొదివిరి.

అతండును లయకాలకుపితాంతకునిభంగి విజృంభించి, నకులుని నైదుశరంబులను, సహదేవు సప్తసాయకంబులను, మాత్స్యు నవవిశిఖంబులను, నొప్పించి సప్తబాణంబుల సాత్యకి తూపుమాపి, పండ్రెండుమార్గణంబులధర్మజుని, బదిబాణంబుల శిఖండిని, నొంచి శరత్రయంబుచే నుపపాండవుల నొప్పించెను. మఱియు నుత్తమౌజుని వింశతిసాయకంబుల గ్రుచ్చి, తన్నెదిరించిన యోధులపై ననేకసాయకములనేసి, వాఁడిగల తూఁపులు యుధిష్ఠిరుశరీరంబునాఁటనేయ, యుగంధరుఁ డను వాఁ డడ్డుపడియె. అంత నగ్గురుండు మందహాసమందరవదనారవిందుఁడగుచు నాతని ననాయాసంబుగ నొక్కనారసంబునఁ దెగటార్చియార్చె. అత్తఱిఁ బాంచాలపతియుఁ గేకయాధిపుఁడును దమవారింగూడుకొని యొక్కపెట్టున నాచార్యుఁబొదివి తమ బాహువీర్యంబుమెఱయించిన నాకోదండ గురుఁడరుణాత్ముఁడగుచు, నిశితసాయకద్వయంబుచే వారలప్రధానాంగంబులఁ గుండలసహితంబుగ నేలంగూలనేసినఁ గౌరవబలం బానందవారిధి నోలలాడుచుండె.

మఱియు నాయస్త్రగురుండు రథికవరులనందఱ సంగరంబునఁ జిక్కువడఁజేసి, యత్యుత్సాహంబున దుర్యోధనువశంబుదలఁచి కౌంతేయాగ్రజుఁ బట్టగమకించి యాతనిఁగదిసినఁ, పాండవసైన్యంబులందు "యుధిష్ఠిరుండు దయారహితుఁడగు నాచార్యుచేఁబట్టువడియె. అక్కటా! మదాంధుఁడగు దుర్యోధనుఁడు దనపురికి నజాతశత్రునిఁ గొనిపోవును ఏమిసేయుద" మనియెడు హాహారవంబులు నింగిముట్టుచుండె. తత్సమయం

బునఁ బార్థుండువారల కుత్సాహంబుగల్పించి బాణజాలంబుల నభంబుగప్పుచు భూభాగంబు గ్రక్కదలునట్లు తనరథ్యంబుల దామోదరుండు నడుపుచుండ, జ్యారావంబు దిగ్గజంబుల శ్రవణవిదారణంబు గావించుచుండ గురునిమార్కొని యెను.

ఘుయోధనుసైన్యంబు లొక్కపెట్ట ద్రోణునకు బాసటయై వాసవనందనుంబొదివిన, నతండును భీషణాకారుండయి నిశితాస్త్రపరంపరలఁగురిసి కపాలోపలంబులను, మేదోమాంస పంకంబును, నస్థిచూర్ణ సికతంబును, నగుశోణితనదీ ప్రవాహంబుఁబఱపె. అంతదినకరుఁడ స్తశైలాంతరితుఁడయిన నర్జును బాణాంధకారంబునకుఁ దోడు సంధ్యాకాలంబగుడు, గురుసైనికులకు స్వసైన్య పరసైన్యంబులు నిరూపింప నశక్యంబయిన ద్రోణమహోద్యమలు సమరంబు సాలించి తమ వాహినులతోడ విడిదలలకరిగిరి. ధనంజయుండును జయతూర్యనిస్వనంబులు నింగిముట్టఁ బాంచాలకేకయాది బంధుమిత్ర ప్రశంసావచనంబులు వీనులకు విందొనరించుచుండ నగ్రజు ననుసరించి శిబిరంబునకుఁ జనియె. ఇట్లాచార్య ప్రథమదివస సంగరక్రమంబు ప్రవర్తిల్లిన నుభయసైనికులును, నాఁటిరాత్రి యుద్ధోచితవ్యాపారంబుల నుండిరి.

ఐదవ ప్రకరణము

* ద్రోణుని ద్వితీయ దివస యుద్ధక్రమము *

మఱునాఁ డుభయబలంబులు నత్యుత్సాహంబున సంగర రంగంబునకుఁ జనునవసరంబున, లజ్జావిషాదంబులు పొంగం

బునందోవ నాచార్యుండు సుయోధనునితో నిట్లనియె. "రాజా! అర్జునుఁడొద్దనుండెనేని, ధర్మజుఁబట్టి యిచ్చుట యసాధ్యం"బని తొలుఁదొల్తనీతోఁ జెప్పితినిగదా! మనలో శూరుండగు నెవ్వఁడేని యప్పార్థుదూరంబుగఁ గొంపోయెనేని తొందతెదిరించినను వారిఁగలంచి యుధిష్ఠిరుఁబట్టియిచ్చెదను. పార్థుండు లేనిచోట ధర్మజుండు వెన్నిచ్చియైనను బాఱిపోవలయును లేదా పట్టుపడవలయును. పట్టుపడక పాఱిపోవుట సంభవించెనేని యదియును మనకు జయంబేకదా" అనియిట్లు సంభాషించుచుండఁ ద్రిగర్తదేశాధీశుఁడగు సుశర్మయును, వానితమ్ములు సత్యవ్రతాదులును, దుర్యోధనునితో నిట్లనిరి. "కౌరవాధిపా! పార్థు రణరంగంబున జయించెదమని యేము మున్నె నీకు బాసయిచ్చియుంటిమి గావున, నేఁడు రణరంగంబున నర్జునుఁడయినను మేమైనను బ్రాణంబులతో నుండవలయును" అని మహాక్రోధంబునఁ బలుకుచు నందఱు గృతస్నాతులయి యగ్నులఁ బూజించి యోధులందఱు వినుచుండ "మేమర్జునుఁ జంపుదుము. అతనికోడితిమేని గోవధంబును, బరదారగమనంబును, బరవిత్తాపహారణంబును, గురుజనత్యాగంబును, యాచకజన వైముఖ్యమ్మును, గృహదాహంబును జనుల కెట్టిగతులనిచ్చునో యట్టిగతులు మాకును బాటిల్లు!" నని పలికి యుద్ధసన్నద్ధులైరి. సుయోధనుండు మిగుల సంతసంబునొందె.

నాఁటిదినంబున గురుండు గరుడవ్యూహంబుఁ బన్ని దానికిఁ జంచువుగఁ దాను నిలిచె. దుర్యోధనాదులు గ్రీవంబు

గను, బాహ్లికాదులు వలపలి ప్రక్కగను, నశ్వత్థామాదులు దాపలి ప్రక్కగను, శకునిప్రభృతులు వెన్నుగను, సూతపుత్రుండవంత సైనికులతో పుచ్ఛంబుగను నుండిరి. సైంధవాదులకు భూమీశులు గొందఱు మధ్యభాగంబున నొడలి పొలుపును బలుపునుగ, నిలిచియుండిరి. తత్సమయంబున నవ్యూహారంబు వాతోద్ధూతసాగరాకారంబు ననుసరించుచు నత్యుత్సాహంబున నృత్యంబు సేయుఛందంబున దర్శనీయంబై యుండె. తత్సమయంబునఁ ద్రిగర్తాదులు పాండవసైన్యంబునకు దక్షిణదిశకుం జని సమరంబునకు సవ్యసాచిం బిలిచిన, నాతండు ధర్మజుం గనుంగొని "అగ్రజా! సుశర్మయును, నాతని తమ్ములును నన్నుఁ గయ్యంబునకుఁ బిలుచుచున్నారు. నేనిప్పు డెఱుఁగనట్లు నటించి, పోవకుండుట పౌరుషంబుగాదు. కావున వారిఁ దునుముట కనుజ్ఞనొసంగు"మని వేడుకొనిన ధర్మనందనుండు తమ్మునిఁ జూచి "వాసవనందనా! గురుని బలశౌర్యంబులు నీ వెఱుంగనివి కావుగదా? ఆతండు నన్నుఁబట్టి సుయోధనునకిచ్చెదనని పంతంబులాడి యుండెఁ గావున నట్లయిన నాతని పూన్కి బొంకుసేయవలయు. దానికిం దగినయుపాయంబు నీవ సెప్పుము" అనుడు ధనంజయుండతనితో "నేనిపుడు యుద్ధంబునకుఁ బోకయుంటినేని నన్నెల్లఱును నిందింతురు. అవశ్యంబు పోవలయు"నని పలికి, "పాంచాలవరుండగు సత్యజిత్తను వాఁడు బలశౌర్యంబులచే వాసిగన్నవాఁడు. ఆతని నీసంరక్షణమునకై నియోగించి చనియెద. వాఁడు జీవంబుతోనుండనీకే

ఱియు భయంబుగలుగదు. ఒకవేళ నాతండు హతుండయ్యె నేని యాచార్యునెదుట నుండక వెంటనే తొలఁగిచనుము” అని తనయందలిభక్తి తాత్పర్యంబునఁబలుక, ధర్మాత్మజుండు వల్లెయని, యూరకుండిన పార్థుం డగ్రజునకు నమస్కరించి, యాతనిచే నాశీర్వాదంబులఁ గైకొని, సంతోషాతిశయంబున సుశర్మాదులున్న దెసకుంజనియె. అంతఁ బాండవ సేనాధిపతి యగు ధృష్టద్యుమ్నుండు, ఆచార్యగరుడవ్యూహంబునకుఁ దగునట్టుగ మండలార్ధవ్యూహంబుఁ బన్నిన నాయుభయవ్యూహంబులును,నడువానకాలంబున బొంగుగంగాయమునల చందంబున నొండొంటిం దార్కొనియె. అత్తఱి ధర్మజుండు ద్రుపదపుత్త్రి నాలోకించి గురుంజూపి “నేఁడీభూసురప్రవరుండు నన్నుఁ బట్టుకొనకుండ వాఁడిమయూఖంబులచేసినీశౌర్యంబుఁజూపవల యనుజుఁడా!” అనుడు నతండు మందహాసంబున “ధర్మనందనా! నేనుండగ గురుండు నిన్నుఁబట్టుకొన నెట్లుసమర్థుఁడగును? నా పలుకులు విశ్వసించి భయరహితుండవయి సంగరోన్ముఖుఁడవు గమ్ము!” అనువరికి యాచార్యున కభిముఖంబుగ నడిచె. ఆచార్యుండును ధృష్టద్యుమ్ను దర్శనంబు తనకు దుర్నిమిత్తంబని యెంచి, యాతని దిక్కునకుంజనక, పాంచాలబలంబుపై నానావిధసాయకంబులు పరగించుచుండె. పార్థుండును దచ్చట నాకొనియున్న సింగంబు మృగసంతానంబుపైఁ బడునట్లు త్రిగర్తవరులపయి కడఁకి దివ్యాస్త్రంబుల వేసిఁజూచి పంచదశసహస్రరథికవరుల నేలఁగూల్చి, దేవదత్తంబుపూరిం

చిన నావంక క్షత్రకులందఱును నొక్కపెట్టుగఁ బార్థుపయి బాణ వర్షంబు గురిపించిరి.

పార్థుండది సహింపక కృష్ణుం డిచ్చినట్లుగ వాయవ్యాస్త్రంబుఁ బ్రయోగించిన, నాసైనికులు నానాముఖంబులకుఁ జెదరిపాఱిరి. అయ్యవసరంబున ద్రోణమహామారుతంబున కోర్వఁజాలక ధర్మనందనసేనావారిదంబులు నలుదెసలఁ దూలుచుండె. ద్రోణుండు సింగంబుకరణి యుధిష్ఠిరుదెసకు మహారయంబునఁ జనుచుండ ధర్మజుం డుసంతసించునట్లు సత్యజిత్తను పాంచాలపుత్త్రుండు దశోగ్రసాయకంబుల గురునిమీఁద నాఁటి, సప్తసాయకంబుల సారథినొవ్వఁజేసె. గురుండును సత్యజిత్తుకోదండంబు ఖండించిన నాతండు నొండువిల్లుగైకొని ముప్పది క్రూరనారాచంబుల గురునినొప్పించె. వృకుఁడను పాంచాలకుమారుండు సత్యజిత్తునకుఁ దోడయి యాధనురాచార్యు నఱువది బాణంబులనేసినఁ బాండవబలంబులు మహానందంబునొందె. క్రోధాతిశయంబునఁ గన్నులనిప్పులు రాల గురుండు సత్యజిత్తును వృకుని యంగంబులను నంపవానచే ముంచ, వారును వెనుదీయక యాచార్యు సారథియుబ్బడంచి, వాహనంబుల మదమణంచి, ధ్వజమల్లాడునట్లు చేసిరి. గురుండు నగుచు దశశరంబుల సత్యజిత్తునేసి, యాతని విల్లుదునిమిన, నాతండును మఱొకవింట బాణంబుల సంధించి, యాతనినొప్పించె. వెంటనె వృకుండును ననేకబాణంబుల నాచార్యుమేన నాఁటనేసె. అంత గురుండంతకాకారుఁడై సత్యజిత్తు ధనుర్భంగంబుఁ గావించి వృకునిశిరంబుఁ దునిమె. పదంపడి యాతని

హయంబులును, సారథియును, జచ్చునట్లాఱుబాణంబులఁ బ్రయోగించె. సత్యజిత్తు మఱియొకధనువు హస్తమునఁ బూని కుంభజన్ము నేయ నతఁ డరుణకమలంబుఁ దెగడునాననంబుతో నవుడు గలిచి, సత్యజిత్తుధనువు భగ్నంబుగావించి యర్ధచంద్రాకారంబగు నొకబాణంబున, నాతనిశిరంబు భూతలపతితంబుగఁ జేసి యార్చె.

మున్నర్జునుండు చెప్పిన విధంబున యుధిష్ఠిరుండుత్సాహరహితుండై యుద్ధపరాఙ్ముఖుండయ్యె. అంత ద్రుపదానుజుండు సూర్యదత్తుండను వాఁడు నాచార్యునెదిర్చిన బాణషట్కంబుచే నాతనిశిరంబు భూమిపయిబడనేసె. అప్పుడు సుయోధనుండు రాధేయుఁ జూచి కలకల నవ్వుచు "సూతనందనా! మహామారుతంబుచేఁ గూలు వనంబుఁ బోలి పాండవబలం బాచార్యుచే నెట్లయ్యెనో చూచితివా? భీమసేనుం డుభయపార్శ్వములందు దనవా రెవ్వరును లేకుండుటచే ద్రోణుని జూచి మహాదీనత్వంబుతో యుద్ధభూమికిఁ దొలఁగిపోవుటకు సిద్ధముగానున్నట్టు తోఁచుచున్న" దని నైజంబగు నీచస్వభావంబుఁ బ్రకటింప రాధాతనయుండు నగుచు "సుయోధనా! శత్రుభయంకరుఁడగు వృకోదరుఁడు తన ప్రాణంబులుండఁగ మనజయంబు సైపండు. పాండవులు మహాపరాక్రమశాలురు. వారు సంగరంబు విడుచువారే? నీచేమును వడ్డబన్నంబుల నెన్నండును మఱువరు. అదియునుంగాక వారికిఁ దోడై వచ్చిన బంధుమిత్రులును నతిశూరులు. వారందఱు నొక్కపెట్టుగ ద్రోణుం దాఁకి ఘోరసంగ్రామంబు గావింతురు. వా

రోకుడు రనితలంపకుము. నీయందలి ప్రేమచే యథార్థంబు నుడివితిని" అని యిట్లు చెప్పుచుండఁ, జంద్రకేతనంబును హంస వర్ణంబులగు హయంబులును, మెఱయ ధర్మజుఁడును, సింహపతాకంబుశోభిల్లుచుండఁ బవననందనుఁడును, శరభధ్వజంబును శుకవర్ణంబులగు నశ్వంబులును మెఱయుచుండ నకులుండును, జలద వర్ణంబులగు వాహనంబులును హస్తిపతాకంబును నొప్పుచుండ సహదేవుఁడును, దమతమ కేతనంబులు వెలుంగ ద్రుపద విరాట సాత్యకిప్రముఖులును విక్రమోత్సాహంబులు మెఱయ నా చాయ్యపై నడిచిరి.

ఇట్లు పాండవబలంబులు జలధరంబులు మహీధరంబుఁ గప్పునట్లు భారద్వాజుఁ బొదివిన నాసమయంబున ద్రోణుఁడు సచ్చెఁజచ్చెనను దీనాలాపంబులు కౌరవసైన్యంబున మిక్కుటంబులయ్యె. సుయోధనుండు పురికొలుపఁ, గౌరవులును మహా సంరంభమునఁ దలపడి, పోరుఘోరంబుగఁగావించిరి. ఉభయసైన్యంబులం దెక్కడఁజూచినను దెగిపడ్డధ్వజంబులును, విగతప్రాణులై పడియున్న ఘోటకంబులును, భిన్నంబులైన యరదంబులును, విచ్ఛిన్నములైన ఛత్రచామరంబులును, విఱిగిపడి యున్నధనువులును నత్యంతభయావహంబులగుచుండె. రౌద్రరసంబు మూర్తీభవించెనో యున్నట్లు పార్థుండును సంశప్తకబలంబునఁ జతుర్దశసహస్రరథికుల నేలపాలుగావించి, యచ్యుతుండు సంతసించునట్లు సమరంబుసేయుచు, సుప్రతీకంబను గజంబుఁబురికొల్పి ఘోరంబుగఁగమసైనికుల నుక్కడగించుచున్న భగదత్తునిఁ బఱిమార్చె. దాని సహింపక దుర్యోధను

మాతులుండగు శకుని సాక్రందనందనుమార్కొని, యతండు మాయావియగుటచే ననేకమాయలుగావించి యనేక జలదంబులుగల్పించి, వృక్షంబులను, పాషాణంబులను, వివిధాస్త్రంబులను నరుపై గురియించె.

అంత నంధకారంబు గ్రమ్మ నచ్చటఁ జూచినను జలమయంబుగఁ గన్పట్టె. మఱియుఁ బన్నగశార్దూలాదిక్రూరసత్త్వంబులు నరుపైఁ గవిసెను. వెంటనె సవ్యసాచి తనదివ్యాస్త్రంబులచే వానిరూపుమాపి, చిఱునగవున నాశకునికిట్లనియె "మాతులా! నీమాయలన్నియుఁ జూదంబుతోడనే గతించె. ఇచ్చట నుపయోగించునే? ఇచ్చటనుండునవి నిశితశరంబులు గాని యక్షంబులుగావు. కావున బ్రతుకఁదలచితివేని తొలఁగి యెచ్చోటికేని చనుము" అని పలికి తీక్ష్ణబాణంబులు నాతనిమేన నిగిడించిన నాతండు సరివాగునవ్వునట్లుగ భయంబున బెన్నిచ్చిపాఱెను. కౌరవసైనికులందఱును నాచార్యుమఱుఁగు సొచ్చిరి. ద్రోణుఁడెక్కడెక్కడ సమరంబొనర్చుచుండెనో యక్కడక్కడ ధృష్టద్యుమ్నుఁడాతనికడ్డపడుచుండె. అత్తఱిఁ గర్ణార్జునులకు మహాసంగరంబు ప్రవర్తిల్లిన, ద్రోణదుర్యోధనులును, జయద్రథుండును, సూతపుత్రుని శాత్రవసాగరంబున మునుఁగకుండ నుద్ధరించిరి. తత్సమయంబున రౌద్రభీభత్సంబులు నాట్యంబు చేయుచున్నవోయన్నట్లు సమరాంగణంబు చూడ భీకరంబుగనుండె. అంత నరుణకిరణుఁ డస్తాద్రిఁ జేర సంధ్యారాగంబు సొంపునఁ గెంపినుమడించు రక్తప్రవాహంబుల నోలలాడు భూతభేతాళంబులును, మాంసభక్షణాపేక్షచేసం

చారంబు నేయుచున్న గృధ్రాదిశకుంతసంతానంబును, శవకబళనలోలంబై యేతెంచిన సృగాలంబులను, జూచి యుభయసైనికులును సమరంబు చాలించి, తమతమ నెలవులకుం బోవుచుండుతఱి, యోధులాదఱు వినుచుండ సుయోధనుండు భారద్వాజుం జూచి "మహాత్మా! ధర్మజుం బట్టి నాకిచ్చెదనని నాఁడట్లు వరంబిచ్చి, యాతనిం బట్టుకొనక యుపేక్షఁ జేసితివేని, నీకును నాకును నపయశంబు వాటిల్లును. మిత్రవచనంబులచే నన్నిట్లు వంచించుట తమబోంట్లకు తగవగునా?" అని ఇట్లు కటకటంపడిన నా సుయోధనునితో నాచార్యుండు "కౌరవాధిపా! వాసవనందను శౌర్యంబును, నారాయణుని మహాత్మ్యంబును, నెఱింగి యెఱింగి నీవిట్లు పలుక పాడియగునా? నా యుధిష్ఠిరు నెడఁబాయక యాతని యోధులెల్లప్పుడును నాతనిం బరివేష్టించియుందురు. కావున నరనారాయణుల నా యెదుట లేకుండఁ జేయఁగలవాఁడవైతివేని యాతనిఁ దప్పక పట్టియిచ్చెదను. సంశయింపకపొ"మ్మని యాతని నూరడించె.

* ద్రోణుని తృతీయ దివస యుద్ధక్రమము *

తృతీయదివసంబున నాచార్యుండు పద్మవ్యూహంబు పన్ని నానాదేశాధీశుల దళంబులుగను, రాజనందనులఁ గేసరంబులుగను, కర్ణదుశ్శాసనసహితుఁడయిన కురురాజుం గర్ణికగను నిలిపి యవ్వ్యూహాగ్రంబు మొగంబునఁ దాను మహాదర్పంబుతో నిలిచియుండె. పాండవసైనికులు కౌరవసైన్యంబులం దఱిమి యక్కుంభసంభవుఁ దలపడిన, నాతండు బలుమార్గణంబుల వేఁడిమి సూపి వారల నొప్పించె. పాండవబలంబు నాతని యెదుట

నిలువంజాలక తిరుగుచుండుటజూచి యుధిష్ఠిరుండుకొంతతడవు నిరుత్సాహుండై యెట్టకేలకు మనంబుఁ బదిలంబుజేసికొని, కర్ణికారధ్వజవిరాజితుండును, అత్యుత్సాహశౌర్యసంపద్దుర్నిరీక్ష్యుండును నగు సౌభద్రుంజూచి, యాతండు దక్క నొరులీ వ్యూహంబు భేదింపజాలరని నిశ్చయించి, యావాసవపౌత్రుతో "వత్సా! ఈవ్యూహంబు భేదింప మేమెవ్వరమును దక్షులము గాము. నీజనకుండును, నీమాతులుండును మాత్రమే దీని భేదింపఁగలరు వారు మఱలఁ బరిహాసింపకుండ, నీదుబలంబుచే నీవ్యూహంబుభేదించి, మాకుఁ బ్రియంబుసేయుము" అనవుడు నాతండు మహానందంబున దీని భేదించు తెఱంగు మాత్రంబె మజ్జనకుండు నాకుపదేశించె. తిరిగి వచ్చువిధంబు నాకుపదేశింపఁడయ్యె. అయినను నానేర్చువిధంబున నీవ్యూహంబుభేదించి యీనూఁకసంతను జీల్చి యెట్లు చెండాడెదనో నీవుచూచెదవుగాక" అని పలికిన పార్థనందను నవలోకించి ధర్మజుండు "పుత్రా! ఈవ్యూహంబుభేదించి లోనికిం జనిన నీవెంట మేమందఱమును జనుదెంతు" మనియె. భీమసేనుండును, ద్రుపదవిరాటులును నట్లనే నుడివిరి.

తత్సమయంబున నభిమన్యుఁడు పవననందనుంగాంచి.

"నను వినుకీచకాంతక, మనంబున ద్రోణుఁడు మెచ్చ జొచ్చియు
మ్మొనఁగలఁగింపకిట్లు కురునాథుఁడు ధర్మసుతుండు గారవిం
చిన జతనంబు నిష్ఫలముసేయుదునే? నరుఁడుం సుభద్రయుం
దనయునిఁగాంచి సంతసముదాల్చుట యెంతయు కీర్తిఁబుత్త్రునే?

“ఇక కౌరవసైన్యావలితో యుక్కడంగునట్లుగఁ గండుదోర్బలం
గదుపుంటివల్లు గోవుల నైనది తంతు జనుల్ నుతింపఁగా
పెద విని మామ ప్రీతిచలసిల్లఁగఁ దండ్రియనంతసిల్ల నె
ట్టిదుఁడగు కౌరవేంద్రునకు దెప్పరమయ్యెడు భంగిఁ జేర్చుతన్!”

అనిన యుధిష్ఠిరుండు సంతుష్టస్వాంతుఁడఁగుచు, పాండవవంశ నందనుం జూచి, “నీదు ధైర్యశౌర్యంబులును యశోబలంబులును వృద్ధినొందుఁగాక” యని యాశీర్వదించె.

సౌభద్రుండును దనసారథియగు సుమిత్రుఁ జూచి “మన యరదంబు ద్రోణు సైన్యంబుపైఁ దోలు”మన నాతఁడభిమన్యుఁ జూచి “అయ్యా! నీవు బాలుఁడవు. కుంభజప్రముఖులు మహాప్రౌఢులును, రణకోవిదులు నగుటచే సమరంబున నీకు నసాధ్యులగుదురు. వారలతో రణంబుదుగు” మనుడు నాతండు మందహాసంబున సారథింగనుంగొని “నేటికయ్యంబునఁ సురలతోఁ గూడి పురుహూతుండే తెంచినను, ప్రమథగణపరివేష్టితుండయి రుద్రుండే తెంచినను, కృష్ణసహితుండయి మజ్జనకుఁ డెదిర్చినను ద్రోణాదుల లెక్కగొనక జయంబుఁగొనియెద!” అని పలికిన సుమిత్రుండును గౌరవసేనకభిముఖంబుగఁ దేరు నడిపె. భారద్వాజప్రముఖ యోధులొండొరులఁ దలఁగడచి యతిశయించి మార్కొనిన సమరంబు సంకులంబయ్యె. అంత సౌభద్రుం డనవ్యభేద్యంబగు పద్మవ్యూహంబు సొచ్చి క్షీరసాగరంబునఁ దిరుగు మందరాద్రి చందంబునను, మహారణ్యంబు దహించు దావాగ్ని విధంబునను, గ్రీడించుచుఁ జతురంగబలంబుల రూపుమాపిన ధార్తరాష్ట్రాగ్రజుం డుక్కుమిగిలి క్షుధార్తంబగు సింగంబుపైఁ జను గజంబుభంగి నాసౌభద్రు

ఎదుర్కొనిన భారద్వాజుఁడు కురురాజాతనిచే నోటుపడునని యూహించి, సైనికులం బురికొల్పిన, గురుసుతుండును, కృపుండును, శల్యుండును, వృషసేనుండును, దక్కుంగలమహాయోధులును నాతనిం దలపడి యోటువడిరి. పదంపడి ధార్తరాష్ట్ర బలంబులొక్కుమ్మడిగ నాతనిపైఁగవియ గొఱవిఁదిప్పిన చందంబుదోప వారలం బొడివి వీనుఁగుపెంటలు గావించె. భారద్వాజుం డాకుమారు సమానుషవిక్రంబునకు నాశ్చర్యంబు నొంది, యాతనివీక్షించు చుండెను.

అంతఁగౌరవసైనికులు నలుదెసలకుం బరువులిడుచుండ నాకోదండగురుండు "కర్ణా! దుశ్శాసనా! బాహ్లికా! సోమదత్తా! నిలునిలుఁడు. నేనుండ మీకుభయంబేల?" యనియోధులందఱఁ బురికొల్పినను నొక్కండైన నాపురందరపౌత్రు నెదుర్కొనఁడయ్యె. సౌభద్రుండొక్కరుండును గగనమధ్యంబున వెలుంగు ప్రభాకరునిచందమ్మున, సంగరరంగంబున వెలుంగుచుండె. నాఁటికయ్యంబున యుధిష్ఠిరుండను మహామారుతంబునకు సైంధవుండను మహామహీధరం బడ్డపడుటచే, నభిమన్యుఁ డొక్కండ సంగరంబు సలుపుచుండె. మహావీరుండగు ధర్మజునకు నాజయద్రథు డడ్డపడుట కొక్క మహాకారణంబుగలదు.

ఆఱవ ప్రకరణము

* సైంధవుని వృత్తాంతము *

తొల్లిపాండవు లరణ్యావాసముచేయుచుఁ, దృణబిందు నాశ్రమంబుననుండి, తమపురోహితుఁడగు ధౌమ్యునొద్ద తమ

ధర్మపత్నియగు పాంచాలి నునిచి, మృగయాసక్తచిత్తులై నలుదిక్కులకుం జనిరి. తత్సమయంబున సింధుదేశాధిపతి సైంధవుండను వాఁడు సాల్వ కన్యాపరిణయ కుతుకంబునఁ జతురంగబల సమేతంబుగఁ దృణబిందునాశ్రమ పరిసర మార్గంబు ననుసరించిపోవుచు నాశ్రమద్వారంబునఁ బాండవ పత్నియగు ద్రౌపదింజూచి, యాతరుణి సౌందర్యాతి శయం బులకు సవిస్మయాత్మకుండగుచు, నమ్మగువయందుఁ దగిలిన చూడ్కులఁ ద్రిప్పలేక వంజాలక మదనబాణ నిర్భిన్న హృద యుండై, తన సఖుండగు కోటికాస్యుండను నృపసుతునిం గాంచి, "మిత్రమా! ఆమ్మగువ [illegible] నానలినాక్షి యొంటరిగనున్న కారణం [illegible] నులం దెంపైన నిట్టివారిఁగాంచితిమేని [illegible] యేతత్కాంతయో? అనిదములఁ జెదను [illegible] నీవ నాకుహృదయేశ్వరి యైనను [illegible] నట్టుల సంతసించి, మాఱుని [illegible] కావున కరుణించి నాకును నమ్మగువను [illegible] నన్నుఁ గృతార్థుఁ జేయుము" అని వేఁడుకొనియె. అంతఁ గోటికా స్యుండును పాంచాలిపాలికింజని "ఇంతీ! [illegible] యిష్టంబయిన యీవ్వనమధ్యంబున నొంటరిగ నీవుండుట [illegible] గతంబేమి? సాక్షాల్లక్ష్మివలెనున్న నీవి వ్వన దేవతవో [illegible] పతితోడనలిగి భూమికవతరించిన శచివో? యని నామనంబున సందియంబు గలుగుచున్నయది. ఇట్టి నిజమ్మెఱుంగ్బుచేఁ గృతా ర్థుండయిన పుణ్యుఁ డెవ్వాఁడు? నీనామంబెయ్యది?! నీదుజీవి

తేశ్వరుండగు మహాత్ముఁడెవ్వండై యుండును? ఏనుసురథుం
డను రాజనందనుఁడను. కోటికాస్యుండను వాఁడ. సౌవీర
కుమారులు పన్నిద్దఱుం దన్నుఁ జేరికొలువ ననేకసహస్ర కరి
తురగ రథపదాతి పరివృతుండై మహాగజంబుపై శోభిల్లు
చున్న యావీరుండు, సింధుదేశాధీశ్వరుండగు జయద్రథుండు.
అమ్మనుజపతి నీ తెఱంగెఱుంగఁ గోరి నన్ను నిటు పుత్తెంచె" ననినఁ
బాండవపత్నియుఁ జిగురాకుకైవడి ప్రకాశించుచున్న కెం
గేలనుత్తరీయంబు సవరించుకొనుచు నాకోటికాస్యుం జూచి
"అన్నా! నేనొంటరిగనిచ్చోటనున్నదాన. నీవిచటకేగు దెం
చుట నీతియగునా? నీవు శిబివంశోద్భవుండయిన సురథు
పుత్త్రుండవగుట నేనెఱుంగుదు. అస్మత్ప్రకారంబు చెప్పెద
వినుము. ఏను బాంచాలపతియైన ద్రుపదుతనయను. కృష్ణ
యనుదాన. పాండునందనులగు యుధిష్ఠిర భీమార్జున నకుల
సహదేవులకు ధర్మపత్నిని. నన్ను నివ్వనంబున నునిచి ధర్మజుండు
తూర్పునకును, భీముండు దక్షిణదిశకును, పార్థుండు పడమర
కును, నకులసహదేవులుత్తరదిక్కునకును, వేటాడఁబోయిరి.
మహావీరులగువారు తిరిగివచ్చు సమయం బాసన్నంబయ్యె.
మీరమ్మహాత్ములకు మాననీయులరు గావున నార్యజనమిత్రు
లగు నక్కురుకుల పవిత్రులు సేయుసత్కారంబులఁ గైకొని
పోవుదురుగాన యొక్కింతతడ వీయాశ్రమంబున నిలుం"డనిప
లికి భయంబునఁ దనకుటీరంబు సొచ్చె. కోటికాస్యుండును
గ్రమ్మఱి చని, జయద్రథునితోడ నబ్భామిని పాంచాలకన్యకయ
నియును, బాండవపత్ని యనియునుం జెప్పిన నద్దురాత్ముండు

మదనకళంకితహృదయుండగుచు నమ్మగువ నపహరింపఁదలచి, సింహాగారంబు సొచ్చు వృకంబునుంబోలెఁ బాండవనివాసంబుసొచ్చి పాంచాలింగని, "మగువా! నీకును, నీభర్తలకును గుశలంబె?" అనిన నమ్మానవతి యాతనింజూచి, "స్థిరమతులైన పాండవులకును, నాకును సుఖంబ నీకు నేమంబె?" అని యవ్వామాక్షి యాతనికుత్తరం బొసంగి, "పాండవులకల్లుండవు గావున నానానాద్యుపచారంబులఁ గైకొని, కురంగ మాంసమ్మున విందారగించిపొ"మ్మనియె. అంతనద్దురాత్ముండు "వారిరుహనేత్రీ! నీవుమాకుఁ జేయుసపర్యలం దేమియుఁ గొఱంత లేదు. మదనాగ్నిచే నాడెందం బెంతయుఁ దాపంబు నొందుచున్నయది. బాధింపక వేగంబె రథంబెక్కి నన్నుఁ గృతార్థుం జేయుము. అదియునుంగాక.

ధరణీరాజ్యము గోలుపోయి ఘన కాంతారస్థలీవాసులై
పరివారిల్లను వివ్వఁ గుత్సితదశాసంప్రాప్తిమైనున్న యు
ష్కారులం బార్థులఁ గొల్చినం గలదె సౌఖ్యంబెంతయుం గాఁ? బేలవై
తరవిందానన శ్రీవిహీనులఁ గరంబర్థింతురే కామినుల్?

కావున మద్వచనాతిక్రమణంబుసేయక మదీయ సింధురాజసుఖంబులననుభవించుచు, నాకు మనఃప్రియంబు సేయు"మనియె. పాంచాలియు నాతని ననాదర దృష్టింజూచుచుఁ గొంతదూరంబుగఁ జని, మనంబునఁ దన భర్తల రాకయ కోరుచుఁ బ్రతి వచనంబులఁ గొంత ప్రొద్దు పుచ్చఁదలంచి వానితో "జయద్రథా! నీవు పాండవ కౌరవులకుఁ జెల్లెలగు దుస్సల భర్తవు గావున, నాకును సహోదరుండవగుదువు.

నీతియును న్యాయంబును గలవంశంబున జన్మించిన యీయట్టి యార్యులే యిట్లుధర్మవిరుద్ధంబుగఁ బ్రవర్తించిన నింక న్యాయంబెచ్చోటనుండును? ఉభయలోక విరుద్ధంబగు కర్మంబున కేలసాహసించెదు?" అని పలుక నద్దురాత్ముండు కామాంధుండుగావున నగుచు నమ్మగువంజూచి "సుదతీ! నీవు రాజధర్మంబులు వినియుండలేదా? రాజులెవ్వరును నారీరత్నంబుల యెడ వావివెదుక నవసరంబులేదు తమయిచ్చ వచ్చిన వారల తోడ సుఖంబు లనుభవింపందగు. మత్తేభగామినీ! స్త్రీరత్నంబందఱకును సాధారణంబగు ధనంబుగాని, యొకరి సొత్తుగాదు" అని యాతండు యుక్తాయుక్తవివేకశూన్యుండయి నుడివిన నయ్యంగనామణియును క్రోధావేశంబుచేఁ గన్నులెఱ్ఱజేసి, యద్దురాత్ముఁడు పెట్టిదపువచనంబులం గాని చక్కఁబడడని యెంచి యాతనితో "దురాత్మా! నీదు ప్రేలాపంబులు మానుము. అత్యుగ్రవిక్రముఁడగు యుధిష్ఠిరుని నీవవమానించుట మహాక్రోధంబున నున్న మదగజంబు డాయంబోయి సిల్లుజూపుట యని తలంపుము. మహాశౌర్యసంపన్నుఁడగు భీమసేనుఁ జెనకఁదలఁచుట పర్వత గుహాంతర సుప్తంబగు మృగేంద్ర కేసర వ్రాతంబు లాకర్షించుట యని యెఱుంగుము. పులివాతఁజొచ్చి తొలఁగినఁ దొలగవచ్చుంగాని క్రూరశరాగ్ని దుస్సహుండగు పురందరనందనున కెగ్గుగావించి యెవ్వారును బ్రతుకఁజాలరు. మాద్రీపుత్రులకపకారంబు నేయుదలంచుట విషంబుగ్రక్కుచు నాలుకలుగ్రోలు మహోరగద్వయంబు సేరి పాదాహతిం గినియఁజేయుట యని

నమ్ముము. సురాసుర దుర్జయులగు పాండుపుత్త్రులకపకృతిగావిం
చిపాతాళవివరంబుసొచ్చినను నీకు మరణంబు తప్పునా? విధిప్రేర
ణంబున నీకుమృత్యువాసన్న మగుచున్న నేనేమి చేయఁగలను?

తెలుసు గర్కటియాను దెగు, కాలమువకుఁజాలు దాల్పుగతిఁబాధ్ధులయి
ల్లాలయిన వాడెస దు, క్రీలుఁడవైతి విదివాళచిహ్నముగాదే? "

అనిపలుక "మగువా! పాండవులు నేనెఱుంగని వారుగారు.
సౌవీరవంశజులగు మమ్ము సామాన్యక్షితిపాలురను బుద్ధిందలంచి
నెరపింపకుము. వృథాలాపంబులఁ బ్రొద్దుపుచ్చక, ఈసువర్ణ
రథంబునొండె, భద్రగజంబునొండె, వేగనధిష్ఠింపు" మని
పాపనిశ్చయుఁడై యుండ వానితో యాజ్ఞసేని "దురాత్మా!
గాండీవం బింద్రచాపంబుగను, తజ్జ్యానినాదంబు భయంకర
గర్జనంబుగను నొప్పుచుండ, శత్రుప్రతాపంబను గ్రీష్మంబు
శమింపఁజేసి, మిత్రబర్హి కేకారవంబులు చెలఁగుచుండ, వాసవ
నందన మహాంబుధరంబు నిశాతసాయకవృష్టిచే ముంప,
భయంకరగదాఖండంబు వాయుపుత్త్రుడు కుంభికుంభవిదళ
నంబు సేయుచు నంతకుఁబోలి మిర్ని రీత్యుఁడగుచుండ, నీయా
త్మద్రోహంబున కప్పుడు వగచెదవు. కాని యిప్పుడు నావచ
నంబులఁగైకొనియెదవే? నన్నిపుడీవెంత హీనంబుగఁ జూచి
నను బావనంబగు నాపాతివ్రత్య మహిమచే నన్నేకీడును జెంద
నేరదు." అనియిట్లు నిష్ఠురంబులాడి, యాదురాత్ముఁడు తన్నుఁ
బట్టగమకించుట యెఱిఁగి తమపురోహితుండగు ధౌమ్యుం
జేరఁ బరువిడి యాక్రోశించిన నాతం డతిరయంబున నేతెంచె.

అంతఁ బాపాత్ముండగు నా సింధుపతి యమ్మగువను

ద్యోదకాం గాకర్షించిన, న త్తరుణియుఁ గ్రోధంబునఁ బెట్టిదం
బుగ నాతని ద్రోయ, వాతాహతిచే సమూలంబుగఁ ద్రెళ్ళు
మహీరుహంబు చందంబున నాతఁడు చిత్రంబుగ భూపతితుం
డయ్యె. కామాతురుండు గావున నాతండు తత్‌క్షణమే లేచి,
యప్పాండవ పత్ని నరదంబుపై నిడికొని ససైన్యంబుగఁ జను
చుండ, నమ్మగువయుఁ జేయునదిలేక ధౌమ్యునకు మ్రొక్కిన,
వాడుచ్చైస్స్వరంబున సైంధవుఁ బేర్కొని

"తరుణీ! రాజకులప్రసూతులను! వత్యంత బు కోలాద్భుతం
బగు దుష్కర్మము. వాదుపల్కు విమమా యజ్ఞాతి పుణ్యాత్ముఁ; యు
స్మత్కులజ్ఞ వే విధ. పాండునందనులు నీమానంబు ప్రాణంబు నే
పరిధిం గొందురుగాని పోవిడురు రీపాపంబు నిం దెక్కుదుణ."

అని యాక్రోశించుచు నాభూసురవరుండు వాని వెంటనె జను
చుండెను.

పాండవులును నవ్వనంబున ననేక మృగంబులఖండించి
యంతలు నొక్కయెడ గూడుకొని యాశ్రమాభిముఖులయి
యేతెంచునెడ, ధర్మజుండు తమ్ములంజూచి, భ్రాతృవరు
లారా! కనుగొంటిరా పశుపక్షిసంతానంబులు ఘోరారావం
బు సేయుచు మరలుచున్నయవి. మనదాపటిదెస నతిభయంక
రంబుగ వంచకంబులు గూయఁదొడఁగె ఇట్టిదుర్నిమిత్తంబులు
గలుగుటచే మన కెవ్వానితోడనో కయ్యంబు సంప్రాప్తమగుట
నిశ్చయము. అదియునుంగాక నాచిత్తంబు చెయివెట్టి త్రిప్పి
నట్లుగఁ గలఁగుచున్నది. ఆశ్రమంబునఁ బాంచాలి నొంటిగ
నుంచి వచ్చితిమి. క్రూరాత్ములగు కౌరవు లేమికీడు సేయ

దలఁచిరో ? ” అని నయ్యేవురును దమ యరదంబుల సత్వరంబుగఁ దోలుకొని యాశ్రమంబునకు వచ్చునెడ ద్రుపదాత్మజు దాసి ధాత్రేయిక యనునది, నేలంబడి పొరలుచు నేడ్చుచుండ యుధిష్ఠిరుసారథియగు నింద్రసేనుండు రథంబుదిగ్గి యతివేగంబునదాని యొద్దకుంజని “యిట్లేల దుఃఖించుచున్నదానవు? నీ కెవ్వ రెగ్గుగావించి” రనిన సైంధవుండు ద్రౌపదినపహరించె” నని చెప్పి, రోదనంబు సేయుచుండె. ఇంద్రసేనుండునుదానిం జూచి “అబలా! దుఃఖింపకుము. కామాంధుఁడై జయద్రథుండు పాండవపత్నిం జెఱగొనునంతటి వాఁడయ్యెగా? ఏమి యద్భుతము! అతండు భూవివరంబుఁ జొచ్చినను, గగనంబునకెగసినను, గౌంతేయులచే మరణంబు దప్పదు. అద్దురాత్ముండు వారల యస్త్రకౌశలం బెఱుఁగడు కాబోలు ! నీవు వగవకుము. ఆ మహామహు లిప్పుడ యమ్మగువ విడిపించి తెచ్చెదరు.” అనిన నమ్మగువ కరపల్లవంబుచేఁ గన్నీరు దుడిచికొనుచు, నప్పరాత్ముండు పాండవుల కెగ్గొనరించినప్పుడే, యీ లోకంబు నెడబాసె. ఆతండు దూరంబు జనకముందే, వెంబడించి వాతని మానభంగంబు గావించి నెచ్చెలిం దోడ్కొనిరండు బూదిలోఁ జేయఁబడిన పూర్ణాహుతివలెను, కుక్కతిత్తిలోని కపిలగోరసధారమాడ్కిని, రుద్రభూమింబడ్డ కుసుమమాలిక చందంబునను, పాంచాలి యాదురాత్ముచే దూషితగాకయున్న వేగంబ చనుఁడు. సన్మంత్రపవిత్రంబగు పురోడాశంబు శునకంబునకును, శవఖాదియగు సృగాలమ్మునకును నీరజామోదకాసారకేళియు, నెట్లనర్హంబులో యటులనె

యామిద్దియు సౌందర్యచాతుర్యంబు విధం బో నీచునకౌ సౌభాగ్యంబు."

అనియిట్లు భాషించుచున్న యాధాత్రేయిక పలుకులువిని, దానినోదార్చి, యక్కురువీరులేవురును యుద్ధసన్నద్ధులయి, క్రోధావేశంబున మహాభుజంగంబుల విధంబున రోజుచు జయద్రథు వెన్నంటి బోవుచుఁ, దమముందట మహాదుఃఖంబున నాక్రోశించుచున్న ధౌమ్యునకు నమస్కరించి, "మీరింక గతఖేదులయి, యాశ్రమంబునకుఁ జనుఁడు. మేమా నీచుని యిప్పుడ పట్టితెచ్చెద" మని చెప్పి యామిషంబునకుఁ జను శ్యేనంబుల భంగి సైంధవు సైన్యంబుపైఁ గవిసి సింహనాదంబులఁ జేసిన, జయద్రథుండు పాండవుల యరదంబులఁ జూచి ద్రౌపదితో "అబలా! ఈవచ్చువారేవురును నీభర్తలేనా? అందెవ్వఁ డెట్టివాఁడో నిరూపించి నాకుఁజెప్పుము. వినఁగౌతూహలంబగుచున్నయది" అనిన నాయంబుజేక్షణయు ననాదరంబున నాతనిఁజూచి క్రోధంబున నతనితో నీవిఁక వారల నెఱిఁగినను నెఱుఁగకున్నను లాభంబేమిగలుగును? దుశ్చారిత్రంబునకుంజొచ్చి కరంబుగీడు దెచ్చికొంటివి. అయినను నన్నడిగితివి గావునఁ జెప్పెద వినుము. సోదరసహితుండగు ధర్మనందను దర్శనంబున నాకావంతయును భయంబు గలుగదు. అత్యాశ్చర్య శౌర్యుండును, అనిరోధప్రతిభాప్రభావనిధియును, భూరితేజోఘనుండును, వనజాతాయతచారులోచనుండును అమలస్వర్ణ వర్ణుండునై యల్ల రథంబుపై వెలుంగు పుణ్యాత్ముఁడే ధర్మజుండు. అతఁడె కురుకుల శేఖ

రుండు. ఎట్టి శత్రువులుగాని శరణని ప్రార్థించిరేని, దయార్ద్రబుద్ధితో రక్షించును. నీవు చెడిపోక నామాటవిని యాతని నాశ్రయించితివేని నీయపరాధం బతండు తప్పక క్షమించును. అల్ల కనకరథంబుపై సాలమహీరుహంబుం బోలి కనుబొమలు ముడివడ దశనోష్ఠపీడనంబుసేయుచుఁ దేజరిల్లు నతఁడె మహాబలసంపన్నుఁడగు భీమసేనుండు. ఆతండు సమరంబుల దుర్నిరీక్ష్యుండు; శత్రుభయంకరుండు; అమానుషవిక్రముఁడు. ప్రళయాంతకతుల్యుఁడగు నీతనినెదిర్చి భూమిని నెవ్వారును బ్రతికినవారు లేరు. ఆవచ్చువానిఁ జూడుము. నిర్మలాత్ముండగు నతఁడు ధర్మజు రెండవతమ్ముండగు వాసవాత్మజుండు. జితేంద్రియుఁడగు నమ్మహానుభావుఁడు దుష్కర్మములఁ గన్న సహింపడు. కామక్రోధాదివికారంబులఁ బొడమినను న్యాయమార్గంబు విడువఁడు. ఆసుందరుండు పాండుసుతరత్నంబగు నకులుండు. ఆహవవిశారదుండు, భయార్తసంరక్షణశీలుండు. వాగ్విశారదుండు. ప్రభాకరతేజుండును, బుద్ధిమంతుఁడు నగు సద్గుణుఁడు సహదేవుఁడు. అగ్ని చల్లనైనను, భూమి చలనంబు నొందినను, నితండు సత్యంబుఁ దప్పడు. వీరేవురఁ బారింబడిన నీసైన్యంబు వార్ధిమధ్యంబున మహావాయుతాపాతంబై యవియు పెనోడ విధంబున వికలంబగును. నీవును ప్రాణమానంబులఁ గోలుపోక యెట్లు దప్పించుకొనఁ గలవు?" అని పలుకుచుండఁ బాండవులు సైంధవుసైన్యంబుఁ దలపడిరి. జయద్రథుఁడును సైన్యంబుఁ బురికొల్పుకొనుచు వారికభిముఖుఁడై నిలిచె. భీమసేనుండు కోపారుణితలోచనుఁడగుచు రథంబు డిగ్గి

యయోమయంబగు తన గదాదండంబు గిరగిరఁ ద్రిప్పుచు నయ్యహితసైన్యంబు రూపుమాపె. యుధిష్ఠిరుండును దన ధనుర్విద్యానైపుణ్యం బతిశయింప శతసంఖ్యాకుల సౌవీరుల యమాలయంబున కతిథులం జేసెను.

కవలును నిశాతసాయక నికరంబుల నశ్వారోహకుల ననేకులఁ గూల్చి రణభూమినంతయుఁ బరవీరమస్తకంబుల నలంకరించిరి. ఇంద్రనందనమహామందరంబు శత్రుమహీపాలజలచర సంతానంబు సంచలించునట్లు సింధురాజసేనార్ణవంబునఁ దిరుగుచుండె. సూతసాయధ్వజపాతపూర్వకంబుగ నరదంబులును తదారోహకులతోడ గజంబులును, రౌతులతోడ నశ్వంబులును, నాయుధంబులతోడ కాల్బలంబులును, రణభూమి నలంకరించుచుండె. సమరతలంబున రుధిర ప్రవాహంబులధికంబులయ్యె. ఇటుల శతమఖసూనుండు దనచాప నైపుణ్యంబుజూపుచు సమరవిహారంబు సలుపుచుండఁ, ద్రిగర్తదేశాధీశుఁడగు సుధన్వుండు ధర్మజు రథ్యంబులఁ గూలనేసిన యాతఁడలిగి వాని విగతజీవుం గావించె.

అంతనంగారకప్రభృతి సౌవీరకుమారులు పన్నిద్దఱు క్రీడిమార్కొనిన, నాశూరుండు వారల శిరంబులఁ దునిమి రణభూమి శవమయంబుగావించె. తత్సమయంబున సైంధవుండు భీతిజనింపఁ బాంచాలి దిగవిడిచి, రథంబుఁ దోలుకొని పోవుచుండ, ధర్మజుండు ధౌమ్యసహితంబుగఁ బాంచాలినిదన యరదంబుపై నిడికొనియె. లజ్జావిహీనుఁడై పలాయనంబు సేయుచున్న సైంధవుం జూచి, యర్జునుండు భీమసేనుంగాంచి

"బకాంతకా! వ్యర్థంబుగ నీసైనికులయావు మాపనేల? దురాత్ముఁడగు జయద్రథు వెనుకొని యాతని ప్రాణంబులపహరింపవలయు" ననిన నతఁడు కయ్యంబు చాలించి ధర్మజుం జూచి "నీవు ద్రుపదు పుత్త్రిం దోడ్కొని ధౌమ్య నకుల సహదేవ సహితంబుగ నాశ్రమంబునకుం జనుము. ఏము సురలక్షంబైనను నాతఁడేలోకంబునకుఁ జనిన దప్పక హతంబుచేయుదు" మనియె. యుధిష్ఠిరుండాతనిఁ జూచి "పాపాత్ముండని యాతనిఁ జంపితిమేని, మనదుస్సల వైధవ్య వ్యథాభారంబుచేఁ బ్రాణత్యాగంబుఁ జేయును. తత్కారణంబున మనతల్లియగు గాంధార రాజపుత్రి కిపకృతిఁ గావించిన వారలమగుదుము. మత్కచనాతిక్రమణంబు సేయక యాతని తప్పు నున్నింపుడు." అని చెప్పునవసరంబునఁ బాంచాలిరోష వివశయై భీమార్జునులం గాంచి 'ఈపాపాత్ముని యెడఁ గృప సేయం జనదు. అవశ్యంబు వానివధియించి నాకు మనఃప్రియంబు సేయుఁ" డనియె. తదనంతరంబు యుధిష్ఠిరుండు ద్రౌపదీ సహితుండై తనయాశ్రమంబునకుఁ జనియె. ఇట భీమార్జునులు దమయురగంబులు రయంబునఁ జనుచుండఁ నాతని క్రోశమాత్రాంతరంబునం గాంచి, తత్క్షణము పాండవనందనుండు దూరాపాతవిశిఖంబుల జయద్రథు రథాశ్వంబులఁ బడనేసిన, నమ్మనుజపశువు దల్లడమందుచు, విల్లునమ్ములవిసర్జించి, వెలవెలంబోవుచు నరదంబు డిగ్గి, కాందిశీకుండయ్యె. అంతవారు వానిం జూచి "ఓరీ! నివెచ్చటికిఁ బోయెదవు. ఇట్టిపరాక్రమంబునకా? యిట్టిప్రల్లదంబు" అనుచు సమీపించిన, వాఁడును

ప్రాణభీతిని నొక్క గుల్మమధ్యంబునకుఁ జనియె. అంత భీమసేనుండు రోషసందష్టాధరుండగుచు రథంబుడిగ్గి, యాతని శిరంబు వట్టి నేలఁబడవైచిన, వాఁడును దనశక్తికొలఁది యాతనితోఁ బెనఁగుచుండెను. వాయునందనుఁడాతని హీన సత్త్వుంగా నెఱింగి మొగంబవిసి రక్తపూరంబు దొఱఁగునట్లుగ ముష్టిఘాతంబులనొప్పించిన నాతఁడవశుఁడై భూమిపైఁబడియె.

పార్థుండును నగ్రజువచనంబులఁ దలఁచి, "వాయు నందనా! నీ పరాక్రమంబంతయు నీతనిపైఁ జూపెదవేని, యాతండు మరణంబు నొందును. అజాతశత్రువచనంబుల నాదరించి, యీతని ప్రాణంబుతో విడువు"మన నాతండు మహాక్రోధంబున "ధర్మజుఁ డెప్పుడును కరుణయెగాని, కార్యంబుచేటుపాటు నారయఁడు. నీవాతని మార్గంబు నాశ్రయించి, పవిత్ర[illegible]చుందువు." అని పలుకుచు నా సైంధవుపట్టుకొని, వాఁడియగు నొక ఖడ్గంబున నతనిశిరంబు చెక్కు లెగయునట్లుగఁ గోయుచు వారు నవ్వునట్లు రేవుంబాఱ గొఱిఁగి విరూపిం జేసి, "నీవు బ్రతుకఁ దలఁచితివేని, నేఁడు మొదలుగ నెల్లసభలందును, పాండవదాసుండనని పలుకు"మ నిన నతండును ప్రాణభయంబున "నట్లు చేయుదు"ననియె.

అంత నాయిరువురును నాతని రథంబుపైఁ గట్టి నిజాశ్రమంబునకుం జని, ధర్మజునకు యావద్వృత్తాంతమ్ము చెప్పి వీఁడె పాండవదాసుఁడనిన నట్లని వీని విడువుమనియె. పాంచాలియు నాతనిఁ జూచి నగుచుఁ "బాండవదాసుండవైన నకతం బునఁ బ్రతికితివిపో"మ్మనిన నాతఁ డచ్చోటనున్న మును

లకు నమస్కరించి చనుచుండె. అంత వానిం జూచి ధర్మజుండు "పాపాత్మా! ఎట్టి కష్టాత్ముఁడైన నీవలె నిట్టి పాపంబు సేయఁడు. ధృతివిహీనుడవై యింద్రియలోలుండవగు, నిన్నే మనువాఁడను? ఇఁక నిట్టి పనులెన్నడుఁను జేయక, బుద్ధిమంతుఁడవై మనుము." అనిన వాఁడును లజ్జావనత వదనుఁడగుచు, గంగాద్వారంబున కేఁగి, యందూర్ధ్వపాదుఁడై యంగుష్ఠాగ్రంబు నేలమోపి, చిత్తజారాతి యగు సదాశివుని గూర్చి ఘోరతపంబు సేయుచుండెను. శివుండు వానితపంబునకు మెచ్చి, "నీయభీష్టంబు నెరవేర్చెద; వరంబుఁగోరు" మన నాతండు మహానుభావా! నాయందు దయగలదేని, యేను సంగరంబున నహీనబలులగు పాండవులం జయించునట్టి వరంబు కృపసేయు" మని ప్రార్థించెను. శంకరుండును నాతనిం గాంచి "పాండవులఁ గయ్యంబున జయింప దేవతలకైననుశక్యంబుగాదు. ఐనను నీకోర్కెఁ దీర్చెద"నని పలికితినిగాన, విజయునొక్కనిఁదక్క మిగిలిన నలువుర నొక్క నాఁటి కయ్యంబునఁ దప్పక జయింతువు. అఖిలేశ్వరుండగు కృష్ణుండు పార్థునకుఁ బ్రియసఖుండు గావున, నాతని జయింప నీకు శక్యంబుగాదు. నాయనుగ్రహంబున వానికట్టి ప్రభావంబు గలిగె" నని చెప్పి, యీశ్వరుం డంతర్హితుండయ్యె. సైంధవుడును రుద్రవర ప్రభావంబున నభిమన్యునకుఁ దోడుపడకుండ, నాదివసంబున ధర్మజ, భీమ, నకుల, సహదేవుల కడ్డుపడ సమర్థుండయ్యె.

* అభిమన్యుని మరణము *

ఇట్లు పాండవుల నడ్డగించి, సైంధవుండుజ్జ్వల శరనికాయంబులఁ బఱపి పాండవ సైనికుల వేఁడియుడిపిన, నాధనంజయసూనుం డనేక యోధవరులఁ జములోకంబున కనిపె. అంత శల్యనందనుండు రుక్మరథుఁడనువాఁడు పాండవపౌత్రుఁ దలపడిన, శరత్రయంబుచే నాతనితల ధరఁపైఁ బడనేసె. ఇట్లు బాలుఁడొక్కరుండ సంగర రంగంబున విహరించుచుండ, ధార్తరాష్ట్రులందఱును మొగంబులు వెలవెలబాఱ నోళ్ళెండ, కాళ్లు వడంక, మేనులు చెమర్ప, వెఱగంది నలుదిక్కులఁ జూచుచుండిరి.

అంత దుర్యోధనపుత్త్రుండగు లక్ష్మణుం డభిమన్యుం దలపడియె. యోధులందఱును సంబరంబులు మహీధరంబుపై నడచినట్లు విజయాత్మజుం డాఁకిన, నాతఁ డమోఘశరపరంపరలచే వారలఁ దెరల్చుచు, దుర్యోధనుండు వెఱగంది చూచుచుండ, నాలక్ష్మణకుమారుశిరంబు, నేలపైఁ గూల్చె. ఇట్లు యోధవరుల ననేకులఁ బొరిగొను నాసౌభద్రు నెదుట నిలువంజాలక, కర్ణుఁడు ద్రోణునిఁ జూచి, "గురువర్యా! ఈ సౌభద్రుండు వీరులగు రథికుల నందఱఁ బెండాడి యిప్పుడు రాజుపై నేతెంచుచున్నాఁడు; నీవిట్లుపేక్షఁ జేసినఁ దప్పక మనకు ముప్పువాటిల్లు. తగిన ప్రతివిధానంబు నొనర్పుఁ"డని వేఁడుకొనియె. ఆచార్యుండచ్చటి యోధులందఱు వినుచుండ, వారలం గాంచి, యిబ్బాలుండు పార్థునంతటివాఁడు గాని, సామాన్యుండు కాఁడు. మనమందఱము నొక్కపెట్టున నాతనిఁ గయ్యంబు

నఁ బరిమార్పవలెనని, పురిగొల్పుచున్న సమయంబున, నప్పాండుపౌత్రుఁడు బాణంబులఁ బీడితుఁడై కర్ణుండాచార్యు నాలోకించి "అయ్యా! నాదెసఁజూడుము. ఈతని సంగ్రామంబు నరు సంగరంబుకంటెఁ బెట్టిదంబుగ నున్న"దని పలికె. అంత నాచార్యుండు మొగంబున చిఱునగవొప్పుచుండ సూతపుత్రుం జూచి, "కర్ణా! కవచధారణంబును ఘనవిద్యయొక్కటి నేనితని జనకున కుపదేశించితిని. ఈతండును జనకునొద్ద యీవిద్య నభ్యసించియున్న కారణంబున, నతనిజయింపనశక్యంబు. వంచనచే నీవాతని జ్యాభంగంబు గావించి, ఘోటకంబులం జంపి సూతుఁ బరిమార్చితివేని, యాతనిజయింప వలవియగును. చేతధనువుండ నాతనిజయింప దేవతలకును నశక్యంబు."

అని యిట్లాచార్యుం డుపదేశించిన సూతసూనుండు భీతిఁజెందినవానిభంగి వెనుకకొదిగి యొక్క నారాచంబున వాని విల్లు ద్రుంచె. వాఁడొండొకవిల్లు గైకొనునంతలో, గురుం డశ్వంబులను, గృపుండు సారథినిఁ దెగటార్చిరి. కృతవర్మాదులనేకాస్త్రంబులు నాతనిపైఁ గుప్పించిరి. అంతనబ్బాలుండు వాలును బలకయుఁ గొని, వినతానందను చందంబున గగనంబున కెగసి, తనవిద్యామహిమంబునఁ దిరుగుచుండఁ గౌరవయోధులు తమపై నెచ్చటఁబడునో యనుభయంబున, మునిఁగియుండిరి. అప్పుడాతని బలపౌరుషంబుల నిర్జరవరులు గీర్తించుచుండిరి. తత్సమయంబున నశ్వత్థామ యాతనిం గదిసిన, నతని రథ్యంబులం గూల్చి, సుభద్రానందనుండాతనిదోవుమాపె. పదంపడి దుశ్శాసనతనయుం డభిమన్యుఁ దలపడిన నాయుభయులకును ఘో

రసంగ్రామంబు సంఘటిల్లె. అట్టియెడఁ బరస్పరగదాఘాతంబు
లచే నాబాలురిరువురును వివశులై, యిలంగూలి విగతజీవులైరి.

ఏడవ ప్రకరణము

* వేదవ్యాసుండు ధర్మజుకొద్దకేతెంచుట *

ఇత్తెఱంగున ననేకులుకూడి వనజాకరంబుజొచ్చి కలంచు వనగజంబును దయమాలి బోయలు బొదిగొనుచందంబున పార్థునందను నలయించి, చంపిన

జగములన్నియును దేజంబున వెలిఁగించి, యపరాద్రి సేరిన తపనుమాడ్కిఁ,
దఱచైన కావలుదరికొని నివురుగాఁ జేసి యాఱిన దవశిఖి విధమున
గగనంబు దోరాయఁ గరడులెగల జలంబివురఁబాఱిన మహార్ణవము కరణి
నున్నత గతిసెడి యుర్విపైఁగడు విన్నవై పడియున్న సుధాంశుభంగి.
తీరము నందమువారికిఁ దెంపొనర్చి
యరులసమయించి కసమతిఁ దనువుదప్పి
తెగియుఁ జూడ్కికిఁ జాలఁ జేఁగగుచు నొలిచె
మహితమూర్తి శోభితుఁ డభిమన్యుఁడు......

అట్లు భూపతితుండయియున్న యాసౌభద్రుఁజూచి యనేకవిధంబులధర్మజుండు బలవించుచుండె. కృష్ణద్వైపాయనుం డాతనిశోకంబుడుపుటకై యచ్చటికేతెంచిన, నాతనికిదండప్రణామంబాచరించి, యర్ఘ్యపాద్యాద్యుపచారంబులచే నాతనిఁ బూజించి, యమ్మహాత్మునితో యుధిష్ఠిరుండు "మునీంద్రా! పాపాత్ముఁడనగు నాచరిత్రంబు నొకింత వినుము. శత్రుసేన భేదింప నేనాజ్ఞాపింప, నాయభిమన్యుండు శత్రుబలంబుఁజొచ్చె. మేమాతని పిఱుందనఁబోవసమకట్టితిమి. సైంధవుఁడడ్డువడుటచే మేమాతనికి సహాయంబుసేయఁ జాలమైతిమి. తత్కారణంబున

నందనుని దయారహితులై యాతనిమడియించిరి. ఇవ్విధంబు నఁ జిన్నపాపని నొంటరిగఁ జంపించి బ్రతుకు దురాత్ముఁడెచ్చో టనైనను గలఁడా? నాచిత్తంబు శోకాంబుధిం మునిఁగి తల్లడమం దుచున్నయది. నేనేమిసేయువాఁడ"నని పెద్దపెట్టున రోదనంబు సేయుచుండె. అయ్యెడ నమ్మునీశ్వరుం డమ్మనుజేశ్వరునితో

"పలువురు రాజులందు నిమి బల్లిదుఁ డాతఁడు చిన్నపాపఁడే!
గాలుఁగులసాలు సేయు నభియాతులు ఫవ్వులకోల సాతురే?
కేఁగుదురే విపద్దశలఁ గాతియునార్యులు? సావులింత విం
తలే? సకడోరగ ద్యుచరదానవకోటుల చావుఁ గాదమే?

విధివశంబుఁదప్పింప నెవ్వరికలవియగును? ధైర్యఘనుఁడవగు నీవిట్లు దుఃఖింపఁ దగదు. నెమ్మదినుండు"మని యాశ్వాసించె. అంత యుధిష్ఠిరుండమ్మునీశ్వరుం జూచి "మహాత్మా! మున్ను మహీపాలురు బలశౌర్యంబులంగలిగి మహాధీరులై యుండిరిగాని యాలోకంబున నొక్కఁడైన మరణంబునొందకుండఁ దమ ప్రాణంబు గాపాడుకొనఁ జాలడయ్యె. మృత్యువనునది యింత యనివార్యం బెట్లయ్యెనో?" అని యడిగిన ధర్మసూనునవలో కించి యత్తపోధనుండు "నరేంద్రా! తొల్లి పుత్రమరణ శోకాతురుఁడైన యకంపనుఁడను రాజు నారదమహామునిచే మృత్యుప్రకారంబు దెల్లంబుగావిని విగతశోకుండయ్యె. అయ్యితిహాసంబు నెఱిఁగించెద. సావధానుండవై వింటివేని యదేనీ యంతఃకరణసంతాపంబు మాన్పి శాంతినొనరించును.

* మృత్యుదేవతాప్రభావము *

"కొండొకతఱి శత్రునృపాలురు దండెత్తివచ్చి, యకం

వనుతోఁ గయ్యంబునేసి యాతనిఁ బట్టుకొని పోవుచుండ, నాతని పుత్త్రుండు ధృతియనువాఁడు దనశౌర్యంబున నహితుల నోడించి, తండ్రివిడిపించియుఁ దనివోవక యరాతి సైన్యాంబుల నుఱుమాడుచుండ, శత్రులందఱుం గవిసి, యాతని నంతంబు నొందించిరి. అకంపనుండును విపినంబుదహించు దావాగ్నింబోలి వెలుంగుచు, శత్రునాశనంబొనరించి తూర్యధ్వానంబులతిశయించుచుండఁ బురందరుచందంబున నాత్మపురంబు సొచ్చియుఁ దనజయంబునకు సంతసింపక పుత్త్రుం దలచి శోకించుచుండె. అత్తఱి నానరేంద్రుకడకుఁ ద్రిలోకసంచారియగు నారదుండేతెంచిన, విధ్యుక్తంబుగ నాతనిఁ బూజించి కరకమలంబులు ముకుళించి యకంపనుండు "మునీంద్రా! ఏను సమరంబున నరిజయంబు నొందియు నహీన పరాక్రముఁడగు నందనుఁ గోలుపోవుటచే మనంబున నధికంబుగ వగచుచున్నవాఁడను. లోకంబునకంతకు మృత్యువనునది, ప్రభువని విని యుంటిని. అజ్ఞాని జననంబును, ప్రభావంబును, వినఁ గుతూహలుండనై యున్నవాఁడను. విన దగుదునేని, కరుణించి వినిపింపుఁ"డని వేడుకొనియె. అంత నమ్మహాత్ముండును గరుణాయత్తచిత్తుండై, యాతనిం జూచి "బంధుమరణశోకంబు డవజాలుమృత్యుజన్మప్రకారంబు వినుట మేలు: సావధానుండవై యాకర్ణింపుము.

"సలువ ప్రజల సృజియించి పదంపడి లయంబు లేమిచే ధరణీభారం బధికంబగుటకుఁ జింతాక్రాంతుఁడయి తత్సంహారంబునకుపాయంబు గానక, చింతిల్లు నతని యవయవంబులనుండి,

మహాదవానం బుద్భవించి దశదిశలునిండి స్థావరజంగమాత్మ
కంబైన భూతవ్రాతంబునంతను దహించుచుండ, లోకహితా
ర్థంబుగ శంకరుండు సత్యలోకంబునకుంజని, విరించి శరణంబు
సొచ్చినఁ బ్రజ్వరిల్లుచున్న యమ్మహానుభావుఁడ ద్దేవదేవు నాద
రంబున నవలోకించి, "పురాంతకా! నీవేమిగోరి యిచ్చోటికరు
దెంచినాఁడవు? నీయభీష్టంబివ్వుడతీర్చెద" నని ప్రసన్నుఁడై పలికిన
శివుం డాతని గాంచి "కమలాసనా! లోకంబులన్నియు నీచే సృ
జింపఁబడి, యుత్సాహకలితంబులయి యుండ నిట్లేలకోపంబు
న రూపుమాపెదవు? కరుణాభరితుఁడవయి మన్నిమిత్తంబు
గ నీజగంబులఁ గాపాడుము" అనిన నవ్వారిజభవుండును నా
యందుఁ గామక్రోధాదులు లేవు. ప్రజాభారపీడితయై వసుంధ
రాదేవి తనవిచారంబు నాకుఁ దెలుప, నాజనని సంతోషంబునకై
యుపాయంబు విచారించి, యెద్దియు గానన్నైతి. అక్కార
ణంబున నాయందుఁ గ్రోధంబు జనియించె" అని వచియించి
న నాభూతనాథుండు మఱియు నాతనింజూచి "విధాతా! క్రో
ధపరవశుఁడవయి చరాచరంబులన్నియు నొక్కపట్టున నిట్లు
నాశనంబు సేయనేల? భూభారంబడగింప నొండొక యుపా
యంబు యరాదే?" అని యనేకవిధంబులఁ బ్రార్థించిన, నా
శంకరువచనంబుల నాదరించి, విరించి యయ్యుగ్రకనడంచిన
నయ్యనలంబాఱె.

అంతలోకంబులన్నియు సంతోషంబున శంకరపద్మజులఁ
గొనియాడె. పదంపడి యాశతానను నింద్రియంబుల నరు
ణాస్యయు, నసితాంగియు, రక్తాంబరయు నగు నొక యింతిజని

యించి, మెల్లన నవ్వుచుఁ గెంజాయరంజిల్లు లోచనంబుల నా లోకనాయకుంజూచి దక్షిణదిశకుఁ జనుచుండె. అజుండు దానింజూచి "ఓమృత్యువా! మృత్యువా! ఎచ్చటికి జనియెద"వని పలుమాఱు పిలచి "సంహారంబునకు నే నుపాయంబు విచారించుతఱి నాయందుఁ జనియించితివిగావున, నిది మొదలుకొని నాయాజ్ఞ శిరసావహించి, యెల్లప్రాణుల సంహరింపుము. నాయనుగ్రహంబున నీకుభయంబు గలుగదు." అనిన నామృత్యుదేవత యత్యంత దుఃఖంబు నొందిన, నాయఁ విదకుఁ గన్నీరు వాఱఁగె. అయ్యశ్రుబిందువులఁ గమలాసనుండు కరతలంబులంబట్టి యక్కాంత ననేకవిధంబుల నాశ్వాసించిన, నమ్మగువ పవనచలితలతంబోలి, చలించుచు నంజలి ఘటించి వారిజాసనున కభిముఖయై "దేవదేవా! నీచే సృజియింపఁబడిన, నే నీక్రూరకర్మంబున కెట్లు గడంగుదును? బంధుమరణశోకార్తులగు జనుల రోదన ధ్వనులు వినఁజాల. ఈయధర్మకార్యంబునకు వెఱచుచున్న నాయందు కరుణించి తపశ్చరణంబునకనుజ్ఞనొసంగెదవేని, నేను ధేనుకాశ్రమంబునకుంజనియెద" అని ప్రార్థించిన నానీరజాతేక్షణ నీక్షించి, "ఏను ప్రజాసంహారంబునకై నిన్ను సృజియించినాఁడ గావున, నీవు విచారంబు దక్కి యీకార్యంబు సేయుము. నాసంకల్పంబున కన్యథాత్వం బేలఁగలుగును!" అనిన నయ్యింతి భయంబుచే నప్పటికియ్యకొని నలువ మొగంబు జూచుచుండె. కమలాసనుండు ప్రీతుండైన లోకంబులన్నియుఁ సంతసంబు నొందె. మహాదేవుండును దన నెలవునకుం జనియె.

“మృత్యుదేవియు నచ్చోటువాసి, ధేనుకాశ్రమంబున
ననేక వ్రతంబులత్యంతనియమంబున నాచరించి,తీర్థయాత్రలం
జేయుచు, హిమవన్నగశిఖరంబునఁ బ్రజాపతినుద్దేశించి, యతి
నిష్ఠదపంబు నలుపుచుండె. చతురాననుండు నమ్మగువకుఁ బ్ర
త్యక్షంబయి “ఓమృత్యువా! ఏల యిట్లు ఘోరంబుగఁదపంబు
సేయుచున్నదాన”వనిన నయ్యంగన “సమాధానంబునను న్న
ప్రజల బలాత్కారంబుగఁ జంపఁజాల; నన్నుఁ గరుణింపు”మని
వేఁడుకొనియె. ప్రజాపతియు నమ్ముద్దియం గనుంగొని నా
యానతిని యిక్కార్యంబు సేయుమవేని యదియధర్మంబుగా
దు. నీకిక్కార్యంబు పరమధర్మంబగునట్లుగను, యశోదాయ
కంబగునట్లును వరమిచ్చెద. నాయానతిఁ జతుర్విధభూతంబుల
సంహరింపుము.” అనిననమ్ముద్దియ “దేవా! అట్లయిన దేవరయా
జ్ఞ శిరసావహించి చేయుదాన. నావిన్నపంబొక్కటి యవధరిం
పుము. అరిషడ్వర్గంబుచే మానవుల దేహంబులు వికృతింబొంద
ననుగ్రహింపవిను వేడెదను. నావుడు నీయభీష్టంబు సఫలంబయ్యె
డు. నీయశ్రుబిందువులన్నియు నన్నిరోగంబులై మానవులమర
ణంబునొందించు. అట్లగుటచే నధర్మంబునిన్నుఁ జేరదు. ప్రాణుల
మరణధర్మంబు నొందించుట నీకుఁ బరమధర్మంబగును. నీశుభం
బేనుగోరుచుందును. ఈవిశ్వంబునకు నీవీశ్వరివి గావున సర్వ
జీవుల సమభావంబునఁ బ్రాణంబుల నాకర్షింపుము. దురాత్ముల
నధర్మంబె సమయించుఁబొమ్ము” అని పలికిన నవ్వనితయు పాప
భయంబున దన్నధర్మంబు బొందదను గమలాసను వాక్యంబు
విశ్వసించి మారణ కృత్యంబున కంగీకరించె.

“అక్రమలాపను వచనంబులు వ్యర్థంబుగాక యాధివ్యాధులు గాత్రహానిఁ జేయుచుండ, నామృత్యువు ప్రాణహాని జేయుటచేఁ బ్రాణంబులు దేహంబులఁ బాసి యమరత్వంబు నొందుచు మగుడ మనుష్యత్వంబు నొందుచుండును. సురలు మనుజులును మానవులు సురలు నగుచుందురు. కావున నీపుత్త్రుండు వీరస్వర్గంబున సుఖంబులనుభవించుచున్నాఁడు. వగవంబనిలేదు. దుఃఖాత్మకంబగు నీలోకంబు నెడబాసి సుఖాత్మకంబగు స్వర్గలోకంబున మహాపురుషసాంగత్యంబు దొరకుటకన్న లాభంబెద్ది? ధీరులీవిషయంబునఁ జెగినవారలకు వగవ”రనిన నకంపనుండు నారదుం జూచి “మునినాథా! మృత్యుప్రకారంబు నీచేవినుటచే నే విగతశోకుండనైతి నామనంబు సంతసించె”నని యాతనికి నమస్కరించిన, నాతండును నతని దీవించి స్వాశ్రమంబునకుఁ జనియె”. ఇట్లు కృష్ణద్వైపాయనుం “డీయితిహాసంబు బఠియించిన నాయు శ్రీబలారోగ్యంబులు గలుగు” నని చెప్పి, యుధిష్ఠిరుతో “నీనందనుఁ డభిమన్యుండు సంగరంబున వివిధాస్త్రంబుల నరాతిసైన్యంబుల సమయించి, చిరవీరస్వర్గంబును బ్రఖ్యాతియుఁబడసె. కావుననీ వాతనికివగవంబనిలేదు”

* సువర్ణష్ఠీవి చరిత్రము *

అని మృత్యుదేవతా ప్రభావంబువన్యసించి ధర్మజు దుఃఖోపశమనంబునకై మఱియునాతనితో “రాజా! మున్ను పుణ్యమూర్తియును మహిమాస్పదుండునగు సృంజయమహీపాలుం డపారపారావారపర్యంతమహీమండలంబంతయు దానొక్కఁడ యేలుచుండెను. సంతానహీనుండగుటచేనతఁడుతదర్థంబుగ సురభూ

సురపూజనంబుల నేయుచు, నాతని సఖుఁడగు నారదుని యొద్దకుఁ దఱుచుగ నేఁగి యాతని సేవించుచుండెను. ఆతని భక్తికి మెచ్చి భూసురులు నారదునితో "నాతని యభీప్సితంబుదీర్పు"మని చెప్పిన నకలహాశనుండును సృంజయునిజూచి నీయభీష్టంబు నాకుఁ జెప్పక యేలదాచితివి? నీయిష్టంబెయ్యది? దానిఁదప్పక నిత్తు నన నాతండును మూత్రపురీషలాలాశ్రుస్వేదంబులు సువర్ణంబగునట్టివాఁడును సుగుణసంపన్నుండును నగు నొక్కపుత్రుని గోరెను. అమ్మహాముని యు"నట్లగుగాక"యని వరంబిచ్చి చనియె. అంత గొంతకాలంబున కాతనికి నొక్కపుత్త్రుఁ డుద్భవించిన సృంజయుండాతనికి సువర్ణష్ఠీవియను నామంబిడి యతిగారాబంబునఁ బెంచుచుండెను.

"అక్కుమారుఁ డపరిమిత సువర్ణంబొసగుచుండ, నామహీపాలు శయనాసన గృహప్రాకారాది సమస్తవస్తువులును, సువర్ణమయంబులగుచుండఁ జోరులు కొందఱాతని ముచ్చిలి యొక విపినంబునకుఁ గొంపోయి యాతని యుదరంబు వ్రచ్చి పసిడిగానక యాపీనుంగు బారవైచి, తమదురితంబుచే నన్యోన్య కలహంబులు గల్పించుకొని, యొండొరుల వధించుకొని యందఱు నధోగతిఁ జెందిరి.

"సృంజయుండును సుతుంగానక వెదకివెదకి యొక్కచోఁ దత్కళేబరంబుఁ గాంచి, యాతనికి బరలోకక్రియలు నిర్వర్తించి శోకసాగర మగ్నుఁడై యుండ నాతని యొద్దకుఁ ద్రికాలవేదియగు నారదుం డేతెంచె. సృంజయుండును నాతని విధ్యుక్తంబుగ బూజించి తనశోక కారణంబుఁ దెలుప నద్దేవముని యాతనిం

జూచి "మానవేంద్రా! శోకంబున నిట్లు గుందినఁ బ్రాణాపాయంబు సంభవించును. అజ్ఞానంబగు దుఃఖంబు విడువుము. ఎంత సంతాపంబునొందినను, జచ్చినవారు గ్రమ్మరవత్తురే? తొల్లి సంవర్తాది షోడశ మహారాజు లమిత సుఖంబులనుభవించి యనేకజన్నంబులొనరించి భూసురులకమితధనంబు లొసంగి, ఘనంబగు యశంబు నార్జించియు, నీపుడమి విడనాడిపోయిరేగాని, యిందుండఁజాలిరా? కావున నీవును విగతశోకుండవై ధైర్యంబు నవలంబించియుండుము" అని యిట్లు బోధించినను సృంజయుండేమియుఁ బలుకకుండెను. నారదుండును నానరేంద్రుగాంచి "నేఁజేసిన యుపదేశంబు బూదిలో వేల్చిన హోమంబయ్యెనా? ఏమి పలుకకుంటి?" వని నాతండు కరంబులు జోడించి "మునీంద్రా! నీయనుగ్రహంబున గతకల్మషుండనైతి పుత్త్రశోకాపహంబగు నీవాక్యంబులు వినుటచే మనంబునఁ గల కలంత యంతయుఁ బాసె" అని చెప్పిన నమ్ముని ప్రీతుండై "నీకేది యిష్టంబు గోరు" మనిన నాతండు "చోరులచే నపహృతప్రాణుండైన పుత్త్రుని బ్రతికింపు"మని వేఁడుకొనియె. అతఁడు "అట్లయగుఁగాక" యని యనుగ్రహించిన సువర్ణష్ఠీవియుఁ జూచువారలద్భుతమొందఁ జనుదెంచె. నారదునను గ్రహంబునఁ బునర్జీవితుండైన యాకుమారునకు సృంజయుండు విద్యలన్నియు నేర్పి వివాహంబొనర్చి యతండు సేయు యాగంబులకును, త్యాగభోగంబులకును, సంతసించుచుండె. సువర్ణష్ఠీవి విశిష్టతాపుత్త్రుండును కృతవివాహుండును యాగకర్తయు, భోగభాగియు సంతానవంతుండును, గానిసమ

యంబున సమయుట గారణంబుగ, నన్నారదుండు గారు
ణ్యాతిశయంబున వానిఁ గ్రమ్మఱ బ్రతికించె ఇట్టిలోపంబు లెవ్వి
యులేక మహాశౌర్యంబున శత్రులఁ దూవుమాపి నాకలోకసుఖం
బనుభవించు మన్న యభిమన్యునకు నీవిట్లు వగవ నేల? ఈలోకం
బు దుఃఖబహుళం బని యెంచి, మానవులు తపోదానాద్యనుష్ఠా
నంబులఁ బరలోక సుఖంబు సాధింపఁజూచుట సుప్రసిద్ధంబు
గదా? నీపుత్త్రుండు ఎట్టివారును బడయనేరని పుణ్యలోకంబున
నుంటచే నాతనికై చింతింపక స్థిరమనస్కుండవై యుండుము
పోయివచ్చెద"నని చెప్పి యప్పారాశర్యుం డంతర్హితుండయ్యె.

* అర్జున ప్రతిజ్ఞ *

ధర్మజుండు నుపశమితశోకుఁడయ్యెను తమ్ముండగు
విజయుచ్చునకుఁ దనయుని గుఱించి యేమి సెప్పువాఁడ నని తల్లడి
ల్లుచుండె. పార్థుండును దనపుత్త్రమరణంబు నగ్రజువలన విని
భూపతితుండయి తనయుని బరాక్రమాదిగుణంబులఁ దలఁచి,
వనివి పనివి "ఇంతకుఁ గారణంబు సింధువిభుఁడే"యని నిశ్చ
యించి యరుణాననుండగుచు బొమలుముడివడ, మేనుకం
పంబునొంద నగ్రజుం జూచి,

"వినుఁడీ నాదుప్రతిజ్ఞ నవ్వ నఖిలోర్వీనాథులుఁ గాఁ సింధురా
జా నవశ్యంబును జెల్లి సంపుదు భయార్తుండై నినుం జొచ్చినన్
దనజాతుం శరణంబు వేఁడినను గర్వంబేది నన్నుం దగం
గనినం బోరు దొలంగిపోయిన వెఱుంగంగాని సత్యవ్రతా!

అట్లు జేయనేని బ్రహ్మఘాతియు, మద్యపానరతుం

డును, గురుతల్పగుండును, సువర్ణహర్తయుఁ బోవుగతికిఁ బోవువాఁడ. మఱియు రాజు లందఱు వీక్షించుచుండ గాండీవంబుతో వవలంబుఁజొచ్చువాఁడ" నని ఘోరంబుగఁ బలికె.

అత్తఱి సుభద్ర పుత్రశోకాతుర చిత్తయై పురపుర బొక్కుచుండఁ గృష్ణుండు గారవంబున నమ్ముగువఁజూచి "సుదతీ! నీసూనుండు తుచ్ఛంబగు నీలోకంబు విడిచి పుణ్యలోకంబుననుండె. కావున నాతనికై శోకించుట తగదు. మఱియు,

క్షత్రియుఁడొకొంత పుత్రకునిఁ గాంచుట వాఁడతిలోకవీరుఁడై
ధాత్రిఁ బసిద్ధికెక్కుటకుఁ దానదిగాక యతండు వీరపత్ని నా
పుత్రియు నెందుఁ బ్రఖ్యాతికెక్కిన నీవు తనూజువీరమృ
త్యుత్సవవార్తఁ బంబు విని సంతసమందక నంద వాడితే?

"కాలంబగుటయు నీలోకంబుననుండ నెవ్వారికిని తరంబు గాదు. అవివేకజనంబులమాడ్కి శోకానల సంతప్త వగుట మానుము. నీదు ప్రియుం డెల్లి సైంధవుం దెగటార్చి, యాతని శిరంబుఁ దెచ్చిన దాని నీ పాదపీఠంబుఁ జేయుము. అర్జునుని ప్రతినదప్పిన భూమివడంకును. రవి సోముల గతులుదప్పును. వార్ధులింకును. కావున నావచనంబుల విశ్వసించి శోకంబు విడిచి సుఖంబుగనుండు" మని యనేక విధంబులఁ జెల్లెలి నోదార్చె. దామోదరు నుపదేశంబుచే నెట్టకేలకు సుభద్రయు శోకంబువిడిచె.

అంత నర్జును ప్రతినవిని సైంధవుండు మహాభయంబున పార్థుండు గానకుండ నెందేని బోవసమకట్టిన దుర్యోధనుం

డాతని కభయంబొసంగె. వాఁడును మనంబున ధైర్యంబు గావక, యాచార్యు నొద్దకుం జని, "ధనుర్విద్యాతిశయంబునఁ దనకును, పార్థునకును గల తారతమ్యం బెట్టిదని యతివినయంబున నడిగె. ఆచార్యుండును వానిం జూచి, "సైంధవా! నీకును పార్థునకును నాచార్యకంబు సమంబైనను నాతండు నానావిధపరిశ్రమంబుల నాఱితేఱి యుండుటచేతను, ప్రయోగంబు లధికంబుగ సాధించుటచేతను, నీకంటె నధికుండై యున్నవాఁడు. అయినను నేనుండ నీవా సవ్యసాచికి వెఱవవలదు. ఇంద్రనందనున కసాధ్యంబగు వ్యూహంబుఁ బన్నించెద. క్షత్రియధర్మంబు భంగంబు గాకుండ సంగరంబు సేయుము. వేదవేదాంగంబు లభ్యసించి యజ్ఞంబు లాచరించి సామాన్యజనంబువలె నిట్లు మృత్యుభయాన్వితుండవగుట నీకుచితంబు గాదు. ఎవ్వారును నీలోకంబు విడనాడి పోవుట సిద్ధంబు. తపోదానంబుల సలిపి పడయు నుత్తమలోకంబు సంగరంబున నిల్చి ప్రాణంబు లర్పించి యనుభవింపండగు." అని యిట్లు యూరడిల్లఁ బలికిన, నాచార్యువచనంబులకు సంతసించి, సైంధవుండు ధైర్య మవలంబించి, యుద్ధసన్నద్ధుండై యుండె.

అర్జునుండు జైత్రంబులగు మంత్రంబులఁ బ్రయోగించి, కృష్ణుఁడు జ్వలింపఁజేయ బాలభాస్కరుచందంబున వెలుంగు నరదంబు భూసురాశీర్వాద నాదంబులు సెలంగుచుండఁ బ్రదక్షిణప్రణామపూర్వకంబుగ నారోహించి, మేరుశిఖరంబున వెలుంగు ప్రభాకరుమాడ్కి, శోభిల్లుచుండె. తత్సమయంబునఁ గౌరవులకు దుర్నిమిత్తంబు లనేకంబులు గానంబడె. పాండవశిబి

రంబులందు నిమిత్తంబు లనుకూలంబుగ నుండె.

ఎనిమిదవ ప్రకరణము

* ద్రోణుని చతుర్థ దివస యుద్ధక్రమము *

తత్సమయంబున గురుండు సమరోత్సాహ విరాజితుండై నిజశంఖంబు పూరించి సైన్యంబున మెలఁగుచుండఁ గౌరవయోధు లొండొరులతో బిరుదులువలుకుచు సింహనాదంబులు సేయుచు, చిందంబులు పూరించుచు, జ్యారావంబులు సెలంగుచుండ మహానందంబున నుండిరి. అప్పుడాచార్యుండు సైంధవుం జూచి, ''నీవు భూరిశ్రవ కర్ణాదులం గలసి పదునాలుగు వేల గజంబులను, నఱువదివేల యరదంబులను లక్ష వాహనంబులను బదిలక్షల కాల్బలంబును గైకొని, నాతీర్చు వ్యూహంబునకు యోజనత్రయమాత్రప్రదేశంబున బిఱిందిదెసనిలువుము. అట్లేని నిన్ను నిర్జరవరులును దేఱిచూడఁజాలరు'' అనిన నాతండు మిగులసంతసించి కర్ణాదులు పరివేష్టింప నట్లు నిలిచియుండె భారద్వాజుండును ద్వాదశ గవ్యూతిదీర్ఘంబును బంచ గవ్యూతివిస్తృతంబునుగ శకటవ్యూహంబును దానికిఁ బశ్చిమార్థంబున గర్భవ్యూహంబుగఁ బద్మవ్యూహంబునుతన్మధ్యంబు మొదలు క్రమంబుగ సైన్యంబు దెనకు నిగుడునట్లుగసూచీముఖవ్యూహంబునురచియించె. తన్ముఖంబునఁ గృతవర్మయు, నాతని పిఱుందఁ గాంభోజుండను, నాతనివెనుక శతసహస్రయోధుల ముందిడుకొని, సుయోధనుండును సూచీమూలస్థానంబులఁ బూర్వోక్తప్రకారంబున సైంధవుండునునిలుచునట్లుగ

నొనరించిన యమ్మహావ్యూహంబుఁజూచి యమరులు సంతస మందిరి. ద్రోణుం డభేద్యంబగు నావ్యూహంబుముఖంబున దండధరుమాడ్కి నిలిచియుండె. గురుచే సంరక్షితంబగు నా సైన్యంబు ససాగరపర్వతారణ్యంబుగఁ బుడమినంతయు మ్రింగ యత్నించునట్లున్న గనుంగొని, కురురాజు సంతుష్టాంతరంగుఁ డయ్యె. పార్థుండును దన వానరకేతనంబేపారుచుండ, భీషణాకారంబున నాతని కనతిదూరంబుగ దృష్టద్యుమ్నాదులతోడ నిలచియుండె. వారు శంఖభేరీమృదంగధ్వానమే దురంబుగ సింహనాదంబులనొనర్చిరి. ఇంద్రనందనుఁడు గన్నెదిర్చిన శూరవరులనంతంబునొందించుచుఁ దనప్రతిన దలఁచి సైంధవు దెసకు మనంబునిగుడఁ గౌరవసైన్యంబుపై నడచె. అంతఁ గృష్ణునానతిచేఁ దనయగ్రభాగంబుననున్న గురునకు నమస్కరించి, కరములు మొగిడ్చి "మహాత్మా!

> మేలుదలంపఁ శోభనము మేకొని చేయుము నాకు బాండుభూ
> పాలుని ధర్మనందనుని పంకజనాభుని యట్లు కావె? మ
> త్పాలనవృత్తికీవు నిను భార్గవ నేని భవత్ప్రసాద లీ
> లాలసితుండనై మొన దలంకఁగఁ జొచ్చెద ధీవరోత్తమా!

నీవును పుత్త్రవాత్సల్యంబున నన్నుం బెంచితివి. కావున దురాత్ముఁడగు జయద్రథుఁ జంపఁబూని ప్రతినయొనర్చిన నన్ను దయార్ద్రదృష్టింజూడుము."

అని యిట్లతండు దన్నుఁ బ్రార్థింప నగ్గురుండు చిఱునగవొప్ప నాతనివీక్షించి "నన్ను జయింపక యెట్లు సైంధవుఁ జేరెద"

వని పలుకుచు నాయింద్రనందను సారథియగు శ్రీకృష్ణుని, ఆతని రథాశ్వంబుల, బాణవృష్టిముంప, నా సవ్యసాచి గురువనుజ్ఞవడసి నవనారాచంబులు నాతని మేనఁ గ్రుచ్చె. వానినయ్యాచార్యుండు నడుమనె నఱికి, వెంటనె నరనారాయణుల మేన నిశాతశరంబుల నాఁటి, మహాఘోరంబుగఁ బోరుచుండె. అత్తఱి నవ్వృద్ధుండు, తరుణుండయ్యును వృద్ధుండగు ద్రోణుఁ గడవంజాలక చిక్కువడి, తుదకుఁ, గృష్ణసన్మతిని యాచార్యునకుఁ బ్రదక్షిణంబుగ వరదంబుఁబోనిచ్చుచుండె. భారద్వాజుండును, బార్థుఁజూచి "నన్నుజయింపక యిట్లుపోవుట నీవంటిశూరునకుఁదగునా" యని యాతనిఁ బరిహసించుచు నిశితాస్త్రంబుల నేయుచుండె. ధనంజయుండును "భరద్వాజనందనా! నిన్నెదుర్కొన నాకలవియగునా ? క్రోధమూర్తివగు నిన్నెదిరించుట కాపృత్యుంజయుండును వెఱచును. అదియునుంగాక నీవు గురుండవుగాని, నాకు శత్రుండవు గావు" అని యా సవ్యసాచి సైన్యంబుఁ జొచ్చి, తన ప్రతిజ్ఞఁ దలంచి, సామజంబు సరోవరంబు గలంచు చందంబున, శత్రుబల ప్రకరంబులఁ జీకాకు పఱచుచుండె. ఆచార్యుండును నాతనిఁ గదిసి, వింశతిసాయకంబుల నేయ, నాతండు వాని నడుమనే ఖండించి, విశాలాస్య ప్రదరంబొక్కటి భారద్వాజుపై నేసె. అంతశూరుండగు నాగురుఁడు దానిఖండఖండంబులుగఁజేసె. మఱియు నరునిపైనుభూధరంబు గురుండను జలధరంబు శరవృష్టిచే ముంప నాతండును వానినేయక యాశ్చర్యంబున నా బాణవర్షంబు నివారించుచుండెను. పదంపడి యు

య్యాత్రిగుడుండు పంచవింశతిసాయకంబుల నర్జునుని, సప్త తిసాయకంబుల దామోదరుని, నొప్పించిన నాతని వంచించి పార్థుండు కృతవర్మసైన్యంబునం జొచ్చె. చేయునదిలేక ద్రోణుండు సేనాముఖంబునకుం జనియె. ఇత్తెఱంగున పార్థుండు ద్రోణుం గడచి, యనేకయోధులం బరిమార్చి, కృతవర్మాదుల నెట్టువఱచి యతిశయించుచుండె.

దాని సహింపక సుయోధనుం డొంటరిగ ద్రోణు నొద్దకుం జని, కటకటంబడుచు, "పార్థుండు నిన్ననాయాసంబుగ, గడచి సైన్యంబునంతయు నేలపాలుగావించుచున్నను ఆవంకం దలయెత్తియైనను జూడవు. పాండవపక్షపాతివై నీవు మాయొద్ద గోముఖవ్యాఘ్రంబు చందంబున నున్నాడవు. యుధిష్ఠిరుం బట్టియిత్తునని యేనంతసంతసము నొందుటకై చెప్పియుంటివి; నీవచనంబుల విశ్వసించి సైంధవుండు నెచ్చోటికిం జనక, యిచ్చటనే నిలిచియుండె. నీవాతని నింజంపంబూనిన తేనెపూసినకత్తివి గాక శూరుండ వెట్లగుదువు!"

అని యిట్లు నిష్ఠురంబులాడి, కార్యావసరంబునం జేసి తనక్రోధంబు తాన యడంచుకొని, యతండు మగుడ భారద్వాజుం జూచి "గురువర్యా! తొందరచే నేనాడినమాటలను క్షమించి, భీతిచే వెలవెలబాఱుచున్న జయద్రథాదులు మరణంబునొందకుండ గాపాడు"మని యనేకవిధంబులం బ్రార్థించె. ఆచార్యుండు సుయోధనుం జూచి "కుమారా! మాయశ్వత్థామవచనంబులకును, నీమాటలకును నేంగోపపడనునే! దామోదరు నైపుణ్యంబుచే మారుతవేగంబున నయ్యర్జునురథఘోట

కంబులు జనుచుండ, నేనెట్లు పార్థుఁ జననీక యాఁగువాఁడను! కన్నులారఁ గాంచియు నీవిట్లేల నిష్ఠురంబులాడెదు! అయినను నీయందలి స్నేహంబుచే నీకొక్క హితంబు సెప్పెద నాకర్ణింపుము.

"సేనాముఖంబు వదలి నేనయ్యర్జును వెంటఁ దగిలినఁ బాండవబలంబు మన సైన్యంబులఁ జిక్కుపెట్టును. మన సైనికులు గలంగిన, సింధునాయకు రక్షణంబు మహాకష్టంబగును. భూపాలమధ్యంబున యుధిష్ఠిరుఁ బట్టియిచ్చెదనని నీతో నాడిన నాకు నక్కార్యంబును నేమఱం దగదు. కావున నయ్యమనందనుఁ బట్ట వేచియుండెద. నేను వృద్ధుండ నగుటచే శీఘ్రగమనంబశక్యంబై యుండును. గాండీవియు నీవును దుల్యవయస్కులు. అదియునుం గాక శంకలేక నీవాతనితో విరోధంబుఁ గొన్నవాఁడవు. కావున తగు సహాయంబుఁ గొని యప్పార్థున నడ్డుపడు" మని పలికె. సుయోధనుండును, గురుఁ జూచి "పార్థుండు నిన్నును గృతవర్మను గెలిచి యనేక శూరుల నవలీల నతిక్రమించి యతిశయించుచుండ, సురలతోఁ గూడ నా పురందరుఁడైనను నాతనిం దాఁక శంకించు. అయినను నీయాజ్ఞ శిరంబునం బూని, నీయనుగ్రహంబు గల దేని యశంబుఁ గాపాడెద."

అనిన నగ్గురుండు కౌరవపతిం గనుంగొని "నీవు నిజంబ పలికితివి. పార్థుండట్టివాఁడ. నీకు హితంబుఁ గోరి నేఁడు నేనొక్క యద్భుతంబు సూపెద; తొల్లి దేవసంరక్షణార్థంబుగ నొక్క పసిండికత్తళంబు జలంధుడు దేవేంద్రునకొసంగె. ఆతం డంగిరసునకు, నాతండు గురునకు, నాగురుం డగ్నివేశునకు

నగ్ని వేశుండునాకును గ్రమంబున నొసంగిరి. ఇక్కవచధార ణంబున నీవయ్యర్జునుఁ దలపకుము. అట్లయిన నా సవ్యసాచి శరంబులు నీశరీరంబుఁ దాకకుండు" నని చెప్పి సమంత్రకం బుగ నాకవచంబు నాతని కొసంగె. అతండును, నియతా త్ముఁడై దానిందొడిగి, యాచార్యుండు దీవింప సంతసించుచు నరదంబెక్కి యనేక రథికవరులు దన్నుఁ బరివేష్టింప, వివిధ తూర్యంబులు నింగిముట్టుచుండఁ బొడ్డుఁదలపడి, యధికసంగ్రా మంబుగావించె. అయ్యవసరంబున నిలాతలంబు మధ్యందిన మార్తాండసహితంబగు నాకసంబుంజూచి సహింపక, భాను ద్వయంబును ధరించెనో యన్నట్లు గురుండును ధృష్టద్యుమ్నుం డును, దీవ్రంబుగ బోరఁదొడఁగిరి. ఉభయసైనికులును బల్లవి తాశోకపుష్పితకింశుక వనంబులంబోలి, విరాజిల్లుచుండిరి. గాంధారేయుండు భయకంపితుఁడై ద్రోణునిదెసకుఁ బాఱెను. గురుండతికుపితుండగుచుఁ బాంచాలసైన్యంబులఁ బొదివి నభ శ్చరులు పొగడునట్లీసునఁబోరుచు, ధృష్టద్యుమ్న రథాశ్వంబు లఁబడనేసి, సూతుఁ దునుమాడి, శిరంబుద్రుంచి, కులిశసదృ శంబగు నొక్కనారాచంబేయ, నద్దాని సాత్యకి నడుమన ఖండించె.

ఇట్లు కృష్ణానుజుండు మృగరాజు పొదివిన కురంగంబుఁ గాచుచందంబున ధృష్టద్యుమ్నురక్షించి, యరదంబు తోలం గఁగొనిపోయె. అంత భారద్వాజుండు వహ్నిసహితంబగుమహో రగంబుమాడ్కి సాత్యకిపైఁగవిసిన, నతండు "భూసురుండు ధర్మతనయుభయంకరుండుగావున, నీతనిమార్కొనవలయు" నని

తన సారథికిం జెప్ప నాతండు తేరు ద్రోణున కభిముఖంబుగా
వించె. ఆయిరువురకయ్యంబు వియచ్చరు లచ్చెరువున నాకసం
బున నిలిచివీక్షించుచుండిరి. అట్టియెడ సాత్యకి ద్రోణుకార్ము
కంబు ద్విఖండంబులుసేయ, గురుండొండొకవిల్లుఁబూనె. అవి
యును భగ్నంబుగావించి, యాతండు ధరించిన విండ్లన్నియును
గ్రమంబుగ శకలంబులు సేయుచుండె. ఆచార్యుండును వాని
పరాక్రమంబునకు సంతసించి యాత్మగతంబున "నీతండు పరశు
రామ, గాంగేయ, కార్తవీర్యులకుఁ దుల్యుం"డని యెంచె. కౌ
రవసైనికులును నాతని పరాక్రమంబు నధికంబుగఁ గైవా
రంబొనరించిరి. దాని సహింపక యాకోదండగురుండాగ్నేయా
స్త్రంబు శినివరుపైఁ బ్రయోగింప, నాసాత్యకియును వారు
ణాస్త్రంబు వెంటనెప్రయోగించె. ఆదివ్యాస్త్రంబులు రెండు
నుభయబలంబుల హాహాకారంబులెసంగఁ బోరిపోరి తుదకు
శాంతిఁబొంది నిలిచియుండెను. ధర్మజ, భీమ, నకుల, సహదే
వులు శినివరునకుం బాసటయై నిలిచినఁ బోరు ఘోరంబయ్యె.

అర్జునుండును సైంధవుదెసకు వేగంబునఁ జనుచుండ,
నవంతిదేశాధీశులు విందానువిందులను వారు నాతని నెది
రించి తమయొప్పుఁజూపిన, నశ్రమంబున వారలశిరంబులఁ
ద్రుంచి, యాతండతిరయంబునఁ జనుచుండె. అయ్యెడఁ గౌర
వసైన్యంబు పొంగినసముద్రంబుభంగినుండఁ బార్థుండు చెలి
యలికట్టచందంబుననుండె. సుయోధనుండును, కుంభసంభవ
దత్తంబగు కవచంబుకతంబున భయంబుదక్కి బలంబునకుం
దలఁగడచి, తన యరదంబు సైంధవుదిక్కున కడ్డంబుగఁబోని

చ్చిన, వతని నూరెలనున్న వీరానీకంబులు మోదంబున సింహ
నాదంబులు సేయఁదొడఁగిరి. అత్తఱిఁగృష్ణుండు సుయోధనుం
జూచి "పార్థుతో దురాత్ముఁడగు నితండె మీయాపదలకు
మూలంబనియు, నీతంఁడు దెగిన మీమనోవ్యథ తెగు"ననియు
బోధించి, యిరువురదిక్కునకు యరదంబు సుయోధనుదెసకు
నడుపుచుండె.

ధార్తరాష్ట్రాగ్రజుండును కృష్ణార్జునుల కభిముఖంబుగఁ
దన యరదంబుఁ బోనిచ్చుచుండె. కౌరవసైనికులు కృష్ణార్జునుల
యహీనసముద్ధతిఁ జూచి, కురురాజుదెస నాసమాని యుండి
రి. సుయోధనుండత్తఱిఁ బార్థుందలపడి, యాతని నధిక్షేపిం
చుచు, నానరనారాయణుల మేన ననేక విశిఖంబుల నాఁటఁ
జేసినఁ బార్థుండు క్రోధాతిశయంబున నాతనిమేన ననేక శరం
బులనేయ నవి యాతని మైమఱువుదాకి, మిట్టిపడుచుండె.
అందుల కద్భుతమంది యున్నరుండమరపతి, తొల్లి తనకొసం
గిన నిఖిలకవచనిర్భేదనశీలంబగు నొక్కయస్త్రంబున, నాసు
యోధనుకవచంబు భేదించె. దాన నాతని గర్వంబడంగె.

భారద్వాజుండు యుధిష్ఠిరుందలపడి పంచవింశతి సా
యకంబుల నాతని నొప్పించిన నాయమనందనుం డతికుపితుం
డగుచు ననవనారాచంబుల ద్రోణుపైనేసె. మఱియు ద్రోణుం
డుగ్రాస్త్రంబులచే ధర్మనందను వాహవంబులను సారథిని శర
పరంపరలచేఁ గప్పుచుండ నాయుధిష్ఠిరుండు గరలాఘవంబు
మెఱయించుచు, వానినన్నిటి వృథసేయుచుండె. గురుండలిగి
యజాతశత్రుకోదండంబు భగ్నంబుగావించి, పెక్కమ్ము

నాతని యరదంబు ససారథితురంగంబుగ ముంచిన, సేనలాతని దిక్కు మొగంబై, "యాచార్యుం డిప్పుడు ధర్మజు లెస్సగ మార్కొనియె, ధర్మతనయుం డిత్తరుణంబున మరణంబునొందునో! ఓడిపోవునో? బలహీనుండై పట్టువడునో? "యనుచు నాతని నిరీక్షించుచుండిరి. అంతఁ గౌంతేయాగ్రజుం డొక్క కార్ముకంబుఁ బూని గురుశరంబుల ఖండించి, శత్రులు దలంకు నట్లుగ, మహానలజ్వాలాభీలంబగు నొక్కశక్తి యాచార్యుపైఁ బ్రయోగింప, నాశక్తి గురుశక్తి మాయించునని, యందఱు భీతిం జెందిరి. గురుండంత మహాక్రోధంబున బ్రహ్మాస్త్రంబు ప్రయోగించిన, నాతని శక్తి నేలఁ గలపి ధర్మజుపైకి దివచ్చుచుండ, నతండు నయ్యస్త్రంబున నే దాని శాంతిం బొందించి, యైదుబాణంబుల గురుని కోదండంబు భగ్నంబు సేసె. గురుండంత భీకరంబగు నొక్క గదచే నాతనిపైవ ధర్మపుత్రుండును నొక్క గదచే దానిఁ జూర్ణంబు సేసె. ద్రోణుండు కోపోద్దీపితుండై ధర్మజు రథ్యంబులఁ గూల్చి, కోదండంబు ఖండించి, కేతనంబుఁ దునుమాడి, శరీరంబు నొప్పింప, నాతఁ డరదంబు డిగ్గి నిరాయుధుఁడు, నూర్ధ్వబాహుండునై యూరకుండె. దానిఁ జూచి రాజనీతి విశారదుఁడగు ద్రోణుండవ్విభు నేయుటమాని తనచూడ్కింబడిన చతురంగబలంబుల మడియించుచుండె. తత్సమయంబున చూపఱు లందఱును "గురుండు కుంతీతనయాగ్రజు నేఁడు పోనీక పొదివి పట్టుకొను" నని తలంచుచుండఁ దన చిన్నతమ్ముండగు సహదేవు నరదం బెక్కి యాతండు సమరంబునకుఁ దొలఁగి చనియె.

అపక్రపరాక్రముండగు శినివరుండు గౌరవసైన్యంబు నుఱుమాడం దొడంగిన, ద్రోణుండాతనిమార్కొని, పంచవింశతిశాతసాయకంబుల నతనిచే నేటులువడి, మూడునారాచంబుల నతనినొప్పించె. ఆయాదవవీరుఁడును పంచాశద్బాణంబుల మగుడ గురునొంచిన, నాకోదండగురుండు నవవిశిఖంబులెమ్ములఁ గీలించి శతశరంబులు మొయి గిరిగొలిపి కృష్ణానుజు నేపుమాపె. కౌరవులుబ్బునార్చుచు నానందార్ణవనిమగ్నులై యుండిరి. ధర్మజుండత్తఱి ధృష్టద్యుమ్నాదియోధులంగాంచి, "గురుండు ప్రాటఁబట్టి పులుంగునలంచి యూడెను బాలుభంగి, సాత్యకిం గారించుచున్నవాఁడు. ఆతనిం బాదివి యాతని కడ్డపడరేని, మోసంబు వాటిల్లు" నని వారలకుత్సాహంబు గల్పింప భీమసేనాదిరథికవరులు సాత్యకిం గడచి, యాచార్యుఁదలపడిరి.

బంధుజనంబువలె గురుండు వారలఁ జూచుచు మందహాసంబున మార్గణజాలంబుల వర్షింపఁ దత్సమయంబున నిరువదియేవురు పాంచాలురును, నూర్వురు కేకయులును, వీరస్వర్గంబు నలంకరించిరి. శేషించిన సైన్యంబంతయును రొంపింబడినటుల నుండె. ఇట్లు భారద్వాజుండు పరాక్రమించినఁ బాండవయోధులు సంగరంబున నిరుత్సాహులై యుండిరి. యుధిష్ఠిరుం "డర్జునునకు సాయంబుఁ జేయఁబొ"మ్మని యనేకవిధంబులఁ దన్ను బ్రార్థించిన, సాత్యకియును ధర్మజరక్షణంబునకై ధృష్టద్యుమ్నాదుల నియోగించి, యర్జునుఁ గలయఁ జనుచుండె. కౌరవులాతనిమార్కొనియాతనికోల్తల శౌర్యంజాలక యమసదనంబునకరుగుచుండిరి. ఆసమయమునఁ గుంభసంభ

త్రుఁడాతని వాఁడిమయూఖంబులఁ గప్పి "శైనేయా! నీయాచార్యుండే నా చేతిబలంబుసూచి యోడి తొలఁగిచనియె. నీవెట్లు నన్నుఁ గడచి పోవువాఁడవో చూతుంగాక." అనవుడు శినివరుండు "గురువర్యా! ధర్మజునాజ్ఞచే గాండీవియొద్దకుఁ జనుచున్న వాఁడ; నాలస్యంబుకాకుండ నన్ననుగ్రహింపుము. శరణాగతరక్షణంబు పెద్దలకర్తవ్యంబుగదా?" అని పలికి యాతనికిఁదొలఁగి చనుటయే సమంజసంబని యూహించి దైత్యమర్దను తమ్ముండు తనసారథిం జూచి "ఈ యాచార్యుండు మనలంబోనీక పెనంగును ఎవ్విధంబుననయిన నీతని వంచించి పోవలయును" అని చెప్పిన నతండును ద్రోణునకు దూరంబుగఁ దేరుఁ దోలుచుండె.

ద్రోణుండును సాత్యకి వెన్నంటి పెక్కమ్ములఁ బొదివినఁ గౌరవవీరులును మృగపతివిక్రముండగు నాయదుసింహంబుపై నిశాతసాయకంబుల నిగిడించిరి. కృష్ణానుజుండు వాని లెక్కసేయక గురునిపై శితశరంబుల నిగిడించె. ఇట్లయ్యిరువురును నొండొరుల శరజాలంబులవారించుచు నశ్వాంగంబుల రక్తసిక్తంబు గావించుచు, సారథులనొప్పించుచు, కాల్బలంబుల ఖండఖండంబులు సేయుచు, గజారోహకులం గాసింబఱఁ జేయుచు, ననదృశంబులగు హస్తలాఘవంబులం దుల్యంబుగఁ బోరునెడ, నాకోదండగురుండు కృష్ణానుజు ధనుర్భంగంబు గావించి, యొక్కగదవైచె. శైనేయుండును గోపాటోపంబున ద్రోణుమేనఁ గ్రూరనారాచంబులఁ జొప్పించె. అంత గురుండలిగి యొక్కమహాశక్తియారథిపై నేయ, నది విధివశం

బునఁ దేరిపైఁబడియె. తనశక్తివిఫలంబగుటకుమిగులఁగోపించి యాచార్యుండాశినివరుచాపంబుద్రుంచి, సూతుమూర్ఛఁబడ నేయ రథ్యంబులాతని యరదంబురణరంగంబునకుఁదొలగించె. కొంత వడికి నేదఁ దేరి, సాత్యకియు నెట్టకేలకు గురుండను జలనిధిం గడచి, మొగ్గరంబుసొచ్చె. గురుండొకదెసను సాత్యకియొక్క కెలనను. సైన్యంబుల నాశనంబు గావించుచుండిరి.

ధర్మజుచే ననుజ్ఞాతుఁడై భీమసేనుఁ డర్జునుకడకేగుచుండ నాతని భయంకరాకారంబుచూచి, కౌరవ సైనికులెవరొక్కనం జాలక నలుఁగడలకుం బాఱుచుండిరి. గురుండాతని నుగ్రాస్త్రంబులం గప్పి తన మనంబున వీఁడు వివ్వచ్ఛువలె నన్ననుసరింపఁగలవాఁడని తలంచి, యమ్మారుతిం జూచి "నన్ను జయింపక నీ వెట్లు మొగ్గరంబు చొచ్చెదవు? నీతమ్ముండగు ధనంజయుండు నన్ననుసరించియేగదా మొగ్గరంబు సొచ్చె" అనిన పవమానతనయుండు కనుఁగవ గెంపార ద్రోణుంజూచి "నాతమ్ముండొక్కని యనుసరించువాఁడే? సురలనైనను జయించి తావలఁచిన దిక్కునకు విచ్చలవిడిఁ బోవగల సమర్థుండు. అయినను ప్రియములాడి నిన్ననుసరించి పోవ వీఁడు పార్థుండుగాడు. శత్రుదుర్నిరీక్ష్యప్రతాపుండగు భీముండని యెఱుంగు"మని పలుకుచు నాభారద్వాజుతో ఘోరసంగరంబొనరించి యాతని మెప్పించి మొగ్గరంబు సొచ్చె. తత్సమయసంగ్రామం బతిభయావహంబుగనుండె. వివ్వచ్ఛుండు మధ్యందినమార్తాండు భంగి వెలింగి సురలకద్భుతంబు గావించె. వెండియు రథికవరు లందఱు నొక్కపెట్టున నాతనిం దఱుమ నతండందఱ

నమ్ముల వెల్లిం దేల్చి, జయద్రథు సమీపించె. సురలును, సైనికులును, నానావిధంబులఁ బ్రస్తుతింప సైంధవుండు క్రూర నారాచంబులఁ బార్థుపై వడరించి, హయకేతన గాండీవంబులు చూర్ణంబగు నట్లు బాణజ్వాలలఁ బైఁబఱపె. విజయుండును సైంధవు వరాహధ్వజంబును, సారథి శిరంబు నేక కాలంబున భూమిపైఁ బడనేసినఁ, గౌరవసైనికులు దామరపాకు నీటిభంగిఁ దలంకిరి. అత్తఱిఁ గృపాశ్వత్థామశల్యవృషసేనులు దెంపు నేసి, సైంధవున కడ్డంబై నిలిచిన, నాసవ్యసాచి యాసైంధవుఁ బడనేయ నలవిగాక యవ్వడుగ జూచుచుఁ బ్రొద్దు దిక్కుఁ గనుంగొనుచుండఁ గేశవుం డతనిఁ జూచి "నీ వింకఁ జలంబున సమరంబు సేయఁదగదు. ఇనుండు పశ్చిమ ధరాధరంబు నలంకరించుచున్నవాఁడు. ఏనొక్క యుపాయంబు సెప్పెద నాకర్ణింపుము. రవిమండలము మఱుగువడునట్లు నేను దమంబు గావించెద నట్లయిన సైంధవుఁడును, వానివారలును, బ్రతినభంగంబయ్యెనని మహానందంబున విచ్చలవిడిఁ దిరుగుచుందురు. తత్సమయంబున నీ ప్రతిజ్ఞ దీర్చికొమ్ము" అని పలికినఁ దన పరాక్రమంబు నవ్యాజంబయ్యెనని మనంబునఁ జింతించు నరునిఁ గనుంగొనుచు, నమ్మురవైరి మాయాతిమిరంబుఁ గల్పించె. అయ్య సూర్యాస్తమయంబని యెంచి, కౌరవసైనికులు మహామోదంబున నార్చుచుఁ జెలంగుచుండిరి. జయద్రథుండును దల యెత్తి పడమటిదెస వీక్షించుచుండె. నారాయణుం డాసమయంబున "నపరదిశ నెత్తి చూచుచున్న సైంధవుశిరంబు నాలస్యంబుఁ జేయక తెగవేయు"మని బోధింప నన్నరుండు నిజతూణీరంబున

గంధమాల్యార్చితమై మెఱయుచున్న విశితశరంబు ధరిసెను. అదియును డేగ పులుంగు నపహరించు మాడ్కిఁ గ్రక్కున సైంధవుశిరంబు నట్టకుం బాపె.

అయ్యవసరంబున శౌరి పార్థుం జూచి "ఓయి! సైంధవు శిరంబు ధరపైఁ బడెనేని, మోసంబు వాటిల్లు కావున నద్దాని నభంబుననె నిలుపుము దాని చందంబు వేగిరమె నీకెఱింగిద చెద" ననిన నన్నరుండనేక బాణంబులఁ బ్రయోగించి, చిత్రమ్ముగ నాశిరంబు కందుకంబు విధంబున నాకసంబున నడుపుచుండె. అంత మాయాతిమిరం బగోచరంబగుడుఁ దోయజమిత్రుండు మగుడఁ దోఁచినఁ గౌరవసైనికులు క్రోధాయత్త చిత్తులగుచు, నరుంబొదివిన, వారల వివిధాస్త్రంబులనోర్పించుచు, సైంధవు శిరంబునేమరక యాకసంబునఁ ద్రిప్పుచుండె. ఇట్లత్యాశ్చర్యకరంబుగ విహరించుచు నా సవ్యసాచి హరిం జూచి "యింక నెంతకాలంబీశిరంబు నభంబున నిలువంగ వలెను? దీని నెచ్చటఁ బడవైతును? ఇట్లేల యాచరింపవలసె?" అని సవినయంబుగ నడుగ దామోదరుండతనిఁ జూచి, "శ్వేతవాహనా! సింధుదేశాధీశుండగు వృద్ధక్షత్రుండను వాఁడు దనతపంబుఁ బెంపున నీజయద్రథుం బడసె. ఈతండు కుమారుండై పెరుగుచున్నతఱి నొక్కనాఁ డశరీరవాణి వీఁడు సంగ్రామంబున నేమఱితలఁ దునుమంబడు" నని పలికె తత్కారణంబున నావృద్ధక్షత్రుండెల్లవారును విన వీని మస్తకంబు మహిం బడ నెవ్వఁ డేయువాని మస్తకంబు శతశకలంబులగునని, తనతపోబలంబునఁ బలికి, యాతనికిఁ బట్టంబు

గట్టి తపంబునకై వనంబున కేఁగె. కావున నీతని శిరంబు పుడమిపై బడనీక యావృద్ధక్షత్రుతొడపై వైచునది. ఈ కార్యంబు పాశుపతంబునం గాని చక్కంబడదు. అవృద్ధక్షత్రుండిప్పుడు శమంతకపంచ సమీపంబున నుండు. నీ వమ్మహానీయాస్త్రంబు నాశ్రయింపుము", అనవుడు వాసవి "యట్లగుగాక" యని భక్తియుక్తంబుగ నియతుండయి, తదస్త్రంబు బ్రయోగించిన, నద్దివ్యసాధనంబు శరపరంపరాకారంబై సైంధవు ప్రధానాంగంబుఁ గొని చని, తదాశ్రమద్వారంబు సొచ్చి యమ్మానవనాథుండు తపోయుక్తుండయి యుండ, నతని తొడమీఁద నిడియె. అతండును దదీయ స్పర్శనంబున నెఱింగి దిగ్గున లేచుచుండ, నది భూతలపతితంబయ్యె. అంత నాతని శిరంబు శతఖండంబులయ్యె.

కృష్ణుండును మహానందంబునఁ బార్థునగ్గించె. సకల భూతంబులు ప్రమోద మానమానసంబులయ్యె. అర్జునుండు నమ్మహాస్త్రంబు నుపసంహరించె. ఇవ్విధంబున సైంధవుతలఁ బార్థుండు గగనంబున నడుపు సామర్థ్యంబు గనుంగొని కౌరవ సైనికులు నివ్వెఱఁగంది యాతనిఁ జూచుచుండిరి. అంతసుయోధనుండు కుంభసంభవు పాలికిఁజని, పరులజయంబును,తనవారు సమయుటయు నెఱిఁగించి, "ఆచార్యవర్యా! నాకై సంగరంబున గంగానందనుండును,సింధువిభుండును మున్నగుశూరులనేకులు హతులైరి, కావున నేనును వారిమార్గంబు నాశ్రయించుటయె సముచితంబనిఁ దోచుచున్నది. పాంచాల బలంబును బాండవ బలంబును, నంతంబు నొందింపక, నాకు వారిఋణం బెట్లు

దీరును ? నరుండు నీకు ప్రియశిష్యుండు గావున నీవాతని సమ
యింపవు. సూతపుత్త్రుండొక్కఁడె మాత్త్ర మార్గ్యుఁడై, శరీరం
బుదాపక సంగరంబు సేయుచున్నాఁడు". అనిన నాచార్యుండు
గటకటంబడి సుయోధనుంగాంచి, "నన్నిట్టి నిష్ఠురవచనంబు
లేలపలికెదు? అర్జును జయింప నసాధ్యంబని యెన్నితావులనో
చెప్పియుంటిని. సురల కజేయుండగు శాంతనవు రణంబున
నాతండు గెలిచిన నాటనుండియుఁ గౌరవుల జయించుట
దుర్లభంబని నాకుఁదోఁచె. అభిమానంబునకై యిట్లు పెనం
గుచున్నాఁడను. న్యాయమూర్తియు, నీతికోవిదుండును,
దైవభక్తుండును నగు విదురుండు వారించినను వినక సాధ్వీ
మతల్లియగు పాంచాలింబరిభవించిన పాపఫలం బనుభవింపక
తీరునా? నాఁడు నీవును నీ పెద్దతమ్ముండును, సూతసూ
నుండును, విశుద్ధచారిత్రులగు కౌంతేయులకొనర్చిన కీడెట్ల
యినను మిమ్ముఁ జెఱుపక విడువదు. వనవాసంబును,
నజ్ఞాత వాసంబును గడపి తమ తండ్రిపాలు పంచియి
మ్మనిన, నీ వివికతంబున సంగరంబొనరించు పాండుపుత్త్రుల
తోడ, నీ యొద్దనున్న కారణంబున సమరంబు సేయు
చున్న నేనొక భూసురుండనే? పెక్కుమాటలేల? నీకై
యిఁక పాంచాలురఁ జంపినం గాని కవచంబువిడువను. నీవును
యథాశక్తిని సంగ్రామంబొనరించుచు, మన సైన్యంబులు
సేవఁజెడక పోరునట్లుఁ బ్రేరేపింపుము." అని తెంపునఁబలికి
వెండియు సుయోధనుఁ గనుగొని "ఈవు భూసురభక్తియుక్తుం
డవై ధర్మమార్గంబు నవలంబించి వృద్ధోపాసనఁ జేయుచుం

డుము. నాసుతుండగు నశ్వత్థామ నాకుంగా వగవకుండునది యని బోధించి నాచేఁ దెగనిఁ పాంచాలురు గలిగిరేని వారిం బోనీక పెనంగిఁ దెగఁజూచునది" యని యాతనితోఁ జెప్పుము.

ఇట్లు గాఢనిశ్చయంబుగాఁ బలికిఁ యుగ్గురుండు వికసిత వదనారవిందుఁడగుచు నానాముఖంబులకుఁ జనినఁ గౌరవ సైనికుల నొక్క మొగంబుగ నిలిపి, సమరోన్ముఖులం గావించె. అంత నుభయసైన్యంబులు ఘోరంబుగఁ బోరుచుండెను. యుధిష్ఠిరప్రభృతులును, ద్రుపదాదులును, శితశరంబులు వరగించుచు ద్రోణుపై నడరిన నాతండు, మొక్కవోని విక్రమంబునఁ బెక్కుయోధుల నుక్కడించుచు, విజృంభించు చుండెను. అయ్యవసరంబున ధరణీపరాగంబు జనంబుల చూడ్కుల నిగుడనీక నిబిడీకృతంబై యుండె. పదంపడి ద్రోణుండు భీమసేనుపై నడరిన సుయోధనాదులును, సూతజుండును నాతనికి సహాయులై కయ్యంబు సేయుచుండిరి. ధర్మజ మాద్రీపుత్రులును, విరాట్ద్రుపదులును దలపడి దారుణంబుగ ననిసేయఁ గడంగిరి. గురునందనుండగు నశ్వత్థామ విజృంభించి శత్రుసైన్యంబులఁ జీల్చి, చెండాడుచు ముహూర్తమాత్రంబున నక్షౌహిణీసైన్యంబు నాశనంబు గావించి, యాతపత్రశతపత్రంబును, జామరమరాళంబును, గేశశైవాలంబును, నాయుధమీనంబును, మాంసమేదోమస్తిష్కపంకంబును, రక్తజలంబునునగు నదీప్రవాహంబుఁ గల్పించె. ధర్మజుండు సైన్యసంతానసమేతంబుగ నురవడించి, నిజభుజాటోపంబు సూపుచుండె.

ఆచార్యుం డుత్సాహదీపితుండగుచుఁ దన ప్రతిజ్ఞ నెరవేర్పంబూని, ధర్మజుపై వాయువ్య, యామ్య, వారుణాగ్నేయాది దివ్యాస్త్రంబుల వరుస నేసిన, నవ్విభుండును బ్రత్యస్త్రంబుల వాని వారించె. మఱియు నగ్గురుం డైంద్రాస్త్రంబున నాతనిభంగబెట్టఁ దలచిన, నదియు యుధిష్ఠిరు నైంద్రాస్త్రంబున వృథయయ్యె. ద్రోణుండు కోపంబున సకలభూతభయంకరంబగు బ్రహ్మాస్త్రంబుఁ బ్రయోగింప, నమ్మానవనాథుండును నమ్మహనీయాస్త్రంబుననే దాని సమయించె. అంత ద్రుపదపుత్రుండగు ధృష్టద్యుమ్నుండతని కడ్డువడిన, నాయుభయులకును నధికంబుగ రణంబు ప్రవర్తిల్లె. కుంభసంభవుండును మఱఁడ ధర్మజుపై వాయవ్యాస్త్రంబునేయ, భూవిభుండును దత్సాయకంబుననె దానిశమింపఁజేసి యాతనిపై ననేకసాయకంబులనేసె. దానింగని కృష్ణుండు "ధర్మనందనా! నినుఁ బట్టికొన నాచార్యుండు ప్రతినఁ బట్టియుండ, నీ విట్లాతని మార్కొనం దగదు. వృకోదరు నైపునకుం బొమ్ము. ఈతని వధించుట కేవ్వాఁడు జనియించె నాతండె యీతనితో గయ్యంబు సేయుఁగాక" అనుడు నాన్నృపాలుఁ డొక్కింత తడవూహించి తొలఁగి చనియె.

తొమ్మిదవ ప్రకరణము

* చతుర్ధదివసనిశాయుద్ధక్రమము *

ద్రోణుండును బాంచాల సేనపైనడరె. ఇట్లుభయబలంబులు మహాసంరంభంబునఁ బోరుచుండఁ బెంధూళి యెగసి

యాంధకారంబతిసాంద్రంబై వాహినులం జిక్కువఱచె. అట్టి యెడం బాండవబలంబు లుద్దండబాహుబలసంపదలం జూపిన, నేపటి కౌరవబలంబులు గలంగి చీకాకువడి, యంధకారంబుకతంబునం గూడుకొనంజాలక నలుదెసలం దొలంగిపోయె. దానిం జూచి, యాచార్యుండు ధైర్యంబు మెఱయించుచు, దుర్యోధనుం గూడి యుద్దామసామర్థ్యంబునం జతురంగంబుల నొక్క వ్యూహంబుగ నమర్చి, యందగ్రభాగంబునం దాను నిలిచె. మఱియు నిరుగెలంకుల నశ్వత్థామసౌబలుల నునిచి నడుమ శల్యునిడి, యన్నరేంద్రుండు వెన్నాదన్ని నిలుచునట్లు సేసె. అయ్యెడ సుయోధనుండు తనబలంబులనెల్ల నాయుధంబులు భూమిపైం బెట్టి దివియలం బట్ట నియోగించె.

రథంబునకయిదును, మాతంగంబునకు మూడును, అశ్వంబునకొక్కటియు నియమితంబుగా గరదీపికలవాని కెలంకులం బట్టునట్లు సేసి, వెండియు వ్యూహంబు ముందటను పార్శ్వంబులను బిఱుందను, బ్రభలునిగుడం బొడవుగా నెత్తి బట్టంబనిచిన నవ్వెలుంగు నింగికిం గేలకుంజాలియుండె. అట్టియెడ మణిభూషణంబులును, రత్నకేతనంబులును, వివిధాయుధంబులును, బ్రతిప్రభలశోభిల్లి కౌరవసైన్యంబెంతయు నొప్పియుండెను. పాండవబలంబులును, రథంబునకుం బదియును, గరికేడును, దురంగంబునకు రెండుగా దత్ప్రకారంబున గరదీపికానికరం బాలోకనీయంబై యుండె.

అయ్యవసరంబున నయ్యస్త్రగురుండు జ్వాలాభీలంబగు వీతిహోత్రుకరణి వెలుంగుచుండె. అత్తఱి గురుని సమ

యింపను, రక్షింపను బూని యనేకులనేకుల మార్కొనిరి. ద్రుపదు సైన్యంబు నమయించు నక్కుంభసంభవుని ధృష్టద్యుమ్నుండు మార్కొని, యైదునారసంబుల నురంబున నాఁటిన, భారద్వాజుండిరువదియేనమ్ముల నాతని నొంచి, కార్ముకంబు రెండుఖండంబులు గావించె. ఆతండును వేరొకవింటమంటలు గ్రమ్మ ఘోరాస్త్రమేయ, నది యాచార్యుచే నడుమన ఖండింపఁ బడియె. మఱియు నా నిశాసంగరంబున మాయోపాయంబుల దశవదన సదృశుండగు భీమనందనుఁడగు ఘటోత్కచుండను దానవుఁ డపరిమిత సైన్యంబుల నంతంబు నొందించుచుండ, గర్ణుండింద్రదత్తంబగుశక్తిచే నాతని వధియించె. అతని మరణంబునకు ధర్మజుఁ డత్యంత చింతాక్రాంతస్వాంతంబున వివశుండై యరదంబుపైఁ జతికిలంబడిన, నచ్యుతుండు రయంబునం జని కరంబులం బొదివి, "ధర్మనందనా! ప్రకృతిజనంబువలె నిట్లు వగచుట నీకు తగవగునె? ఆపదలందు ధీరత్వంబు సజ్జనులకుఁ బ్రకృతిజన్యగుణంబుగదా? నీవిట్లు వగచినచో, సైనికులు భయాకులమానసులగుదురు. కావున నుత్సాహమ్మున సమరంబునకు లెమ్ము నీభారంబు నరయక యింత యలంత నొందిన జయంబు నమకూరుటెట్లు?" అని యిట్లు బోధించిన ధర్మజుండు కన్నీరు కరతలంబునఁ దుడిచికొనుచు హిడింబానందను గుణంబుల నుగ్గడించి 'వాఁడు నాకు భక్తుండు, నేనును సహదేవుకంటె నెక్కుడుగ నాతనికిం గూర్తు నట్టి పట్టి లేకున్న నాకుశోకంబు గలుగకుండనే? అని యంతరంగంబు రోషాక్రాంతంబగుటయు, "నిక్కమారు

నిట్లు సేసిన యీదుష్టుండె మున్న నభిమన్యువిల్లు దునిమి చిక్కు-వరచి యబ్బాలుని బలువురచేఁ జంపించె.

"ఈక్రూరకర్మంబుల కెంతికినిఁ గర్ణుఁ గడికండలు సేయక శాంతిఁబొంద నేర్తునే" యని బిగువుఱలుంగునం బలికి దిగ్గున లేచి "యాద్రోహికి నిన్నయు నేఁడునుఁ దోడ్పడిన ద్రోణుం డెగటార్పవలయుఁ గావున నప్పనికిఁ బోవనియ్యవు. నే నా రాధేయుఁడున్న యెడకుం బోయెద" నని శంఖంబొత్తి, చాపంబుఁ బుచ్చుకొని, రథంబు నడుప సూతు నియమించి చనుచుండె. కేశవుండునుఁ ఫాల్గునరథంబు ధర్మజుదెసకుఁ జననిచ్చుచుండె. అంత సాత్యవతేయుండు యుధిష్ఠిరునకుఁ బ్రత్యక్షంబై ఘటోత్కచమరణంబునకై వగచుచున్న ధర్మజు నాశ్వాసించి "ధర్మనందనా! నీ యనుజులతోడం గూడి యుత్సాహంబున సమరంబు సేయుము. ఇఁక నీ నవ దివసంబున రాజ్యలక్ష్మినిఁ బొందుదువు. అనుమానంబేమియు లే"దని దీవించి, యమ్మునీంద్రుఁ డంతర్హితుండయ్యె.

పదంపడి ధర్మజుండు ధృష్టద్యుమ్నుం జూచి "గురుని పురోభాగంబున వృకోదరుండు గౌరవసేనం దాఁకి తెరల్చుచున్నవాఁడు. తద్వినాశంబాచరించుటకై యనలంబున జనియించిన వాఁడ"వని యాతనిఁ బురిఁగొల్పె. మఱియు శిఖండి ప్రముఖ పాంచాలకుమారులను, కెలంకులనున్న కవలను, విరాట ద్రుపద ద్రౌపదేయ శైనేయ కేకయుల, నాలోకించి, "మీరును ద్రోణువధంబునకుఁ గడఁగుఁ"డని క్రోధంబునఁ బలికె. వారునుఁ దమ తమ బలంబుతో ద్రోణుపైఁ గది

సిరి. గురుండు సత్యవ్రతుండై యవ్వీరుల మార్కొని కౌరవ సైనికుల నాజికిం బురికొల్పె. ఎల్లవారికి నా రాత్రియామ సహస్రయామమైతోఁచె. అట్లయినను నిజధర్మంబు విడువక పోరుచుండిరి. నిద్రాభరంబున దివ్వెలవారు విగతప్రయత్నులైనఁ దమంబు గవియం దొడఁగె. అట్టియెడ నిద్రాభరంబున నాయుధంబులు విడుచువారును, వాహనంబులు వోయినచ్చు పోయి దెరలు వారును, జొక్కువం దమవారిం దాము పొడుచువారును మఱియు ననేక ప్రకారంబులగు వికలసంచారంబుల గాసియగువారును నగుటంగని గాండీవి యుభయసైనికులును విన నెలుఁగెత్తి "నిద్రాభరంబున నెల్లఱును దస్సియుంటిరి. కావునఁ గొంతతడవు సుఖసుప్తిఁజెంది, చంద్రోదయానంతరంబునం బోరుటలెస్స" యనినఁ గౌరవులును బాండవులును సంతసించి సమరంబుసాలించిరి. అర్జును ధర్మజ్ఞత్వంబు మెచ్చకలగ్గించిరి. అరాతులును దమకు సుఖనిద్ర నొసంగిన యా వాసవసుతునకు జయంబు గలుగునటుల దీవించి, గాఢనిద్రం బొందిరి. అశ్వంబులపై నాశ్వికులును, నరదంబులపై రధికులును, నిలాతలంబుపై కాల్బలంబును నొడళ్ళుమఱచి శయనించియుండిరి. అంత,

నలువ చెంద్రికాశేకుల నమృతంపుఁ బెట్టఁగోరి కావించిన గుళికయనఁగ
నఖిల ద్విజశ్రేష్ఠమగు చకోరచయంబు తపము సమాల్లసత్ఫలమనంగఁ
జిగురుజొంపములను జగిరొమ్మ ప్రాగుదయాద్రిఁ బొలుపారు నవకల్పభూజమనఁగ
బూర్వపయోరాశి, దొంతిఁ గొంజాయ దెస్పదలిన పవడంపుఁ బొదయనంగ

తళుకారుచుఁ దనయుఁడేల తళికయుల్ల
బొడిచి దివ్యాస్త్రాళి ధీయుతు ఁదరఁజేసి
యంతకంతకు పెక్కుచు, సంతసంబు
గాంచెఁ జేపట్టె చంద్రుండొ గ్రాలె...

* ద్రోణుని పంచమదివస యుద్ధక్రమము *

అట్టియెడఁ గౌరవపాండవులు మేలుకొని సంగరంబున కుపక్రమింప దుర్యోధనుండు గురునికడకుంజని యాతని శౌర్యంబు నగ్గించి "మహాత్మా! నీకు సరిగాని వారి పాండవులఁ బెద్దసేసి శిష్యత్వంబు పాటించి, పోటునకుఁ జొరక యుపేక్షించుట నాయభాగ్యంబుగావున నిన్నేమనఁగలవాఁడ?" అనవుడు నయ్యాచార్యుండు గనలి "నరుండు శిష్యుండని మన్నించి యగాదె ఖాండవం బాఖండలుండు గెలుపోమె? ఘోషయాత్రఁ జిత్రసేనుండు నిన్ను విడిపించిపుచ్చె? నివాత కవచ కాలకేయాదు లంతంబునొందిరి. వలవని దురుక్తులేల యాడెదవు?" అనినఁ గురురాజు కోపించి సంరంభమ్మున నక్కుంభసంభవుంజూచి "నీవు సవ్యసాచికిఁ జాలవేని నిలువుము. కొంతసైన్యంబుంగొని నీయోపినట్లు సంగ్రామంబు సేయుము. నేను దుశ్శాసనాదులతోడంగూడి పాండవేయుల నుక్కడంచెద." అనిపల్కిన నాచార్యుండును నగుమొగంబున "వల్లె చేయుటకర్జం" బని పలికి పెండియు సుయోధనుఁ గనుంగొని "అఖండ భూమండలమ్మునేలుచు, దానధర్మంబుల నొనర్చి అఖిల భోగంబు లనుభవించి, తనివినొంది యున్నవాఁడవు కావున విగతభయుండవై పార్థుతోడఁ గయ్యంబుసేయుము" అనిచెప్పి

యాతండు పాంచాలబలంబు మూర్కొనియె. పాండవబలంబు శార్దూలంబుఁగనిన హారిణంబుల చందంబునఁ గంపంబు నొందుచుండె.

విరాటద్రుపదులును, ద్రుపదుతనూజులు మువ్వురును, కేకయపతులును, కుంభసంభవుఁ జుట్టుముట్టిన నవ్విగండు సైన్యంబు నెల్లం దునుమాడి, పాంచాలపుత్త్రత్రయంబుఁ బరిమార్చి సరోవరంబున నీరజంబులఁ గోయునట్లు, కేకయుల శిరంబులు ద్రుంచివైచె. మఱియు నాతండు యుగాంత కుపితాంతకాకారుండగుచు పాంచాలసైన్యంబుల నుఱుమాడుచుండ, వారును వెనుదీయక ప్రాణంబులపై నాశమాని యుగ్రంబుగఁ గయ్యంబు సేయుచుండిరి. భారద్వాజుండును మొక్కవోని విక్రమంబున మెఱయుచు, విరాటద్రుపదుల ననాయాసంబుగ నంతంబునొందించె. ఇట్లు మత్స్యభూవల్లభుండును, పాంచాలాధిపతియుఁ బడుటకనుంగొని ద్రోణతనూజుండగు ధృష్టద్యుమ్నుండు శోకావేశపరవశుండగుచు నాగ్రహంబున "ఏనుద్రోణుఁ బరిమార్పనేనిఁ గులాచార ధర్మంబులకుఁ దప్పినవాఁడనగుదు" ననిపలువురు వినబాసచేసి, హతశేషులగు పాంచాలురఁగలసి గురుపైఁగవిసె. అత్తఱి సంకుల సమరంబయ్యె, అంత దిననాథుండుదయశిఖరింబువట్టె. ఉభయబలంబులు నహర్ముఖోచిత కృత్యంబులందీర్చి క్రమ్మర నాజి సేయఁగడంగిరి. ప్రొద్దెక్కిన నెండ తాఁకుచు, రేయింటి యలజడియు నప్పటియాకలియు నొడళ్లడిల్లపడఁజేసి మొగంబులు వెడంగువఱిపినను, జాలివోని పౌరుషంబుల నుభయ

సైనికులును బరస్పర జయకాంక్షులై యనిసేయుచుండిరి. అట్టియెడ గురుండును, పార్థుండును వివిధబాణాసారంబుల నంబరంబు గప్పుచు, నాహవరంగంబున నతితీవ్రంబుగఁ దలపడిరి. గురుండేయుశరంబుల నరుండు నడుమనే ద్రుంచుచుండె. నరుండేయు విశిఖంబుల గురుండును ఖండించుచుండె. ఉభయ సైనికులును, వారిసంగ్రామంబున కద్భుత మందుచుండిరి. ద్రోణుండైంద్రాస్త్రం బాదిగాగల దివ్యాస్త్రంబుల సవ్యసాచి నేయ నాతండు నాదివ్యాస్త్రంబునే ప్రయోగించి, యాతని యస్త్రంబుల విఫలంబుసేయుచుండె. ఇట్లు శస్త్రబల బాహుబలంబులఁ దుల్యంబుగాఁబోరు నగ్గురుశిష్యుల నవలోకించి, సురగరుడోరగ విద్యాధరాదులు తమలో నిట్లని వితర్కింపఁ దొడఁగిరి. "వినోదార్థంబుగ శంకరుండు నీరూపద్వయంబున సమరంబు సేయుచుండె. కాదేని యిట్లొరు లుగ్రంబుగ బోరుట నెందైనం గాంచితిమే ?" అనుసమయంబున ద్రోణుండు బ్రహ్మాస్త్రంబు నియతసంధానుండై యర్జునుపైఁ బ్రయోగించినఁ, గులపర్వతంబులతో ధరణివణంకె. చతుస్సముద్రంబులు గలంగె, దిశ లరుణంబులయ్యె. సురనికాయంబును సైన్యద్వంద్వంబును సంక్షోభంబునొందె వాసవియు మనంబున నావంతయు భయంబునొందక బ్రహ్మాస్త్రంబుననె గురుని బ్రహ్మాస్త్రంబు శాంతినొందించె.

ఇత్తెఱంగున జయాపజయంబులు లేక పోరిపోరి, యగ్గురుపార్థులు పాంచాల కౌరవ బలంబులఁ దరుముచుండిరి. ధర్మతనయుండు మాత్స్యబలంబుల బురికొల్పికొని కలశసం

ళవు డెనకేగుచుండె. అంత మధ్యాహ్నంబగుడు సమీరనం
దన మాద్రీతనయు లయ్యాచార్యుపైఁ గవిసిరి. ఇట్లనేక బలం
బులు దన్నుఁగ్రమ్మినఁ బటుసాయకంబులు వఱపి, పోడిమియు
నమ్మహావీరు నాలోకించి, ధర్మజభీమ మాద్రీతనయు లొక్క-
చోఁ గూడికొని తమలో నిట్లుదలంచిరి. "ఈయాచార్యుఁ
డుగ్రుఁడై గజంబులఁ గూల్చుచు, వాహనంబుల రక్తంబునఁ
దేల్చుచుఁ, దేరులనఱుచు దొరలరూపుమాపుచుఁ, దుదకు
మనలను సహితము భంగపఱచుట సిద్ధంబని దోఁచుచున్నది.
ఈతనిజయింప నెవ్వరికి నలవికాదు, నరుండును ధర్మపరుఁడై
యుపేక్షాపరుఁడై యున్నవాఁ"డని యనుకొనుచుండ, వారి
చందంబుఁ గని పుండరీకాక్షుండు దమయరదంబు వారల
కడకుం గొనిపోయి కిరీటింగాంచి "ఇంద్రనందనా! యిమ్మ
హాత్ము నాజి జయించుట సురాసురలకశక్యంబు. నేనొక్క-
యుపాయంబు సెప్పెద నాకర్ణింపుఁడు. ఈతని పుత్రుం
డశ్వత్థామహతుండయ్యెనని యాతండు విన్న నాయుధంబులు
వదలి చేష్టలుడిగి యుండును. అప్పుడాతని సుకరంబుగఁ
బరిమార్పవచ్చును. కావున నశ్వత్థామ హతుఁడయ్యెనని
యొక్కరుండతనికిఁ జెప్పుట కర్జంబనిన వదివిని యందఱు
నిదియె లెస్సయనిరి.

అర్జునుఁడును దానికొడంబడక యుండె. అధర్మంబగు
నీకార్యంబునకుఁ బాండవాగ్రజుండు విషాదంబున వివర్ణవద
నుండయి విచారించుచుండె. అంతకుమున్న భీమసేనుచే నశ్వ
త్థామ నామక మాతంగంబు గూలుటచే, భీముండగ్గురుకడకేఁగి

యశ్వత్థామ హతుండయ్యె నని పలికె. ద్రోణుండును జిత్తం బుజల్లని చెదర బెదటియుఁ దనసూను నస్త్రవిద్యాదిగుణం బుల గణుతించి యప్పలుకులు పెడచెవులం బెట్టి ధృష్టద్యు మ్నుఁడైఁగవిసి పెల్లేసి, యతనికడ్డపడిన పాంచాలవరుల నెఱువది వేవుర కృతాంతనివాసంబున కతిథులఁగావించి, మాత్స్యబలం బున కుఱికి, యేనూరురథంబులఁ, బదివేలమాతంగంబుల నన్నిటితురంగంబులఁ బొరిగొని తన యేపుసూపుచుండె. ఆ సమయంబున వశిష్ఠ, విశ్వామిత్ర. జమదగ్ని, భరద్వాజ, గౌతమ, కశ్యపాత్రి ప్రభృతి మునిప్రకరం బాతనిపాలి కేతెంచి "భారద్వాజా! నీవు భూసురుండవు, వేదవేదాంగ విదుఁడవు, నీకిట్లుసంగ్రామంబు సేయ ధర్మంబగునే? ఇంతకు మున్ను జేసిన జేసితివిగాని, కాలంబు పూర్ణంబయ్యె కావున నింకనుడుగుట మేలు. మావచనంబుల నాదరించి, యాయుధం బులఁ బెట్టి శాంతిఁ బొందు"మని చెప్పి యంతర్హితులైరి. అవ్వి ప్రవరుండును వారలపలుకులూహించి, భీమసేనువాక్యంబులు దలంచి, యగ్రభాగంబున నున్న ధృష్టద్యుమ్నుం గనుంగొని, వికలచిత్తుండగుచు. నిజపుత్త్రుండు చచ్చుట యజాతశత్రువల ననున్నరూపుఁ దెలియువాఁడై, యతని నావిధంబడిగె. అయ్యవ సరంబున వాసుదేవుండు యుధిష్ఠిరుంగాంచి "ధర్మనందనా! ఈదినంబున ద్రోణుండు సంగరంబు సేసిన, మనయోధులం నొక్కండును బ్రతుకుట దుర్లభంబు. మమ్మాతనికొప్పింప కుము. ప్రాణరక్షణ సమయంబున నసత్యదోషంబు పాతకంబు గానేరదు;

ప్రాణహానిఁ దప్పించుచోఁ బరిణయంబు
నందు గురుజనకార్యార్థమయ్యు శంక
మానధనముతోడి సంభాషణమున సర్వ
ధనము చెడిపోవు నెడ బొంకఁజను నృపాల!

కావున నశ్వత్థాము నచ్చెనని గురునితోఁ జెప్పుము" అని యిట్లు కృష్ణుండు సెప్పిన వృకోదరుండును నగ్రజుంజూచి "ఏనప్పుడు దామోదరుండు సెప్ప నయ్యాచార్యు వధియించు నుపాయంబువిని, యదియె మనంబుననుండ, మాళవేంద్రుఁడగు నింద్రవర్మవారణంబశ్వత్థామ యనునది నాచేఁజచ్చిన నదినెపంబుగ గురున కశ్వత్థామహతుండయ్యె"నని చెప్పితి. చెప్పిన నొక్కింతతడ వూహించి యమ్మాటదెననాచార్యుండ నాదరణాంబు సేసె. నీకు విజయంబుగోరి హితంబుపదేశించు గోవిందు వాక్యం బుల్లంఘింపక నీవు నట్లు చెప్పుము. నీవచనం బతండు విశ్వసించును. తత్కారణంబున నతఁడు గయ్యంబు సేయఁ జేయాడకచెడు"ననియొత్తిచెప్పె. వాసుదేవ భీమసేను లివ్విధంబునఁ జెప్పుటయు, విధియు నట్లుండుటయు నాతఁడిక్కార్యంబునకు సమ్మతించె. అసత్యంబుదోషంబని యెఱింగియు నాజి జయంబు గోననెంచి, యుధిష్ఠిరుండు శంకింపక యగ్గురుతోడ "నశ్వత్థామ హతుఁడయ్యె" నని విస్పష్టంబుగ వక్కాణించి వెంటనే యాతండు వినకుండఁ గుంజరమనియె.

అప్పుడాచార్యుండు తాను పాండవేయులకు ద్రోహుండనని యెంచి మునులవాక్యంబులు దలంచి, "ఇదియు ధర్మం" బని, దనమరణంబుకై యగ్నికుండంబున జన్మించిన,

ధృష్టద్యుమ్నునిఁ జూచుచు, రణసంరంభంబు చాలించి, చేష్టలుడిగి సంక్షిప్తాంగుండై యుండెను.

పదియవ ప్రకరణము

* ధృష్టద్యుమ్నుని జననము *

తొల్లి ద్రోణుచే నట్లువిడువఁబడి ద్రుపదుండు తదవమానతప్తుండై, క్రోధాతిశయంబున "రణరంగంబున ద్రోణు వధించునట్టి సుతుని నర్జునునకు భార్యయగునట్టి కూఁతుని బడయుదు"నని బ్రహ్మవిదులైన భూసురులయావాసంబుల కేఁగి, నిచ్చలుఁ వారల సేవించుచుండెను. ఇట్లుండి యొక్కనాఁడు భాగీరథీతీరంబున వానప్రస్థవృత్తినున్న యాజోపయాజులను వారి నిద్దఱ ననవరతవ్రతాసక్తులఁ గాశ్యపగోత్రులం గని వారికి నమస్కరించి, యందు గొండికయయ్యును దపోమహిమచే నందఱికంటెఁ బెద్దయైనవాని నుపయాజు నుపాసించి "మునీంద్రా! సుపుత్త్రజననంబగునట్టి జన్నంబు నాచే సద్విధిం గావించిన నేఁ గృతార్థుండనై లక్షగోవుల నీకు దక్షిణగా నొసంగెదను" అనిన నుపయాజుం "డేనిట్టిఫలంబు నపేక్షింప నెవ్వరేని ఫలార్థులగుదు రందుల కేగు"మనిన ద్రుపదుండు విసువక వెండియు వానినొక్కవత్సరంబారాధించె. అంతనమ్ముని వానిం గరుణించి "అధిపా! అనవద్యచరితుండగు మాయన్న యొక్కదినంబున, నశుచిప్రదేశంబని, శుచిప్రదేశంబని యరయక యొక భూతల పతితంబగు ఫలంబు ననుభవించె. ఫలార్థి యగువాఁడు తత్ఫలానుబంధంబులైన దోషంబుల విచారింపఁడు. కావున నమ్ముని నీయభి

మతంబు నెరవేర్పుఁబో" మ్మనిన ద్రుపదుండు నాతనియొద్ద కుం జనియె. అట్లు జని పంచమహాయజ్ఞంబుల నొనరించుచు, శిలోంఛవృత్తివెట్టి సంధారిత కుటుంబ భారుండై ఘోరతపంబు గావించుచున్న యాజుం గని, సాష్టాంగ దండప్రణామం బాచరించి "మహాత్మా!

భారతవంశాచార్యుఁడు, భారద్వాజుండు నాకపాయము సేసెన్
ఘోరాజి నతని నోర్వ, నపారపరాక్రమునిఁ బుత్త్రుఁబడయఁగవలతున్.

కావున సత్పుత్రజననంబగు క్రతువు సద్విధి నాచేఁ జేయించితివేని నీకు నొకలక్ష ధేనువుల సదక్షిణంబుగ నొసంగెద" నని వినయావనతుండగుచు వేఁడుకొనియె.

అట్లు వేఁడుకొనిన యాజుండును యాజకత్వంబునకొడఁబడి "నీకోర్కికిం దగిన పుత్త్రుండును, పుత్త్రికయును జనియించెద రోడకుండుము." అని పలికిన ద్రుపదుండు యజ్ఞోపకరణద్రవ్యంబుల సమకూర్చుకొని, యథావిధి నుపయాజుండు సహాయుఁడుగా కోకిలా దేవిపత్నిగాఁ బుత్రకామేష్టి సేసె. అందు మంత్రాహుతులఁ దృప్తుఁడైన యగ్నిదేవువలన జ్వాలాభీలాంగుఁడును, ధనుర్ధరుఁడును, కిరీట కవచాలంకృతుండును నగు నొక్కపుత్త్రుండు రథారూఢుండై జనియించె. మఱియు నాతండుఁ బ్రార్థింప నర్జునునకు భార్యగాఁదగిన కులపవిత్ర యగు నొక్కపుత్త్రికారత్నంబును నుద్భవించె; వారల కశరీరవాణి, ధృష్టద్యుమ్న కృష్ణయను నామంబు లిడియె.

అక్కారణంబున ధృష్టద్యుమ్నుండు దత్సమయజనితోత్సాహరోమవిశేషాయత్తచిత్తుండగుచు, నమ్మహీసురవరుపైఁ

గవిసిన, నవికి నొల్లనియుల్లంబునఁ బరుని యుల్లానంబు సహింపక దేజంబున నుత్సహించి పోరందొడంగిన నగ్గురునకు దివ్యాస్త్రంబులు ప్రతిభాషింపవయ్యె. అట్లయినను మనసు బలిమికలిమిని బ్రకృతిబాణంబుల, నాతని బాణబాణాసన రథరథ్య సూతకేతనంబులఁ బొడిసేసె. ధృష్టద్యుమ్నుండును గదగొనిన నదియు దునియలుగావించె. పలకయు వాలును గొనివచ్చి, యవ్వీరుండు సూతాశ్వంబుల యంగంబులు వ్రయ్యచేయఁ దత్కరవాల ఖేటపాటనంబు సేసి తనువు తీక్ష్ణశరంబులనొంచె. అట్లు నొంచినం గనుంగొని కృష్ణానుజుండు కృప కర్ణకృతవర్మలతోడం బెనంగుచుండియుఁ గ్రూరనారాచ దశకం బయ్యాచార్యు మేననాఁటె. అంత నత్యంతరయంబున ననిలనందనుండు జనుదెంచి, ద్రుపద నందనుఁ గుంభసంభవుం బారికిదప్పించుకొని పోయినఁ బోపొమ్మని పలికి, డెందం బెప్పటిచందం బగుటయు గురుండు నిశ్చలభావంబున నుండె.

ద్రోణుని మరణము

ఇట్లు నాలుగుదినంబులును, నొక్కరాత్రియు నేనవదినంబున నిరువది గడియలును, నిరువదియొక్క వేయట్లలాడ మహాసంగరంబొనరించి, పాండవబలంబులనురుమాడి పేరడవిని గొని కాలిపోనుంగువడిన కార్చిచ్చుకై వడిం గుదిసి యమ్మహాత్ముండు సంగ్రామ సంతృప్త హృదయుండై నిజసైన్యంబుం జూచి, "దుర్యోకర్ణా! కృపా! సుయోధనా! నాశక్తికొలఁది సమ

రంబుగావించి, యిఁక సుగతిఁ బడయఁ గోరినవాఁడనై బాణబాణాసనంబుల నుజ్జగించెద. తెలివిగలిగి మనుఁడు" అని పలికి యస్త్రసన్న్యాసంబొనరించి, యమ్మహాత్ముండు రథంబుపైఁ బద్ధాసనాసీనుండై యోగనిష్ఠం జేసి, తేజోమయాత్ముఁడై యుండెను. అట్టియెడ ద్రుపదనందనుండు కృపాణపాణియుఁ బాదచారియునై, భారద్వాజుదెసకుం గదిసిన, నుభయసైన్యంబుల హాహాకారంబులెసంగె. అంత నప్పుణ్యపురుషుండు తనువు త్యజించి, తేజోరూపంబున నెగసి, పరమస్థానంబునకుం జనియె.

ఆతని తేజోమయాకారంబును, కృష్ణార్జునధర్మనందన కృపాచార్యులుగనిరి. తక్కటిమానవులు గానరైరి. సురలును నయ్యాచార్యునాత్మంజూచి సంతసించిరి. ధృష్టద్యుమ్నుండట్లడరి ద్రోణుశిరంబుపైఁబడి కేశంబులు గరంబున నమర్చికొని, ధర్మజవాసవాత్మజులు దగదు తగదనుచుఁ దనవైపునకేతెంచుచుండ, వారివచనంబులఁ గైకొనక, ఖడ్గంబున శిరంబు ద్రుంచి, వైచె. ఇత్తెఱంగునఁ దునిమి, యతండయ్యట్టియుం దలయును ధరణీతలగతంబు సేసె శతవృద్ధుండగు నయ్యస్త్రగురుండిట్లు సుయోధను లోభంబుచే శరీరంబు విడిచినఁ గౌరవ సైనికులు గరితురగంబుల ముందిడుకొని, కట, కటా! యింత పుట్టునే యనుచు, నింక నేమిసేయఁగలవారమనుచు, నేది తుది యనుచు, మరలి మరలి చూచుచు భయంబునఁ జనుచుండిరి.

అయ్యెడ నశ్వత్థామ మున్నొక్కకెలనఁ గయ్యంబు సేయుచుండి, కౌరవసేన కలంగుట కనుంగొని, సుయోధను

నొద్దకుం జని "కురురాజా! ఏల యిట్లు బలంబులు నలుదెసలకుఁ బాఱం జొచ్చె? కర్ణాదులేల యిట్లతిదీనులై యున్నవారు? నీవును నుత్సాహరహితుండవై యేల యిట్లు వివర్ణవదనంబున నున్నాఁడవు?" అని యడిగిన, నాసుయోధనుం డాతని మొగంబు సూచి, యాచార్యమరణంబు సెప్పం బోయి డగ్గుత్తికపడి యూరకుండె. కృపుం డట్టకేలకు నెలుంగు దెచ్చుకొని, వెలవెలంబాఱు నాననంబున నాతని గాంచి, "కుమార! నీజనకుండు పాంచాలపాండవప్రముఖబలంబుల నధికంబుగఁ బరిమార్చుచుండఁ, బాండవులొక్కచో గూడియు, నాతని నిలువరింపఁ జాలక, భీతిఁజెందియుండఁ గృష్ణునుపదేశంబున పవమాననందనుం డశ్వత్థామ చచ్చె"నని ద్రోణుతోఁ బలికె. అమ్మాట పాటింపక యాచార్యుం డవ్వార్త ధర్మజు నడుగ, భీముచే నశ్వత్థామనామకగజంబు మున్ను చచ్చుట కతంబున నక్కుంతేయాగ్రజుండది నెపంబువెట్టి, వృకోదరుండు సెప్పినట్లె చెప్పెను. ఆకారణంబున నీజనకుండాయుధంబుల విడిచి, యమల యోగనిష్ఠనుండ ధృష్టద్యుమ్నుండరదంబుపై కుఱికి, యాతని శిరోజంబుల నాకర్షించి ధర్మజవాసవనందనులు వారించిన నుడుగక, ఖడ్గంబునఁ గంఠంబు దునిమె. యుష్మజ్జనకుండట్లు పడిన, సైన్యంబిట్లు కలంగె. మేమును నిరుత్సాహులమై యిట్లుంటిమి. ఏనుంగు నెపంబుగా నట్టిమాటపుట్టుట కృష్ణకృతంబైన కపటోపాయంబుగా నోపు"నని యెంతయు నేర్పడం బలికె.

రఘురామసదృశుండును, బాహుఘనుండును, దివ్యాస్త్రవిదుండును, నగు నశ్వత్థామ ధృష్టద్యుమ్నుమరణంబునకై జని

యించిన వాఁడగుటచే, తనజనకుని మరణంబు మామవలననేని యరుణంబులగు నయనంబుల నశ్రుధారలు వెలువడుచుండఁ, పాణితలంబున నొత్తుకొనుచుఁ గౌరవపతిం జూచి, "సుయోధనా! లోకంబున నెందఱు రణంబులఁ బ్రాణంబులర్పించియుండిరి? లోకసంభావితుండగు నస్మజ్జనకు శిరంబుఁబట్టి, యొక్కఁడిట్లు సేయుట విధిబలంబని యెంచెద. మదీయ దివ్యాస్త్రబాహుబలంబులస్మజ్జనకునకు నిష్ప్రయోజనంబులయ్యె. గురుండిట్లగుటకుఁ గారణంబు యమతనూజుండుగదా? ఇంక వృథాలాపంబులఁ బ్రయోజనంబులేదని యెంచి, యేనొక్క ప్రతినఁ బూనినవాఁడ. ఆత్మప్రశంస యనుచితంబయ్యును, దండ్రిపరిభవంబునం దాపంబధికంబగుడు నిట్లుపలుకవలసె. నేఁడు నారాయణుండును, పాండవేయులును, నస్మదీయ దివ్యశరపీడితులై పంచత్వంబునొందఁ జతురంగబలంబులు గ్రుంగ, నిర్జరగణంబులడ్డంబుసొచ్చినను రణరంగంబున విజృంభించెద. ఎట్లనిన, మాతండ్రి నారాయణు నారాధించి, యొక్క దివ్యాస్త్రంబు వడసి, యది నాకొసంగె. అద్దివ్యసాధనంబు వధ్యు లవధ్యులను విభాగంబు లేక శత్రునాశనంబు సేయును. కావునఁ దత్ప్రయోగంబున జయంబు సేకొనియెదఁ జూడుము." అనిన నమ్మహీపాలుండును, దదనుజులును, సేనాధిపులును, దమతమ శంఖంబులు పూరించి, మహానాదంబులు సేసి, మరలిరి. భేరీమృదంగాది తూర్యధ్వానంబులు మిన్నుముట్టె, తురంగరథనేమిగజపదఘట్టనంబుల, నిలగ్రక్కదలె. అత్తఱిఁ గాంతేయాగ్రజుండు వాసవిం జూచి "ఇక్కోలాహలంబునకుఁ

గారణంబే"మనియడుగ నాతనికతం డిట్లనియె. తనజనకు నన్యా
యంబుగఁ జంపుటకై తలపెట్టెనని విని, యవక్రవిక్రముం
డగు ద్రోణసుతుండు సేయు సంరంభంబు గానోపు.

అగ్రజా నీవు శిష్యుండవనియు, ధర్మాధర్మవిదుండ
వనియు, సత్యవ్రతుండవనియు, మహోదరంబున నిన్నడుగ,
నీవును ధర్మహానికోర్చి, యనృతంబాడ, గురుండు నిజతనయు
మరణంబు నిశ్చయించె రాజ్యంబునకై యిట్లు సేయుట, యప
యశంబునకుఁ గారణంబయ్యె. అదియునుంగాక యే దూరం
బుననుండి "వలవదుడుగు" మని వారించినను, నావచనం
బులంగైకొనక, యాగ్రహంబున ద్రుపదాత్మజుండు విగత
జీవుండైయున్న గురుని కంఠం బన్యాయంబుగ ఖండించె.
తద్దైన్యంబు తత్తనూభవుండు సైరించునా? నీకును నీవారి
కిని మనపై నేతెంచు గురుపుత్త్రు వారింప నశక్యంబు. ఇత్తఱి
ద్రుపదాత్మజుం డెట్లయ్యెడునో చూడుము. స్వయంకృతాప
రాధం బెవ్వారికి నవశ్యభోక్తవ్యంబుగదా."

అని సంక్రందననందనుండు వలుక, కోపంబున భీము
సేనుఁడాతనిజూచి "అర్జునా! క్షత్త్రియధర్మంబుఁబూని కయ్యం
బున కేతెంచి యిట్లడవులనుండు తాపసులచందంబునఁ బలుకం
దగునే? నాఁడుసభలోఁ బాంచాలికొనర్చిన పాటులఁదలఁచు
కొన్న నిట్టికార్యంబుల మనమెన్నియొనరించినను గల్మషంబుఁ
బొందనేర"దని తలంపుము. "కురువీరుల నేనెఱుంగుదు.
నన్నును గురువీరులెఱుంగుదురు; కావున మదీయగదాప్రహార

ణంబులవారిఁబోలిక యేన నంతంబు నొందించెద"నని మహా రోషంబునఁ బలికె నాసమయంబున ధృష్టద్యుమ్నుండు సవ్య సాచిం జూచి "వాసవనందనా! భారద్వాజుండు దివ్యాస్త్రం బులం బఱపి బలహీనులననేకుల నిర్దయుండై వధించె. అక్కార ణంబున నతండు ధర్మాత్ముం డెట్లగును?

"అదియునుంగాక యాతనివధంబునకై జన్మించిన యేను నాతని నెట్లు జంపకుండుదును? విచారింపక నన్ను వ్యర్థంబుగ నిందించుట నీకు పాడియగునా? నీపితృసఖుండగు భగదత్తుని, పితామహుండును, వృద్ధుఁడునగు శాంతనవుని, నీవు వధించుట పుణ్యమెట్లయ్యె? ప్రతివీరుఁడగు నాచార్యు నేజంపుట పాప మెట్లయ్యె? శిష్యవంచకుఁడై గురుండు దా మరణంబునొందె. కావున శంకింపక సంగరంబొనర్చి, పగతుర జయింపుము" అనుచు సవ్యసాచి రూక్షేక్షణుండై యాతని నుపలక్షించి, బాష్పజలంబులఁ దుడిచికొనుచు నిట్టూర్పు నిగిడించుచుండె. అంత కృష్ణానుజుండు ధృష్టద్యుమ్నుం జూచి "గురుద్రోహీ! ఇప్పాపకార్యంబునకు నీశిరంబు భిన్నంబుగాకుండుటయు జిహ్వాదునియకుండుటయుఁ గడుఁజిత్రంబు. నీవాడినమాటలకు నీరాజు నెదుటనుండుటం బట్టి బ్రతికితివి. ఇంక నీవిట్టిమాట లాడిన నవమానంబు సిద్ధంబని నమ్ముము. నీయగ్రజుండగు శిఖండియు నీవును జన్మించి, పాంచాలకులంబుకీర్తికిం బుణ్య లోకంబునకుం బాపితి"రనియె. అంతధృష్టద్యుమ్నుండు నవ్వు చు నతని నవలోకించి 'వివేకవిహీనా! అన్యశరకృత్తహస్తుఁ డగు భూరిశ్రవుని నీవు వధించుట వీరవ్యవహారంబగునా? నీచ

రిత్రంబారయక, యేల నన్నిట్లు నిందించెదవు? ఇట్టిమాటలిఁక యాడిన శిరంబు ఖండింతు. వృథావచనంబులఁగట్టిపెట్టి, సమరంబునకుఁ బోవుదము రమ్ము." అని సక్రోధంబునఁ బలికె. శినివరుండును రోషారుణితలోచనుండై కోదండంబు రథంబున నిడి గదపుచ్చుకొని మాటల నలిగెద వేని, వ్రేటుననె శిక్షించెద నంచు ధరణికి లంఘించి ద్రుపదాత్మజుపైఁ గవిసినఁ, గృష్ణ యుధిష్ఠిరు లయ్యిరువుర నతిప్రయత్నంబున వారించిరి.

ఇట్లు ద్రుపదసూనుండు భారద్వాజుకంఠంబు ద్రుంచుటకందఱు నసూయాగ్రస్తులై, యాతని ననేకవిధంబుల నిందించిరి, గాని సర్వజ్ఞుండగు నారాయణుండాతని యాక్షేపింపఁడయ్యె. ఇందుల కొక కారణంబుగలదు. అట్లు పాండవాగ్రజుండశ్వత్థామ మరణంబు నొందెనని యనృతంబాడ, యాతని వాక్యంబు వేదవాక్యంబని నమ్మి, యాచార్యుండు "నాపుత్రుండు మృతుండైన స్వర్గలోకంబున నుండవలెఁ గదా?" యని దలంచి, ప్రాయోపవేశంబున దేహంబు విడిచి పరలోకంబున కేగి విచారింప, నీపుత్రుండు భూలోకంబుననే సంగ్రామంబు సేయుచున్నవాఁడని యచ్చటి ద్వారపాలకులు నుడివిరఁట. అంత నాతం డుగ్రుఁడై తన దేహంబుఁ జొచ్చి యుందఱ భస్మంబుచేయ నేతెంచినఁ దనశరీరంబు ధృష్టద్యుమ్నుచే విదళితమస్తకంబై యుండఁ జేయునది లేక స్వర్గంబున కేఁగె. అక్కారణంబున నాతండాచార్య కంఠంబు ఖండించుట పాండవులకు శుభదాయకంబె యయ్యె.

* అశ్వత్థామనారాయణాస్త్రంబు ప్రయోగించుట *

అంతఁ బితృమరణజనితక్రోధావేశవివశుండై గురునందనుండు "అనృతంబుబలికి బ్రతుకఁ దలచిన పాండవులిప్పుడెట్లయ్యెదరో చూడు" మని సుయోధనుతోడఁ బలుకుచు, నియతుండయి నారాయణాస్త్రింబుఁ బ్రయోగించె. అదియు భీకరాకారంబయి భల్లనారాచక్షురప్రముఖంబులగు ననేకాయుధంబులం బుట్టించుచు నెక్కడఁజూచిన దానయై మహానలజ్వాలలనడరించుచు పాండవసైనికుల నెదుర్కొనియె. అప్పుడెల్లవారువిన మాధవుండు బెద్దయెలుంగున "సైనికులారా! మీరెల్లరును వాహనంబులుడిగ్గి యాయుధంబులు విడిచి, నిలువుఁడు. ధరణీగతులగు నిరాయుధుల నిమ్మహాస్త్రింబేమియుఁ జేయనేరదు. ఇదియె దీనికిఁ బ్రతివిధానంబుగ దీనినొసంగిన మహానుభావుండు విధియించె" ననిన సకలజనంబులు నమ్మాటకియ్యకొని యట్లుగావించిన నాయస్త్రింబు శాంతంబునొందె. గురుపుత్త్రుండు తండ్రిమరణంబునకై యిటులొనరించిన ప్రయత్నంబు నహితము కృష్ణుచే నిట్లు విఫలంబు గావింపఁబడియె. కావున నోపాఠకమహాశయులారా! మన కథానాయకుండగు ద్రోణుండును, నాతనిపుత్త్రుండగు నశ్వత్థామయు నజేయులయినను, దుష్టుండగు సుయోధను పక్షంబుననున్న కారణంబున పాండవులఁ జయింపలేకైరి. అదియునుంగాక యెచ్చట ధర్మ

ముందునో యచ్చటనె యోగీశ్వరుండగు కృష్ణుఁడుండుననియు, ఆతండుండుచోటనె జయంబు సిద్ధించుననియు గ్రహించి మన యాచార్యుని యద్భుతపరాక్రమాది గుణంబుల నగ్గింతురుగాక.

శ్లో॥ యత్రయోగీశ్వరః కృష్ణో । యత్రపార్థోధనుర్ధరః
తత్రశ్రీర్విజయోభూతి । ర్ధ్రువానీతి మతిర్మమ॥

శ్రీ కృష్ణార్పణమస్తు

ఓమ్ తత్సత్

పండితాభిప్రాయములు

బ్రహ్మశ్రీ చావలి శ్రీరామశాస్త్రిలుగారికి. నమస్కార పూర్వకముగా వ్రాయు పుస్తకాభిప్రాయము.

అయ్యా, మీరు వచనరూపముగా వ్రాసిన ద్రోణచరిత్రమును ముద్రణమునకు మున్నె, చాలవఱకుఁ జూచియుంటిని. ఈపుస్తకము, చక్కని సమాసములతో, సరసమైన పదములతో, మహానుభావుఁడగు ద్రోణాచార్యుని స్వభావసిద్ధశక్తిసామర్థ్యాదులను విరివిగాఁ దెలియఁజేయుచు, శ్రవణమనోహరమైయున్నది. హైస్కూలుక్లాసులలో, అప్రధానపఠనీయ గ్రంథముగా, శ్రీ. పైవారి యనుగ్రహమున్నచో, గ్రహింపఁదగియు నున్నది. ఇది నామనస్ఫూర్తినిచ్చిన యభిప్రాయము.

గుంటూరు,
6-2-1921.

చిత్తగింపుఁడు
శిష్టా హనుమచ్ఛాస్త్రి,
పురోన్నత పాఠశాల తెలుఁగు పండితుఁడు.

బ్రహ్మశ్రీ చావలి శ్రీరామశాస్త్రిగారికి పింజమూరి చిన్న సుబ్బరావు అనేక నమస్కారములు చేసి చేయంగల విన్నపములు:—

తమరు దయతో పంపిన పుస్తకను, రెండు తరములును జేరినవి. ఈమధ్యను తరుచుజరూరు వ్యవహారములమీఁద పిఠాపురము వెళ్ళివచ్చుచుండుటచే జవాబు వెంటనే వ్రాయలేక పోయినందుకు క్షమింపవలెను సిన్నను తమ ద్రోణచరిత్రను సాంతముగఁ జదివితిని. లోకముభ్రమింపఁ జేయుటకయి కృతి

మాలంకారములతో నింపబడినకృతివలెఁగాక, కేవలము విద్యార్థులయుపయోగార్థము సదుద్దేశ్యముతో స్వాభావికకల్పనాలంకారశోభితయగునట్లు రచింపఁబడిన కృతిరమణీయముగనుండక మఱెట్లుండును? ఇట్టివచనగ్రంథములఁజదువుటచేతనే మన పూర్వులకావ్యములందు అభిరుచి మనవిద్యార్థులకుఁ దప్పకజనించునని నాయభిప్రాయము. గ్రంథముయొక్క చక్కని శైలియు, సందర్భాను సారముగ నక్కడక్కడఁ జొప్పింపఁబడిన మూలగ్రంథమునందలి పద్యములును, ఇందుకు బాగుగఁదోడ్పడఁగలవు. ఇటులనే ఇతర మహాపురుషుల చరిత్రములనుగూడ రచించి చదువరులకు మేలొనర్తురుగాక! అందుకుఁదగినయుత్సాహమును, దోడ్పాటునుపరమేశ్వరుఁడు మీకనుగ్రహించునుగాక!

Anakapalli, 13-2-20.

(Sd.) Vinjamuri China SubbaRow, B. A., L. T.
Teacher, Municipal High School.

బ్రహ్మశ్రీ చావలి శ్రీరామశాస్త్రుల వారికి.

అయ్యా,

తామత్యంతాదరమున నొసంగిన ద్రోణచరిత్రము జూచితిని. శైలికథాంశమునకుఁ దగియుండుట కానందమైనది. కథాసందర్భమునుబట్టి నాతికఠినపదముల యర్థము తేటతెల్లమగుచుండుట పాఠకుల భాషాభివృద్ధికి మూలకారణమని నా నిశ్చితాభిప్రాయము. ఉన్నతపాఠశాలలలో నిది పఠనీయగ్రంథముగ నంగీకరింపఁబడుటకు సందియముండరాదు. అట్టిమహో

పకారము విద్యార్థి ప్రపంచమునకుఁగలుగుగాత మని కోరుచు మిమ్ముల నిట్టిగ్రంథముల నసంఖ్యాకముగ వ్రాయ మఱిమఱి పురికొల్పువాఁడ.

ఉన్నతపాఠశాలలో నుపాధ్యాయత్వము వహించిన మీయట్టివారు వ్రాసినపుస్తకములే యుపకార జనకముగ నుండగల్గుననికూడ వ్రాయుచున్నాఁడ.

Guntur, 16-2-21. } (Sd.) G. Venkateswarlu, B.A., L.T., *Girls Range Sub Asst. Inspecter, Guntur.*

బ్రహ్మశ్రీ చావలి శ్రీరామశాస్త్రిుల వారికి:--

అయ్యా!

తాముపంపిన ద్రోణచరిత్ర అందినది. తుదముట్ట నా గ్రంథముం జదివితి. కథ లోకప్రసిద్ధమయినది. భారతమునం దలి యాయాపర్వములనుండి యెత్తి మృదుమధురశైలిని బాలుర కతినీతిబోధకముగ వ్రాయంబడియున్నది. ఈపొత్తము IV, V, VI ఫారములలోని బాలురకు పాఠ్యముగ నియమించిరేని విద్యాశాఖవారు బాలురకెంతయు నుపకారము సల్పినవారగుదురనుట కేమాత్రము సందియముండదు.

ఇట్లు
సంగ శేషాచలశాస్త్రి,
ఆంధ్రోపాధ్యాయుఁడు,
పచ్చయప్ప పాఠశాల.

మద్రాసు, 10-3-21.

బ్రహ్మశ్రీ చావలి శ్రీరామశాస్త్రిలవారికి.

అయ్యా !

తాము దయతోఁ బంపిన ద్రోణచరిత్రమును జూచితిని. శైలిమిగుల అనుకూలముగనున్నది. ఈ పుస్తకమునందలి కథయు మిక్కిలి ఉత్తమమైనదియు బాలురుత్సాహముతో నేర్చుకొనవలసినదియునై యున్నదని నాయభిప్రాయము. ఇది బోధనాభ్యసన పాఠశాలలోగాని, ఉన్నత పాఠశాలలలోని 4, 5, 6 పాఠములలోగాని పఠనీయగ్రంథముగా నుండఁదగినదని నేను దృఢముగా నమ్ముచున్నాను.

(Sd). T. ThirumalaRao Naidu, B. A., L. T.,
Dy. Inspecter of Schools, South Range Guntur,
Secretary Dist. Educational Council, Guntur,
Member Training Schools
Telugu Text Book Committee.

బ్రహ్మశ్రీ చావలి శ్రీరామశాస్త్రిగారిచే విరచితంబగు ద్రోణచరిత్రం బామూలాగ్రంబు చదివినాడను. అయ్యది మృదుమధుర పదపుంజరంజితంబై చదువరులకు హృదయంగమంబై విద్యార్థుల భాషాభివృద్ధికి నాలవాలంబై శబ్దార్థాలంకారంబులకు గుదురై కథాసంవిధాన చమత్కృతిచే గరంబు ప్రకాశించుచున్నది.

అయ్యది మృదుమధురములైన శబ్దములతో గూడి నాతికఠినమై. గంభీరములగు భావములతో నెలకొని నాతిసులభమై నీతిజనకములగు వాక్యములతో గూడి యున్నది. చదువ జదువ బాలురకు నింపు జనింపజేయు శైలి గలిగియున్నది. ఎచ్చట జూచినను రసముతో నిండియున్నది. రసవంతములైన శబ్దార్థా లంకారములతో నొప్పుచున్నది. విద్యార్థులకు భాషాభివృద్ధిగలిగించుటయందు తోడ్పడుచున్నది. కావున నిట్టి పుస్తకము స్కూల్ ఫైనల్ క్లాసు బాలురకు పఠన గ్రంథముగా నియమింపబడినయెడల విద్యార్థుల భాషాభివృద్ధి కాగలదని నా యభిప్రాయము. ఇట్టి గ్రంథకర్తకు దగిన యుత్సాహము సర్వశక్తిమంతుడగు దేవుడనుగ్రహించును గాక.

Ongole, 2–11–1923. (Sd) G. Vandanam, *Headmaster, A. B. M. High School.*

ఆంధ్రపత్రిక సారస్వతానుబంధము రౌద్రి సం॥ ఫాల్గుణ బ 3 శనివారం.

ద్రోణచరిత్ర:--బ్రహ్మశ్రీ చావలి శ్రీరామశాస్త్రిగారు మూలగ్రంథమగు మహాభారతమునందలి కథ కనుసరణీయముగా వచనరూపమున దీనిని రచియించి యాంధ్రప్రపంచమున కెంతయు నుపకారముచేసి తత్కృతజ్ఞతకుఁ బాత్రులైరి. శైలి నాతికఠినమును సలక్షణమునై యున్నది. కథా సంవిధానము సుందరము. గ్రంథము సందర్భశుద్ధియుఁ బాత్రపోషణమును లలితవర్ణనమును గలిగి యొప్పారుచున్నది. బ్రహ్మశ్రీ మంగిపూడి పురుషోత్తమ శర్మగారు రచియించిన భీష్మునిచరిత్రవలెనే నిదియు ననేక రీతులతో నలరారుచున్నది. పాఠశాలలోఁ జదువు విద్యార్థులకుఁ బఠనీయగ్రంథముగ నుపయోగింపఁబడుటకెంతయు దగియున్నది. బాలురకత్యంతోపయుక్తములగు నిట్టి గ్రంథములను ముమ్ముందు పెక్కింటిని వ్రాయునటు లాంధ్రమహాజనులు గ్రంథకర్తగారికిఁ బ్రోత్సాహము గలిగింతురు గాక!

THE A. E. L. M. PRESS, GUNTUR. 1923—675.